అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 30-08-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 192 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు వెల : 6.50



మెరుగైన భవిష్యత్తును సృష్టించడమే వెల్‌నెస్ సెంటర్ లక్ష్యం

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- కన్హశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-షాద్‌నగర్

మెరుగైన భవిష్యత్తును సృష్టించడమే వెల్‌నెస్ సెంటర్ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గం నందిగామ మండలంలోని కన్హశాంతి వనంలో హార్ట్‌ఫుల్‌నెస్ ఇన్‌స్టిట్యూట్ హెూలిస్టిక్ వెల్‌నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. వెల్‌నెస్ బై హార్ట్‌ఫుల్‌నెస్ అనేది గౌదాజీ చేసిన గొప్ప ప్రయత్నమని, ఇది అన్ని చికిత్సా విధానాలను ఒకే ఒక స్థలంలో అందుబాటులోకి తీసుకొచ్చిందని అన్నారు. ఇక్కడున్న థెరపిస్ట్ బృందం అంకితభావం తనను ఆకట్టుకుందన్నారు. సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడానికి ఈ కేంద్రం చాలా అధునాతనంగా సన్నద్ధమై ఉందని, దాజీ ఉన్నతమైన దృష్టి కోణం ప్రకారం సంప్రదాయ జ్ఞానం, ఆధునిక విజ్ఞానం ఈ రెండూ అందమైన, నిర్మలమైన ప్రదేశమైన ఈ కన్హాశాంతి వనంలో కలగలసి వచ్చాయని వివరించారు. అందరికీ సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడం, ఇంకా ప్రజలకు ఒకే ఒక్క ప్రదేశంలో శారీరక దృఢత్వాన్ని అందించడం దీని లక్ష్యమని తెలిపారు. శారీరక దృఢత్వం ద్వారా మానసిక శ్రేయస్సు సాధించవచ్చని అన్నారు. అనంతరం చీఫ్ మెడికల్ డైరెక్టర్ ఆచార్య డాక్టర్ శ్రీవర్మ మాట్లాడుతూ.. వివిధ ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో హెూలిస్టిక్ మెడిసిన్ కీలకమైనదని తెలిపారు. తాము పోలారిటీ, ఇంకా క్వాంటమ్ హీలింగ్‌తో పాటు ఆయుష్‌ను, ఆధునిక వైద్యాన్ని ఒకే చోటకు చేర్చామని వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రియాంక శివశంకర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నవతెలంగాణ-జనగామ

జిల్లాలో ప్రజలు, అధికారులు సమన్వయంతో పనిచేసి గొప్ప విజయాలను అందుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. గురువారం జనగామ జిల్లా పర్యటనకు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను జిల్లా కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్, డీసీపీ రాజమహేంద్రనాయక్ శాలువాలు కప్పి, పూల మొక్కలతో సాదరంగా ఆహ్వానించారు. ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాన్ని అందించి స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమంపై వివిధ శాఖల జిల్లా అధికారులు, జిల్లాకు చెందిన ప్రముఖ కవులు, కళాకారులు, జాతీయ, రాష్ట్ర పురస్కార గ్రహీతలతో సమావేశమయ్యారు. జిల్లా కలెక్టర్ రిజ్వానాబాషా జిల్లా ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతలను, చారిత్రక నేపథ్యాన్ని గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఈ సందర్భాన్ని జీవితకాలం జ్ఞాపకం ఉంచుకుంటానని, ఎందరో కళాకారులు, కవులు, రచయితలు, ప్రఖ్యాతిగాంచిన మహోన్నత వ్యక్తులకు జన్మనిచ్చిన ఈ నేలపై



స్వచ్ఛ భారత్‌లో ప్రజలు భాగస్వామ్యం కావాలి
జనగామలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

అడుగుపెట్టడం తన అదృష్టమని అన్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌ను అభినందిస్తూ ఇటువంటి వసతుల కల్పనతో ప్రజలపై ఆర్థిక భారం తగ్గుతుందని, అదే సమయంలో హబ్‌లో పాథాలజిస్ట్‌లను నియమించి, నివేదికలను ధృవీకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చదనాన్ని పెంపొందించడానికి చెట్లపెంపకం పట్ల తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. చేనేత కార్మికులు ప్రదర్శించిన చీరెలపై ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తూ, చేనేత ఉత్పత్తి కేవలం ఒక వస్త్రం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి తన పరిపూర్ణ సామర్థ్యాన్ని చేరుకోవడానికి చేసిన పోరాటాన్ని ప్రతిబింబించే చరిత్ర అని తెలిపారు. దేశంలోని అతి పెద్ద కార్యక్రమంలో ఒకటైన స్వచ్ఛ భారత్‌లో ప్రజల భాగస్వామ్యం కావాలని సూచించారు. ఇక్కడి ప్రజల ప్రేమ, ఆప్యాయతలను, అధికారుల ఆతిథ్యాన్ని అభినందిస్తూ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. నిజాం, అతని అనుచరులకు వ్యతిరేకంగా అనేక విప్లవాత్మక ఉద్యమాలకు, ఆందోళనలకు జన్మస్థలం జనగామ అని తెలిపారు. ఇక్కడి ఉద్యమాలు తర్వాతి కాలంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు వ్యాప్తిచెంది రాష్ట్రాన్ని ప్రభావితం చేశాయని అన్నారు. అలాగే, అనేక సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు జిల్లా ప్రసిద్ధి చెందిందని పేర్కొన్నారు.

దేవాలయాలు ప్రజల సాంస్కృతిక జీవన విధానాలకు నిదర్శనం



జనగామ మండలంలోని ఓబుల్ కేశవపూర్ గ్రామంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని గవర్నర్ సందర్శించారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లు స్వగ్రామం కావడంతో ఆ దేవాలయానికి ప్రాధాన్యత సంతరించుకుంది. ఆ గ్రామానికి వచ్చిన గవర్నర్‌కు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. దేవాలయ సందర్శన అనంతరం ప్రజలతో ఏర్పాటు చేసిన ఇష్టాగోష్టిలో గవర్నర్ మాట్లాడారు. చిన్నగ్రామంలో పెద్దదేవాలయం ఉండటం ఎంతో సంతోషకరమన్నారు. దేవాలయాలు ప్రజల సాంస్కృతిక జీవన విధానానికి నిదర్శనం అని తెలిపారు. అనంతరం గ్రామస్తులు.. ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశ్వర్లుతో కలిసి గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు.

సోమేశ్వర ఆలయ సుందరీకరణకు చర్యలు తీసుకోవాలి

గవర్నర్ జిష్ణుదేవ్ శర్మ

నవతెలంగాణ-ఆలేరుటౌన్/ భువనగిరిఅర్బన్

చారిత్రాత్మకతకు నేలవైన ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ సోమేశ్వర ఆలయం సుందరీకరణకు, పురావస్తు శాఖ నడుం బిగించాలని, ఆలయ పూర్వ వైభవాన్ని తీసుకురావాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవశర్మ, రాష్ట్ర పురావస్తు శాఖ అధికారులకు సూచిం చారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలైన శ్రీ సోమేశ్వర ఆలయం, జైన దేవాలయాలను గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. వేద పండితులు ఆశీర్వాదచనం చేశారు. అనంతరం పురావస్తు శాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ నాగరాజు, రంగాచారి, నాగలక్ష్మి ఆలయ చరిత్ర, దేవాలయ ప్రాంగణంలోని పురావస్తు శాలలో ఉన్న విగ్రహాలు, శాసనాల గురించి వివరించారు. అనంతరం భువనగిరిలోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాన్ని గవర్నర్ దర్శించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

చెరువులను అభివృద్ధి చేస్తాం

- జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి
- శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని చెరువులు పరిశీలన
- వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన




నవతెలంగాణ-శేరిలింగంపల్లి

చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు కృషి చేస్తామని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి తెలిపారు. గురువారం రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి జోన్ పరిధిలో జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డితో కలిసి ఆమె పర్యటించారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, చందానగర్ డివిజన్‌లోని గంగారం చెరువు, మియాపూర్ డివిజన్‌లోని గురునాథం చెరువును మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చెరువుల సంరక్షణతో పాటు వాటి సుందరీకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రధానంగా విలువైన చెరువు స్థలాల సంరక్షణ, చెరువు కట్టల పటిష్టం, డ్రయినేజీ నీరు చేరకుండా డైవర్షన్, ఛానెళ్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్, పచ్చదనం సహా పలు ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేస్తామన్నారు. గోపి చెరువు రూపురేఖలు మార్చుకుని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధం అయ్యేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాల పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గోపినగర్‌లో ప్రతి ఇంటికీ స్వయంగా వెళ్లి అవగాహన కల్పించారు. అలాగే వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని, నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి, మియాపూర్, చందానగర్, డివిజన్ల కార్పొరేటర్లు రాగం నాగేందర్ యాదవ్, శ్రీకాంత్, మంజుల రాఘునాథ్‌రెడ్డి, ఇరిగేషన్, ఇంజనీరింగ్, శానిటేషన్ శాఖల అధికారులు, సీఐ పాలవెల్లి, ఎస్ఐ రఘు, గోపినగర్‌వాసులు యాదా గౌడ్, గోపాల్ యాదవ్, సైదులు, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి.. మహిళ గొంతు కోసి..

- ఇంట్లోకి చొరబడి దొంగల బీభత్సం
- రూ.లక్ష నగదు, ఐదు తులాల బంగారం, మోటార్ సైకిల్ చోరీ



నవతెలంగాణ-మల్హర్‌రావు/కాటారం

జయశంకర్-భూపాలపల్లి జిల్లా కాటారం మండలం బస్వాపూర్ గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓ కిరాణం షాపులో దొంగలు చొరబడి బీభత్సం సృష్టించారు. ఇంట్లో వారిని కత్తితో బెదిరించి.. మహిళ గొంతు కోసిన ఘటన స్థానికులను బయభ్రాంతులకు గురిచేసింది. కాటారం పోలీసులు తెలిపిన కథనం ప్రకారం.. బస్వాపూర్ గ్రామానికి చెందిన మహిళ పగడాల స్వర్ణలత పని నిమిత్తం ఇంటి నుంచి బయటకు వచ్చింది. ముగ్గురు వ్యక్తులు ఆమెను కత్తితో బెదిరించి ఇంటిలోకి చొరబడ్డారు. భర్త తిరుపతి బయటకు రాగా అతన్ని కొట్టి కట్టివేశారు. మహిళను కొట్టడంతో పాటు కత్తితో బెదిరించి గొంతు కోశారు. ఇంట్లోని 5 తులాల బంగారం, రూ.లక్ష నగదుతో పాటు అతని మోటార్ సైకిల్ దొంగిలించి పారిపోయారు. గాయపడిన స్వర్ణలతను చికిత్స కోసం భూపాలపల్లిలోని ప్రయివేటు హాస్పిటల్‌కు తరలిం చారు. పోలీసులకు సమాచారం అందివ్వగా.. భూపాలపల్లి జిల్లా అదనపు ఎస్పీ బోనాల కిషన్, కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, కాటారం సీఐ నాగార్జునరావు, ఎస్ఐ అభినవ్ సంఘటనా స్థలానికి చేరుకొని అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. నిందితుల ఆనవాళ్ల కోసం జాగిలాలతో పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దొంగలను పట్టుకునేందుకు జాతీయ రహదారిపై టోల్‌గేట్ వద్ద, ఇతర ప్రాంతాల్లో ఉన్న సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నట్టు డీఎస్పీ తెలిపారు. రెండు బృందాలను ఏర్పాటు చేసి దొంగలను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్టు సీఐ చెప్పారు.

ఏండ్లు గడుస్తున్నా పరిహారం, ఉపాధి లేదు

- కొండంపల్లి గ్రామాన్ని తరలించాలి
- సింగరేణి బ్లాస్టులతో రక్షణ కరువైంది..: ఓసీ-3 వద్ద గ్రామస్తుల ధర్నా



నవతెలంగాణ-గణపురం

తమ పిల్లలకు ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని, భవిష్యత్తుకు భరోసా ఉంటుందన్న ఆశతో తమ విలువైన పంట పొలాలను సింగరేణి యాజమాన్యానికి అందిస్తే.. ఏండ్లు గడుస్తున్నా పరిహారం, ఉపాధి అందించకుండా తమను అందకారంలోకి నెట్టివేశారని జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం కొండంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం కొండంపల్లి గ్రామాన్ని తరలించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ధర్మరావుపేట రెవెన్యూ గ్రామ శివారు ఓసీ-3 వద్ద గ్రామస్తులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం తమ భూములను స్వాధీనం చేసుకునే ముందు గ్రామంలో నిర్వహించిన సభలో అనేక హామీలు ఇచ్చారని, ఇప్పుడు వాటిని నెరవేర్చడం లేదని వాపోయారు. పైగా సింగరేణి రోజువారీగా బొగ్గు ఉత్పత్తి సాధనలో చేపడుతున్న బాంబు బ్లాస్టింగ్స్ వల్ల తమ ఇండ్లపై మట్టి పెళ్లలు పడుతూ, బొగ్గు మంటలు చెలరేగుతూ విషవాయువులు వ్యాపిస్తున్నాయని అన్నారు. దాంతో చిన్నపిల్లల నుండి పెద్దవారు కూడా తీవ్ర అనారోగ్యం పాలై ఆస్పత్రుల పాలవుతున్నామని తెలిపారు. వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న గ్రామస్తులందరి వ్యవసాయ భూములు తీసుకుని తమ గ్రామాన్ని తరలిస్తామంటూ 8నెలలు దాటినా తమకు కేటాయిస్తామన్న ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదని, ఇంతవరకు అభివృద్ధి పనులు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రామాన్ని తరలించాలని వేడుకున్నారు. వ్యవసాయ భూమికి రూ.25లక్షలు ధర నిర్ణయించి నష్టపరిహారం అందివ్వాలని, కొండంపల్లి గ్రామానికి సంబంధించిన పంటభూములకు గని కార్యక్రమాల వల్ల జరిగిన పంట నష్టానికి నష్ట పరిహారం వెంటనే ఇవ్వాలని కోరారు. మిగిలిపోయిన వ్యవసాయ భూమి, పనికిరాని భూములకు డీఎస్ ప్రకటించి నష్టపరిహారం అందివ్వాలని, కొండంపల్లి గ్రామంలోని నిరుద్యోగ యువతకు, దళిత ఆడబిడ్డలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. భూ నిర్వాసిత రైతు కుటుంబాలకు ఆరోగ్య భద్రత, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. తమ ముందు నుంచే వాహనంలో భూపాలపల్లి జీఎం వెళ్లారని, కానీ కనీసం తమతో మాట్లాడలేదని, ఇది ఎంతవరకు సబబని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాధికారులు, సింగరేణి జీఎం వచ్చి అధికారికంగా రాతపూర్వకంగా రాసి ఇస్తేనే ధర్నా విరమిస్తామని గ్రామస్తులు ముక్తకంఠంతో నినాదాలు చేస్తూ భైటాయించారు. ధర్నా స్థలానికి స్థానిక ఎస్ఐ రేఖ అశోక్ చేరుకొని భూ నిర్వాసిత రైతులతో చర్చించి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. వారం రోజుల్లో సమస్య పరిష్కరించేలా ప్రయత్నిస్తానని, ధర్నా విరమించాలని కోరారు.

గడువులోపు సమస్యలు పరిష్కారం కాకపోతే మళ్లీ ధర్నా చేపడతామని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు సహకరించాలని కోరుతూ గ్రామస్థులు ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో కొండంపల్లి భూ నిర్వాసిత రైతులు మోతె కర్ణాకర్ రెడ్డి, దాసరి లక్ష్మయ్య, వంగ రవి, సుంకరి రాజు, మాధవ రెడ్డి, జగ్గారెడ్డి, చిత్తారి దేవేందర్, కుమార స్వామి, దాసరి అజిత్, విజయ, ఎడ్ల యాకుబ్, యాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కన్నతల్లిని ఇంటి నుంచి గెంటేసిన కొడుకు

- పట్టా భూములు, బంగారం అంతా అమ్ముకున్నరు..
- పట్టించుకుంటలేరంటూ.. అమ్మ ఆవేదన



నవతెలంగాణ-నిజాంపేట

తల్లి వద్ద నున్న భూమి, బంగారం అంతా అమ్ముకొని చివరకు ఆమెకు ఏమీ మిగల్చకపోగా, భారమంటూ ఇంటి నుంచి తన్న తల్లినే కొడుకు గెంటేసిన ఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలంలో గురువారం చోటుచేసుకుంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కుంట సత్తవ్వ (70)కు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్తవ్వ భర్త కుంట ఎల్లయ్య అనారోగ్యంతో మరణించగా ఆమె చిన్న కుమారుడు కుంట కృష్ణ గుండెపోటుతో మృతిచెందారు. చిన్న కుమారుడు చనిపోకముందే.. సత్తవ్వ పేరు మీద ఉన్న భూములను ఇద్దరు కొడుకులు అమ్ముకొని ఆమె దగ్గర ఉన్న బంగారాన్ని లాక్కొన్నారు. చిన్న కొడుకు చనిపోవడంతో పెద్ద కుమారుడు రమేశ్ వద్దనే ఆమె ఉంటోంది. రమేష్.. మెదక్‌లో కూరగాయల వ్యాపారం చేస్తున్నాడు. కాగా, రోజు తాగి వచ్చి పింఛన్ డబ్బులు ఇవ్వాలని గొడవ పడేవాడు.. ఇవ్వకుంటే.. చంపేస్తానని బెదిరించేవాడు. ఈ క్రమంలో సత్తవ్వను పెద్ద కొడుకు రమేష్ ఇంటి నుంచి గెంటి వేయడంతో ఆమె రోడ్డున పడింది. 'కనీ పెంచి.. చిన్నప్పటి నుంచి కంటికి రెప్పలా కాపాడుతూ.. పెద్దవారిని చేయడం తాను చేసిన పాపమా?" అని తల్లి సత్తవ్వ బోరున విలపించింది. పెన్షన్ డబ్బుల కోసం అక్కడక్కడ హత్యలు జరుగుతున్న సంఘటనను గుర్తుచేసుకొని గుండెలు పగిలేలా రోదించింది. ఇటువంటి పరిస్థితి ఎవరికి రాకూడదని, ఇకనైనా ప్రభుత్వం స్పందించి తనకు తగిన న్యాయం చేయాలని బాధితురాలు సత్తవ్వ వేడుకుంది.

కోర్టు ఆవరణ నుంచి నిందితుడు పరార్

- గాలించి పట్టుకున్న పోలీసులు



నవతెలంగాణ-కోదాడరూరల్

కోర్టు ఆవరణ నుంచి ఓ దొంగ పారిపోయిన ఘటన సూర్యాపేట జిల్లా, కోదాడ పట్టణంలో గురువారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడి గోపిపై దొంగతనం కేసు నమోదైంది. ఈ విషయంలో కోదాడ కోర్టుకు హాజరు పరిచేందుకు ఖమ్మం జిల్లా జైలు నుంచి సూర్యాపేట జిల్లా ఏఆర్ పోలీసులు తీసుకొచ్చారు. ఈ క్రమంలోనే హ్యాండ్ కప్స్ తీసుకొని అతను పరార య్యాడు. ఎస్కార్ట్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే నిందితుడు పారిపోయాడని పలువురు ఆరోపించారు. అయితే.. అనంతగిరి మండలం శాంతినగర్ వద్ద లారీ ఎక్కి పారిపోవడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో ఐడిపార్టీ పోలీసులు గోపిని పట్టుకొని టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు సమాచారం. గోపి పెన్ పహాడ్, నూతనకల్, కూసు మంచి పోలీస్ స్టేషన్ల పరిధిలో దేవాలయాల్లో హుండీలు, గంటలు చోరీలు చేశాడు. మిర్యాలగూడ, కోదాడలో కూడా ద్విచక్ర వాహనాల దొంగతనం చేశాడు. చోరీ చేసిన వస్తువులను అమ్మడానికి కోదాడకు రాగా.. వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు.

కృష్ణమ్మ పరవళ్లు

- నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు పోటెత్తిన వరద ప్రవాహం
- 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- కొనసాగుతున్న 3,55,910 క్యూసెక్కుల ఇన్ ఫ్లో
- పర్యాటకుల సందడి



నవతెలంగాణ-నాగార్జునసాగర్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ఎగువనున్న ప్రాజెక్టులన్నీ నిండు కుండలా మారడంతో వచ్చిన నీటిని వచ్చినట్టు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం 10 క్రస్ట్ గేట్లు, కుడి, ఎడమ జల విద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతుండటంతో 3,55,910 క్యూసెక్కుల నీరు నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోంది. దీంతో ఎన్ఎస్పీ అధికారులు 12 క్రస్ట్ గేట్లను 5 అడుగులు, 14 క్రస్ట్ గేట్లను 10అడుగుల మేర మొత్తం 26 క్రస్ట్ గేట్లను ఎత్తి 3,07,382 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. గురువారం ఉదయం నుంచి 18గేట్ల ద్వారా కొనసాగిన నీటి విడుదల.. ఆ తర్వాత వరద ప్రవాహం మరింత పెరగడంతో 26 గేట్లను ఎత్తారు. వచ్చిన నీటిని వచ్చినట్టు దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా, ప్రస్తుతం 590 అడుగుల వద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా, ప్రస్తుతానికి 312.0450 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,461 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 9387 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 8280 క్యూసెక్కుల నీటిని, ఎస్-ఎల్‌బిసి ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని, లోలెవల్ కెనాల్ ద్వారా 600క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్ నుంచి మొత్తం 3,55,910 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

పర్యాటకుల సందడి

నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగడం డ్యామ్ అందాలను చూసేందుకు పర్యాటకులు భారీగా తరలివచ్చారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీ లాంచీ స్టేషన్ వద్ద, డ్యామ్, కొత్త బ్రిడ్జి, పాత వంతెన వద్ద పర్యాటకుల సందడి వాతావరణం నెలకొంది. డ్యామ్ విద్యుత్ జలకేంద్రం వద్ద రద్దీ ఉంది.

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనంపై సమగ్ర అధ్యయనం

- కార్మిక సంఘాల పునరుద్ధరణ చేస్తాం : ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నాయకులతో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల బాధ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో కూనంనేనితోపాటు టీజీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు మజీద్, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న కలిసి వినతిపత్రం సమర్పించారు. 2013 బాండ్ డబ్బులు విడుదల చేయాలని కోరగా వెంటనే విడుదల చేస్తామంటూ సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. కార్మిక సంఘాల పునరుద్ధరణ గురించి ప్రస్తావించగా.. 'ఇంతపెద్ద ఆర్టీసీ సంస్థలో కార్మిక సంఘా ల్లేకుంటే వాళ్ల బాధలు ఎవరికి చెప్పు కుంటారు. కచ్చితంగా కార్మిక సంఘా లను పునరుద్ధరిస్తాం. ప్రభుత్వంలో ఆర్టీసీని విలీనం చేసే అంశంపై గత ప్రభుత్వం లోతుగా అధ్యయనం చేయలేదు. సంస్థ ఆస్తులకు భంగం కలగకుండా ఉద్యోగుల సౌకర్యాలు, హక్కులకు హాని కలగకుండా సమగ్ర అధ్యయనం చేస్తాం'అని రేవంత్‌రెడ్డి అన్నారని వివరించారు. మిగతా అంశాలను పూర్తిగా అధ్యయనం చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ యూసుఫ్, ఎస్ బాలరాజుకు ధన్యవాదాలు ప్రకటించారు.

6న జీపీల్లో పంచాయతీ ఎన్నికల ఓటర్ల ముసాయిదా జాబితా

- ఆ తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో పార్టీల నేతలతో భేటీలు
- ఓటర్‌లిస్టుపై అభ్యంతరాలు, సూచనల స్వీకరణ
- ఎన్నికల ప్రక్రియ, పోలింగ్ సిబ్బందికి శిక్షణలో గైడ్‌లైన్స్ పాటించాలి : రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారధి ఆదేశాలు
- కలెక్టర్లు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వార్డులు, గ్రామపంచాయతీల వారీగా రూపొందించిన ఓటర్ల ముసాయిదా జాబితాను సెప్టెంబర్ ఆరోతేదీన పంచాయతీ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ సి.పార్థసారధి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో త్వరలో జరుగనున్న గ్రామపంచాయతీ రెండో సార్వత్రిక ఎన్నికల ఓటర్ లిస్టు తయారీ, ప్రచురణ పురోగతిపై గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లు (హైదరాబాద్ మినహాయింపు), అడిషనల్ కలెక్టర్లు(స్థానిక సంస్థలు), జిల్లా పంచాయతీ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, అసెంబ్లీ నియో జకవర్గాల ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్‌కుమార్, కమిషనర్ అనితారామచంద్రన్, అడిషనల్ డైరెక్టర్ జనరల్ సంగ్రామ్, కలెక్టర్లు, పంచాయతీ అధికారులు, సెంటర్ ఫర్ గుడ్‌గవర్నెన్స్, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రూపొందించిన ఓటర్ల లిస్టుల ప్రకారం యధావిధిగా వార్డు, పంచాయతీ వారీగా జాబితాను తయారు చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఆ ముసాయిదా ఓటర్ల జాబితాను పంచాయతీ కార్యాలయంలో అంటించిన తర్వాత మండల, జిల్లా స్థాయిల్లో వేర్వేరుగా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం ఏర్పాటు చేయాలనీ, వారి నుంచి అభ్యంతరాలు, సూచనలు, సలహాలు తీసుకోవాలని ఆదేశించారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏమైనా పొరపాట్లు ఉంటే సెప్టెంబర్ 13వ తేదీ వరకు సంబంధింత మండల పరిషత్ అధికారులకు, జిల్లా పంచాయతీ అధికారులకు రాతపూర్వకంగా తెలపాలని సూచించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత ఆ అధికారులు తగిన చర్యలు తీసుకుని సవరించిన తుది ఓటర్ల జాబితాను సెప్టెంబర్ 21వ తేదీన ప్రచురించాలని ఆదేశించారు. ఎవరైనా అర్హులైన ఓటర్లు తమ పేర్లను గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలో చేర్చుకోవాలన్నా, ఓటర్లుగా ఉండేందుకు ఆక్షేపణలున్నా నిర్దేశించిన ఎన్నికల ఫారమ్‌ను నింపి సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆ ఓటర్ల చేర్పు, తొలగింపు తర్వాతనే గ్రామపంచాయతీ ఓటరు లిస్టును పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఓటర్ లిస్టుల తయారీ తర్వాత వార్డుల వారీగా పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, పోలింగ్ సిబ్బంది వివరాల సేకరణ, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల నియామకం, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, తదితర అంశాలపై అనుసరించాల్సిన పద్ధతులపై అధికారులకు ఆయన వివరించారు. ఈ మొత్తం ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన సర్క్యులర్‌ను తూ.చ తప్పకుండా పాటించాలని స్పష్టం చేశారు. జిల్లాల వారీగా ఓటర్ లిస్టుల తయారీలో పురోగతి, ఎదురవుతున్న ఇబ్బందుల గురించి కలెక్టర్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.



గ్రీవెన్స్ మాడ్యూల్ విడుదల

సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ సహకారంతో రాష్ట్ర ఎన్నికల సంఘం తయారు చేసిన గ్రీవెన్స్ మాడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ సి.పార్థసారధి గురువారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈ మాడ్యూల్ ద్వారా ఎన్నికల ప్రక్రియలో జరుగుతున్న అవకతవకలు, నిబంధనల ఉల్లంఘనపై సాధారణ పౌరులు కూడా ఫిర్యాదు చేయవచ్చునని, అలాంటి ఫిర్యాదుదారుల వివరాలు రహస్యంగా ఉంచుతామని హామీనిచ్చారు. ఆ ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షించి తగిన చర్యలు తీసుకుని ఫిర్యాదుదారునికి తెలియజేస్తారని వివరించారు. దీనివల్ల ఎన్నికలు మరింత పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా జరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 30-08-2024 సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 192 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి
మహిళలకు ఉచిత ప్రయాణంతో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో

ప్రజారవాణా మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి

మెట్రో బోగీలను ఆరుకు పెంచాలి : సీఎం రేవంత్‌రెడ్డికి తమ్మినేని లేఖ

వివరాలు 11లో..



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

'ఓటుకు నోటు' కేసులో సుప్రీం వ్యాఖ్య

కవిత బెయిల్‌పై సీఎం వ్యాఖ్యలను తప్పుబట్టిన ధర్మాసనం

రాజకీయ పార్టీలతో చర్చించి బెయిల్, తీర్పులిస్తున్నామా ? అంటూ నిలదీత

తదుపరి విచారణ సెప్టెంబర్ 2కు వాయిదా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అని 'ఓటుకు నోటు' కేసు విచారణ సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. అయితే ప్రస్తుత స్థితిలో ఓటుకు నోటు విచారణ బదిలీ పిటిషన్‌ను ముందస్తుగా రద్దు చేయడం లేదని స్పష్టం చేసింది. అలాగే ఢిల్లీ మద్యం కేసులో కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ధర్మాసనం తప్పుబట్టింది. ఈ వ్యవహారంలో సీఎంను మందలించింది. తదుపరి విచారణను సోమవారం (సెప్టెంబర్ 2)కు వాయిదా వేసింది. ఓటుకు నోటు కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారని, ఆయన దర్యాప్తును ప్రభావితం చేసే అవకాశాలున్నాయని, అందుకే ఆ కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు, మాజీ డిప్యూటీ సీఎం మహ్మద్ అలీ, మాజీ మంత్రులు జగదీశ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ పికె మిశ్రా, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో ...11లో

అక్రమార్కులపై హైడ్రా కొరడా..

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

సీఎం, సీఎస్, కమిషనర్ ప్రత్యేక దృష్టి

- నిరంతరం సమీక్షలు, అధికారులతో సమావేశాలు
- హైడ్రా పేరిట అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు : సీఎం
- ఏసీబీ, విజిలెన్స్‌లు దృష్టి పెట్టాలంటూ ఆదేశం
- హైడ్రాకు మరిన్ని అధికారాలు
- ఓఆర్ఆర్ పరిధిలోని ప్రభుత్వ భూముల రక్షణ బాధ్యత కూడా ఆ సంస్థకే : సీఎస్ శాంతి కుమారి వెల్లడి
- సీఎం సోదరుడికీ నోటీసులు
- నిబంధనల ప్రకారం లేకుంటే కూల్చేయండి: తిరుపతి రెడ్డి
- హైడ్రాకు రూ.25 లక్షల విరాళమిచ్చిన ఎంపీ అనిల్ యాదవ్



అధికారులతో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గ్రేటర్ పరిధిలో ఒకప్పుడు 200కు పైగా ఉన్న జలాశయాలు నేడు సగం కూడా కనిపించని పరిస్థితి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనల నుంచి పురుడు పోసుకున్న హైడ్రా చెరువులను రక్షించేందుకు నడుం కట్టింది. ఈ దెబ్బకు ఆక్రమణదారులు బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు తమ మీద పడుతుందోననే ఆందోళన వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దవి కలిపి దాదాపు 200కు పైగా నిర్మాణాలను అది కూల్చేసి నట్టు సమాచారం. 50 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువుల భూములను పరిరక్షించినట్టు హైడ్రా ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విద్య, వైద్య సంస్థల ముసుగులో పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు చెరువులు, కుంటలను ...10లో


షోకాజ్ నోటీసులుగా మార్చండి

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం 10లో.

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ ఆస్తులు, చెరువులు, కుంటలు, నాలాల పరిరక్షణే ధ్యేయంగా ఏర్పాటైన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అస్సెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ (హైడ్రా) ఆక్రమణదారులపై కొరడా ఝుళిపిస్తున్నది. ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు లభిస్తుండటంతో అది జెట్ స్పీడ్‌తో దూసుకెళ్తున్నది. తన, మన అనే భేదం లేకుండా ఆక్రమణ అని తేలితే చాలు యాక్షన్లోకి దిగి పని పూర్తి చేస్తోంది. గంటల వ్యవధిలో పెద్ద పెద్ద భవంతులను నేలమట్టం చేస్తోంది. ఫలితంగా భూ మాఫియా గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఎప్పుడు ఎక్కడి నుండి వచ్చి తమ అక్రమ కట్టడాలను నేలమట్టం చేస్తారోనని భయంతో ఆక్రమణదారులు గజగజ వణికిపోతున్నారు. సామాన్య ప్రజల నుంచి బడా నేతలు, సెలబ్రెటీల వరకు అక్రమ కట్టడాలను కూల్చేస్తుండటంతో ప్రజలు హైడ్రాకు జేజేలు పలుకుతున్నారు.

నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతి



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా దండకారణ్యంలో గురువారం పోలీసులు, మావోయిస్టుల కు మధ్య భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో ముగ్గురు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలం నుంచి పెద్ద మొత్తంలో మావోయిస్టుల మెటీరియల్‌తో సహా ఆయుధాలు స్వాధీనం ...11లో

కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌కు ఎమ్మెల్సీ



నవతెలంగాణ-మర్కుక్

మాజీ సీఎం కేసీఆర్ తన కూతురు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను చూసి భావోద్వేగానికి గురయ్యారు. ఎర్రవల్లి గెస్ట్‌హౌస్‌లో నివాసముంటున్న తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ దగ్గరికి గురువారం కవిత, ...11లో



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా గణేష్ ఉత్సవాలు..

అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్

అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి

సుప్రీంకోర్టు నిబంధనలు పరిగణనలోకి తీసుకోవాలి : గణేష్ ఉత్సవ సమితి సమీక్షలో సీఎం రేవంత్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ తొలి నుంచి మత సామరస్యానికి, ప్రశాంతతకు పేరు పొందిందనీ, ఆ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలనీ, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలనీ, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని సూచించారు.

ఔటర్ రింగు రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలనీ, అలా తీసుకోవడం వల్ల ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌లోనే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. సరూర్‌నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయనీ, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద ...10లో

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

ఆ చట్టాన్ని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చింది

అమలుకు కార్యాచరణ సిద్ధం చేయండి : ఆర్థికశాఖకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లకు ప్రాధాన్యతనివ్వండి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించారు. ఆ శాఖ ప్రత్యేక అధికారి మిగతా అన్ని శాఖలను సమన్వయం చేసుకుని ఈ అంశాన్ని పర్యవేక్షించాలని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల ఏర్పాటుకు సబ్ ప్లాన్ నిధుల్లో ప్రత్యేక ప్రాధాన్యతనిస్తామని తెలిపారు. గురువారం హైదరాబాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో 'ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు-ప్రణాళిక'పై వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. సబ్‌ప్లాన్ నిధుల కేటాయింపుల్లో విద్యకు మొదటి ప్రాధాన్యతని వ్వాలని సూచించారు. అంగన్వాడీలు, పాఠశాలల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ తర్వాత కమ్యూనిటీ హాళ్లు, అంతర్గత రహదారులు, డ్రయినేజీ నిర్మాణాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దృష్టి సారించాలని చెప్పారు. సబ్ ప్లాన్ చట్టాన్ని తీసుకొచ్చిన స్ఫూర్తిని కొనసాగించేలా అధికారుల పని విధానం ఉండాలని దిశానిర్దేశం చేశారు. ఎస్సీ, ఎస్టీల జీవితాల్లో ...10లో

సంపాదకీయం

బంగ్లా జమాతేపై నిషేధం రద్దు!




మతోన్మాద జమాత్-ఎ-ఇస్లామీ పార్టీపై ఉన్న నిషేధాన్ని బుధవారం నాడు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం రద్దు చేసింది. ఆ పార్టీ, దాని అనుబంధ విద్యార్థి విభాగానికి చెందినవారు ఉగ్రవాద కార్యకలాపాల్లో పాల్గొంటున్నారంటూ ఆగస్టు ఒకటవ తేదీన నాటి అవామీలీగ్ ప్రభుత్వం నిషేధం విధించింది. తరువాత నాలుగు రోజులకే హసీనా ప్రభుత్వ పతనం, ఆమెను బలవంతంగా మిలిటరీ అధికారులు మనదేశానికి పంపటం తెలిసిందే. తమ దర్యాప్తులో అలాంటి రుజువులేమీ లేవని తేలినందున నిషేధాన్ని ఎత్తివేసినట్లు యూనస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పరిణామం తరువాత తమ పార్టీ నమోదును రద్దు చేస్తూ గతంలో ఒక హైకోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి పునరుద్దరించాలని కోరుతూ సుప్రీం కోర్టులో పిటీషన్ దాఖలు చేయ నున్నట్లు జమాయతే ప్రకటిం చింది. బంగ్లాదేశ్‌లో జమాతే ఇస్లామీ ఒక వివాదాస్పద సంస్థ. బ్రిటీష్ ఇండియాలో 1941లో ఏర్పడిన ఈ సంస్థ బంగ్లాదేశ్ విముక్తి పోరాటాన్ని వ్యతిరేకించటమే గాక పాకిస్తాన్‌తోనే కలసి ఉండాలనే వైఖరి తీసుకుంది. విముక్తి కోసం పోరాడినవారి మీద దాడులు, హత్యలకు పాల్పడింది. దాంతో ముజిబుర్ రహమాన్ ప్రభుత్వం 1972లో దాన్ని నిషేధించింది. ముజిబుర్ హత్య తరువాత అధికారానికి వచ్చిన జియావుర్ రహమాన్ ప్రభుత్వం దాన్ని ఎత్తివేసింది.జమాయతే పార్టీ కార్యకలాపాలు లౌకిక వ్యవస్థ, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్నందున దాని రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ 2009లో దాఖలైన పిటీషన్‌పై 2013లో హైకోర్టు విచారించి ఆమోదించింది. అప్పటినుంచి అది ఎన్నికల్లో నేరుగా పాల్గొనటం లేదు. బంగ్లాదేశ్ నేషనలిస్టు(బిఎన్‌పి), ఇతర పార్టీల కూటమిలో భాగస్వామిగా ఉంటూ అవామీలీగ్‌ను వ్యతిరేకిస్తున్నది. అయితే అవామీలీగ్ అణచివేత చర్యల కారణంగా జమాయతేతో చేతులు కలిపినప్పటికీ దానితో సంబంధాలను వ్యతిరేకించే శక్తులు కూడా బిఎన్‌పిలో ఉన్నాయి.గతేడాది కూడా సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసినప్పటికీ దాని ప్రతినిధులు కోర్టుకు రాని కారణంగా కొట్టివే శారు. ఇప్పుడు రిజిస్ట్రేష న్‌ను పునరుద్దరించేందుకే అవకాశాలున్నాయి. ఒక వేళ అదే జరిగితే జమాతే వచ్చే ఎన్నికల్లో స్వతంత్రంగా పోటీకి దిగటం ఖాయం.

> షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

షేక్ హసీనా ప్రభుత్వానికి, ఆమె పార్టీకి మద్దతిచ్చిన కారణంగా ఆమె పతనం తరువాత బంగ్లాదేశ్‌లో భారత వ్యతిరేకత పెద్దఎత్తున ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. హసీనా దౌత్య వీసాను ప్రభుత్వం రద్దు చేసింది.హత్యతో సహా అనేక కేసులను నమోదు చేసింది. దీంతో ఆమెను తమదేశానికి అప్పగించాలన్న డిమాండ్‌ను అక్కడి అవామీలీగ్ వ్యతిరేక పార్టీలు పదేపదే డిమాండ్ చేస్తున్నాయి. ఆమె గురించి నరేంద్రమోడీ సర్కార్ మౌనంగా ఉండటంతో సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు. అవామీలీగ్ ఇతర పార్టీనేతల మీద కూడా కేసులు నమోదు చేయటమేగాక ఇప్పటివరకు ఇద్దరు మాజీ మంత్రులను అరెస్టు చేశారు. బంగ్లాదేశ్-మనదేశం మధ్య 54వరకు చిన్నా పెద్ద నదులు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బంగ్లాదేశ్‌లో అనేక చోట్ల వరదలు వచ్చాయి.పది లక్షల మంది పౌరులు ప్రభావితమయ్యారు. దీని వెనుక భారతహస్తం ఉందని, అక్కడి రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేసిన కారణంగానే ఇదంతా జరిగిందనే ప్రచారం జరుగుతోంది. త్రిపురలోని గోమతి నది మీద ఉన్న డంబూర్ డామ్ నిండిపోయిన కారణంగా నీటిని దిగువన ఉన్న బంగ్లాదేశ్‌వైపు విడుదల చేయటం మినహా మరొకమార్గం లేదు. అదే జరిగింది, దాన్ని కావాలనే విడుదల చేసినట్లు మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొడు తున్నారు. అక్కడి మన వీసా జారీ కార్యాలయాల్లో తమ పౌరులకు వీసాల జారీని కావాలనే జాప్యం చేస్తున్నారంటూ అనేక మంది నిరసన ప్రదర్శనలకు దిగారు.హసీనా ప్రభుత్వ పతనం తరువాత మనదేశం సిబ్బందిని తగ్గించిన కారణంగా ఆలస్యం జరుగుతున్నది. ఈ పరిస్థితిని కూడా మనదేశం మీద వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకకు కొన్ని శక్తులు చూస్తున్నాయి.

బంగ్లాదేశ్ యువతలో ఉన్న ఆగ్రహానికి దేశ ఆర్థిక పరిస్థితి కూడా ఒక కారణం.విదేశీ చెల్లింపుల సమస్యలతో పాటు ఇటీవల వచ్చిన వరదలు కూడా గోరుచుట్టు మీద రోకటిపోటులా మారాయి. ఆగస్టు 21వ తేదీ నాటికి విదేశీ మారకద్రవ్య నిల్వలు 20బిలియన్ డాలర్లు మాత్రమే ఉన్నాయి. మొత్తంగా మరో 11బిలియన్ డాలర్లు అవసరం కాగా డిసెంబరు నాటికి కనీసం 8బిలియన్ డాలర్లు అవసరమని అంచనా వేసి ఐఎంఎఫ్‌తో సహా వివిధ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నారు.అక్కడి జనం షేక్‌హసీనా గద్దె దిగాలని మాత్రమే కాదు, తమ పరిస్థితి మెరుగుపడాలని కూడా కోరు కుంటున్నారు. అది జరగకపోతే మరోసారి ఆందోళన మరోరూపంలో జరగటం ఖాయం.

వేమన కవిత్వం : వైజ్ఞానిక దృక్పథం



డాక్టర్ దేవరాజు మహారాజు


సమాజంలో మనిషి ఎలా మెలగాలో, విజ్ఞతను, వివేకాన్ని ఉపయోగిస్తూ ప్రతి విషయం తర్కబద్ధంగా ఎలా ఆలోచించాలో ఈ ప్రపంచానికి తెలియజెప్పిన తెలుగుకవి వేమన. కుల మతాలు, ప్రాంతీయ భేదాలు, లింగ వివక్ష లేకుండా ప్రతి మనిషీ మానవీయ విలువలను నిలుపుకుంటూ ఎలా బతకాలో చెప్పిన మానవవాది వేమన. ఆయన చెప్పాలనుకున్నది ఆటవెలదిలో చెప్పినా, తెలుగు సాహిత్య రంగంలో తన కవిత్వంతో ఒక బలమైన ముద్ర వేసుకున్నా-ఆయన అక్కడికే పరిమితం కాలేదు. అదే కవిత్వంతో సమాజ ఉద్ధారకుడిగా, సంఘ సంస్కర్తగా కూడా ఎదిగాడు. అందువల్ల వేమన క్రాంతిదర్శి, దార్శనికుడు అని కూడా చెప్పుకోవాలి!

ఎంతో శ్రమకోర్చి గ్రంథస్థం కాని దశలో వేమన పద్యాలు ఒక్కొక్కటి సేకరించి, ముద్రించి వాటిని అను వాదాల ద్వారా యూరోప్ దేశాలకు పరిచయం చేసిన సి.పి. బ్రౌన్ (1798-1884)కి తెలుగుజాతి రుణపడి ఉండాలి. వేమన కవిత్వం సమగ్రంగా ఒకచోట భద్రపరిచిన తరువాత, వాటిని పరిశీలించి వ్యాఖ్యానాలు, వివరణలు చాలామంది రాస్తూ వచ్చారు. అది కొంత సులభమైన పని. తొలితరం మలితరం రచయితలు, పరిశోధకులు కొంత ముడిసరుకు అందించిన తర్వాత, ఇటీవలి ఆధునిక కాలంలో కొందరు సిద్ధాంత వ్యాసాలు రాసి, పలు విశ్వవిద్యాలయాల నుండి డాక్టరేట్ పట్టాలు పొందారు. అప్పటికీ ఇప్పటికీ వేమన పద్యాలు సమాజంలో ప్రకాశవంతంగా వెలుగులు విరజిమ్ముతూనే ఉన్నాయి. అయితే వాటిమీద వెలువడిన సిద్ధాంత వ్యాసాలు జన బహుళ్యంలోకి వెళ్లలేదు. ఆధునిక సాంకేతిక వనరులన్నీ అమరిన తర్వాత, వేమన కవిత్వం మీద రాయడం గొప్ప పనికాదు. ఎక్కడ ఏమీలేని రోజుల్లో ఎంతో శారీరక, మానసిక శ్రమకోర్చి పనిచేయడం మాటలు కాదు. అందుకే అంటున్నాను. సి.పి. బ్రౌన్ నిజాయితీ, నిబద్ధతల్ని గుర్తు చేసుకుని - వేమనని బతికించి ఈ తెలుగుజాతికి అంకితం చేసిన ఆ ఆంగ్లేయుడికి ప్రతి తెలుగువాడు నమస్కరించుకోవాలి!

ప్రపంచంలో ఆధునిక వైజ్ఞానిక పరిశోధనలు ప్రారంభమౌతున్న తొలిదశలో సాధారణ శకం 1652 -1730 జ.జు. మధ్యకాలంలో వేమన జీవించాడు. అప్పటికి 'వైజ్ఞానికుడు' సైంటిస్టు అనే పదమే వాడుకలోకి రాలేదు. అలాంటి వారిని 'నేచురల్ ఫిలాసఫర్స్' అని వ్యవహరించేవారు. అవి జ్యోతిషం ఖగోళ శాస్త్రంగా రూపాంతరం చెందుతున్న రోజులు. ల్యూవెన్ హక్ (1622-1723 జ.జు) ఆ కాలానికి సూక్ష్మదర్శినిని తయారు చేయగలిగాడు. కానీ, అప్పటికి అది ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి రాలేదు. అలాగే, అప్పుడప్పుడే న్యూటన్ (1643-1727 జ.జు) తన చలన సూత్రాలు వెల్లగించిన రోజులు.

ఇక మనదేశానికి వస్తే, దక్షిణ భారతదేశంలో కొన్ని ప్రాంతాలు మినహాయిస్తే దేశం మొత్తం మొఘలుల పాలనలో ఉంది. వీరి రాజ్యానికి కిందిభాగం మరాఠా పాలకుల స్వాధీనంలో ఉంది. వేమన జీవించిన 17వ శతాబ్దంలో దక్షిణ భారతదేశం తంజావూర్ నాయక్‌ల పరిపాలనలో ఉంది. వారు తెలుగు సాహిత్యాన్ని, కళల్ని ఎంతగానో ప్రోత్సహించారు. వేమనకు ఒకటిన్నర శతాబ్దాలకు ముందే పోర్చుగీస్ నావికుడు వాస్కోడాగామా కేరళ-కోజికోడ్ నుండి మనదేశంలోకి ప్రవేశించాడు. అప్పటి కేరళ పరిపాలకుడు సమూత్రి మహారాజు పోర్చు గీస్‌తో వ్యాపార సంబంధాల్ని బాగా ప్రోత్సహించాడు. వేమనకు అర్ధశతాబ్దానికి ముందే సాధారణ శకం 1600 (జ.జు)లో ఈ దేశంలోకి ఈస్ట్ ఇండియా కంపనీ ప్రవేశించింది.

ఆ కాలపు విశేషాల్ని సమీక్షించుకోవడం ఎందుకంటే- వేమన పుట్టి, పెరిగి, కాస్త లోకజ్ఞానం సంపాదిం చుకునే నాటికి దేశ,కాల పరిస్థితులు ఎలా ఉన్నాయి. అనేది అర్థం చేసుకోవడానికి! వ్యక్తుల ఎదుగుదల మీద, రూపుదిద్దుకున్న వారి ఆలోచనాసరళి మీద బాహ్య పరిస్థితులు సామాజిక, ఆర్థిక, చారిత్రక, రాజకీయ స్థితిగతులు తప్పక ప్రభావం చూపుతాయి. కవుల, కళాకారుల, శాస్త్రవేత్తల, తాత్త్వికులవంటి వారి కృషి బేరీజు వేసు కోవాలంటే వారు జీవించిన కాలంనాటి అన్ని పరిస్థితుల్ని అన్ని కోణాల నుంచి పరిశీలించాల్సి ఉంటుంది. ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సినంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!



నీథమ్ అనే శాస్త్రవేత్త అంగ్వినా ట్రిటిసీ అనే వృక్ష పరాన్నజీవి వివరాలు తొలిసారి 1744లో ప్రపం చానికి ప్రకటించాడు. ఇది వేరును తొలచి జీవించే నెమటోడ్ పరాన్నజీవి. అంటే 1780 జ.జులో వేమన మరణించిన 14ఏండ్లకు ఈ వేరు పురుగు పరిశోధన అధికారికంగా వెలుగుచూసింది. అయినా తన లోకజ్ఞానంతో, పరిశీలనానుభవంతో వేమన "వేరు పురుగు చేరి వృక్షంబు చెరచును/ చీడ పురుగు జేరి చెట్టు చెరచు" - అనే పద్యం చెప్పాడు."... శిలల కెల్ల మ్రొక్కు జీవులార! శిలల నేమియుండు జీవులందే కాక?"- శిలలలో ఏ ముందని మొక్కుతున్నారూ? అని ప్రశ్నిస్తూ ఏదైనా ఉంటే గింటే అది జీవుల్లోనే ఉంది- అన్న సత్యాన్ని వెల్లడించాడు వేమన. వేమన కాలానికి దేశంలో ఆధునిక ఇంగ్లీషు చదువులు లేవు. విజ్ఞానశాస్త్ర బోధన లేదు. అయినా, ఆయన తనలోని వైజ్ఞానిక అవగాహనను తట్టిలేపాడు. జీవులకూ, నిర్జీవులకు గల తేడా తెలుసు కొమ్మని హితవు పలికాడు. అలాగే శిలల గురించి మరో విషయం కూడా చెప్పాడు. ఒక హేతువాదిగా "రాతి బొమ్మకేల రంగైన వలువలు / గుళ్ల గోపురాములు కుంభములును"- అని మనుషులు కల్పించుకున్న దైవాన్ని వారి అంధవిశ్వాసాన్ని సుతిమెత్తగా ఎత్తి చూపాడు.

చీకటి పోవాలంటే దీపం పెట్టాలి. రోగం పోవాలంటే వైద్యుడి మందు తినాలి "వ్యాధి కలిగెనేని వైద్యుని చేతను/ మందు దినక కాని మానదెందు/ చెంత దీపమిడక చీకటిపాయునా" ఇది సాధారణమైన పరిశీలనే కాని, చీకటిని రోగంతో పోల్చడంలో వేమనలోని వైజ్ఞానిక స్పృహ బయటపడింది. వైద్యుడి మందు అంటే సైన్సు లేనిది రోగం పోదు.దీపం కూడా సైన్సే. సైన్సు లేనిది చీకటిపోదు "మేడిపండు చూడ మేలిమై యుండును/ పొట్ట విప్పి చూడ పురుగులుండు"- పద్యం తెలియని తెలుగువారు ఉండరు. ఆయన పిరికివాడి బింకాన్ని మేడి పండుతో పోల్చాడు కానీ, ఇంకొంచెం లోతుకుపోయి ఆలోచిస్తే- ప్రతి కాయమీద, ప్రతి పండుమీద పురుగులు అంటే పరాన్నజీవులు జీవిస్తున్నట్టుగానే.. జంతువుల, మనుషుల శరీరాల మీద కూడా పరాన్నజీవులున్నాయని చెప్పి నట్లయ్యింది. అంతేకాదు, మేడిపండులాగా అందంగా కనబడే ఈ సమాజం మూఢనమ్మకాలతో, దారిద్ర్యంతో, మోసం, దగా, కుళ్ల, కుతంత్రాలతో ఉందని హెచ్చరించినట్టుగా కూడా ఉంది. మేడిపండులాగా అందంగా కన బడే ఈ దేశం 'పొట్టలో'- దేశంలోని సామాన్యుల్ని పీల్చి పిప్పిచేసే కార్పోరేట్లు, రాజకీయ నాయకులు ఉన్న విష యం మనకు తెలుసు. వేమన చెప్పిన ఒక సాధారణ విషయంలో అనేకానేక అసాధారణమైన అంశాలున్నాయి.

వేమన భూ విజ్ఞానశాస్త్రం గానీ, మానవం శరీర ధర్మ శాస్త్రం గానీ, అధ్యయనం చేసినవారు కాదు. కానీ, తన నిశిత పరిశీలన వల్ల 'భూమిలోన బుట్టు భూసార మెల్లను/ తనువులోన బుట్టు తత్త్వమెల్ల/ శ్రమము లోన బుట్టు సర్వంబు తానౌను"- అన్నారు. అసలు శ్రమ విలువను గుర్తించి ఎలుగెత్తి చెప్పడమన్నది గొప్ప విషయం. ప్రతిదీ శ్రమలోంచే పుడుతుందన్న అవగాహన ఆ కాలంలో ఆయనకు రావడం మామూలు విషయం కాదు. దార్శనికత అంటే అదే- వాస్తవాన్ని గ్రహించడం, నిజాల నిగ్గు తేల్చడమే కదా- వైజ్ఞానిక దృక్పధ మంటే? ఒకచిన్న ధూళికణం, లేదా ఇసుక రేణువు ఒక నీటిచుక్కతో కలిసి ఎప్పుడైతే ముత్యపుచిప్పలో పడు తుందో, అప్పుడది ముత్యమవుతుంది. ముత్యపుచిప్ప అని మనం చెప్పుకునేది సముద్రంలో ఉండే ఒక మొలస్కా జీవి. అనేక రంగుల్లో ఛాయల్లో ఏర్పడే ముత్యాలు కాల్షియం కార్బోనెట్, కాంకియోలిన్ వంటి పదార్థాలతో సహజంగా సముద్రంలో ఏర్పడతాయి. దీనివెనుక ఎన్నో వైజ్ఞానిక విషయాలున్నాయి. కానీ, వేమన కాలానికి అవన్నీ ప్రచారంలో లేవు.అయినా ఆయన తెలుసుకున్నారు.తన రచనలో పొందుపరిచారు.'చిప్పలోన బడ్డ చినుకు ముత్యం బయ్యె/నీటబడ్డ

> ఇప్పుడిక్కడ వేమన కవిత్వం గురించి చర్చిస్తున్నామంటే కేవలం ఆయన పద్యపాదాలు అర్థ తాత్పర్యాలు అర్థం చేసుకోవడం కాదు. తాత్విక కవి వేమన 'తయారు కావడానికి' దోహదం చేసిన బాహ్య, అంతర పరిస్థితుల్ని అంచనా వేసుకోగలగాలి. వేమన ఉనయోగించిన భాష, అందులోని చమక్కులు, వ్యంగ్యం, వంటి వాటిదగ్గరే ఆగిపోవడం భాషా పండితులు చేసే పని. అది ఒక కోణం మాత్రమే! వేమన లాంటి ఆలోచనాపరుడి గురించి, సమాజ క్షేమం గురించి ఆవేదన చెందిన మహనీయుని గురించి, ఇంకా అనేక కోణాలనుండి జరగాల్సిన పరిశీలనలు, పరిశోధనలు:- జరగలేదని నాకు అనిపిస్తోంది. ఈ దేశ ప్రజలు, ముఖ్యంగా తెలుగు ప్రజలు ఇంకా మూఢనమ్మకాల్లో పిచ్చి సంప్రదాయాల్లో పడి కొట్టుకుపోతున్నారంటే-వేమనను అర్థం చేసుకోవల్సినంత చేసుకోలేదనీ, జీర్ణించుకోవాల్సి నంత జీర్ణించుకోలేదని నాకు అనిపిస్తోంది!

చినుకు నీళ్లగలిసే"-అన్న-ఆయనలో వైజ్ఞానిక జిజ్ఞాసఎలాంటిదో దీనితో మనం అర్థం చేసుకోవచ్చు-

"పాల సాగరమున పవ్వలించినవాడు/ గొల్ల యిండ్ల పాలు కోరనేల"- పిండములను జేసి పితరుల తలపోసి/ కాకులకును బెట్టు గాడ్డెలారా" - అంటూ తర్కబద్ధంగా అనేక ప్రశ్నలు సంధించిన వేమన, ఒక్కోచోట పరుషపదాలతో కూడా తన ఆక్రోశాన్ని వెళ్లగక్కాడు. "పేరు సోమయాజి పెను సింహ బలుడాయె/ మేకపోతు బట్టి మెడను విరువ/ కాని క్రతువు వలన కలుగునా మోక్షంబు" అంటూ జంతుబలిని నిరసిస్తూ యాగాలు చేసే సోమయాజులను ఎగతాళి చేస్తూ, మోక్షం కలిగే మార్గం ఇదేనా? అని దుయ్యబట్టాడు. "పెక్కు జనుల గొట్టి పేదల వధియించి/ డొక్క కొరకు నూళ్ల దొంగిలించి"- తన పొట్ట కోసం పేదల్ని కొట్టిచంపి, ఊళ్ల దోచుకునే దోపిడీదార్లను వేమన ఈసడించాడు. వేమన ప్రజా పక్షపాతి. తాను ఎవరి పక్షాన నిలబడ్డాడో కూడా స్పష్టం చేశాడు.

"బ్రహ్మ మనగ వేరె పరదేశమున లేదు / బ్రహ్మమనగ తానె బట్టబయలు/ తన్ను తానెరిగిన తానెపో బ్రహ్మంబు"- అని అన్న వేమనలో మనకు ఒక యోగి కనిపిస్తున్నాడు. గౌతమ బుద్ధుడు సమాధిలో కూర్చుని ఎక్కడాలేని ఏదో దేవుడి గూర్చి తపస్సు చేయలేదు. 'సర్వం దు:ఖమయం' అని గుర్తించిన బుద్ధుడు, ధ్యాన ముద్రలో కూర్చుని తనలోకి తాను ప్రయాణించాడు. మానవాళి దు:ఖాన్ని పారద్రోలడం ఎలాగా? అని తీవ్రంగా ఆలోచించాడు. వేమన కూడా అదేదారిలో పయనించి, అదే విషయం చెబుతున్నాడు. దేవుడనేవాడు ఏ దేశం లోనూ లేడు. తానేమిటో తను తెలుసుకోవడమే బ్రహ్మ. అదే జ్ఞానం అని చెపుతున్నాడు.

చివరగా ఒకమాట -నేను తెలుగు సాహిత్య విద్యార్థిని కాను. వేమన కవిత్వం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన వాణ్ణి కూడా కాదు. అయితే వేమనలోని ప్రశ్నించేతత్త్వం, ప్రగతిశీల భావాలు నన్ను ఆకర్షించాయి. అందుకే ఏదో కొన్ని విషయాలు చెప్పడానికి సాహసించాను.

- కేంద్ర సాహిత్య అకాడెమీ విజేత, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

ముసుగుల్లో వొక అనాగరికుణ్ణి
మోసుకుపోతున్న పు-రుషులు
లోలోపల మసులుతున్నదేమిటో
ఎవ్వరికీ తెలియదు
గాంధీ మాటను పెడచెవిన పెట్టి
జెండా సిగ్గుపడ్తూనే ఎగరడానికి
ఆ రాత్రి స్వేచ్ఛనలంకరించుకుంటుంది

విషసర్పాల బుస వినిపించదు కాని
ముఖం నిండా కొన్ని నవ్వులు
గుచ్ఛం కట్టుకుంటారు
కొన్ని సభ్యతలు అభ్యంగన స్నానం చేసి
చేతుల నిండా పూజలు వేలాడ్తుంటాయి
ఇంకా కోరలేవి కన్పించని
మబ్బులు పద్తుంటారు
ఆ దుస్తులేవి నలగవు కానీ
ఆ గాలిలోకి లేచిన జిల్లేడుచూపు తొలవని

కొవ్వొత్తులు వదలాలి



అవయవ ముండదు
గెల్చిన ఓడిన రాజకీయం గొడుగుపట్టిన
వాళ్లను మనుషులనడం
అక్షరం వాంతి చేసుకుంటుంది
వాళ్ల కణాల నిండా
ఒక ఐతిహాసిక పురాణ సాంస్కృతిక
ద్రగ్గింజెక్టెడు వారసత్వ పాలసముద్రం
మధించబడుతుంటుంది

చేతినిండా అశ్లీలం
పొరలుపొరలుగా కౌగిలించుకుంటుంది
వొక గుర్తుతెలియని ముసుగులో
అవతారమెత్తిన పుంసత్వ మృత్యువేటొకటి
తొడల మధ్య గెలుపును ప్రకటించుకొని
ఒక సజల కాలాన్ని కొరికేస్తుంది
ఒక పునరుత్పాదక మానవీయ
పరిమళాన్ని మట్టి కల్పుతుంది

రాజ్యం గుడ్డితనం నవ్వుతుంటే
గుర్తు తెలియని మహమ్మారుల వేటలో
పాపం! కలకత్తా కాళిక
నూటయాభై గ్రాముల కొవ్వొత్తి పట్టుకుని
నడుస్తున్నప్పుడు తప్పదు,
మనుషులు కొవ్వొత్తులు వదలాలి!

- వడ్డెబోయిన శ్రీనివాస్
9885756071

పర్యావరణానికి 'హైడ్రా' దోహదపడుతుందా?



దొంతి నర్సింహారెడ్డి
9010205742

హైదరాబాద్ నగరంలో వేల చెరువులు వందలలోకి వచ్చాయి. కొన్ని ప్రాంతాలలో కుంటలు, చెరువులు ఆనవాళ్లు కూడా లేవు. అయితే, అదే క్రమంలో వరద ముప్పు పెరుగుతున్నది. కుంటలను, చెరువులను మాయం చేసిన దగ్గర వరద స్థాయి కూడా ఎక్కువగా ఉంటున్నది. కుంభ వృష్టి పడినప్పుడల్లా స్థానిక ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. మాయమైన చెరువులు, మాయం కాబోతున్న చెరువులకు కూడా అనేక స్థానిక కారణాలున్నాయి. రకరకాల వ్యూహాలతో కబ్జాదారులు ఆక్రమించారు. గత 30ఏండ్లుగా జరుగుతున్న ఈ ఆక్రమణలు క్రమక్రమంగా జరిగాయి. ఒక్కొక్క చెరువుది ఒక్కోగాథ, బాధ, వ్యథ. మొదట్లో పేదల పేరు మీద జరిపిన ఆక్రమణ ఇప్పుడు చెరువు అవసరమే లేదు అనేకాడికి వచ్చింది. చెరువుల ఆక్రమణ వల్ల అన్యాయమైపోయిన వారి గొంతుకలు అప్పుడు ప్రభుత్వాలు, మీడియా, ఇతరులు పట్టించుకోలేదు. ఇప్పుడు ఆక్రమణల తొలగింపునకు పూనుకున్నప్పుడు కూడా వారి గొంతు కాకుండా ఆక్రమించినవారు మాట్లాడు తున్నారు. మీడియాలో కూడా వారిమాట ప్రబలంగా వినపడుతున్నది. హాస్యాస్పదంగా చెరువులను ఆక్రమించిన ప్రజా ప్రతినిధులు రాజకీయ కోణం గురించి మాట్లాడుతున్నారు. కక్ష, వివక్ష అంటూ సమన్యాయం గురించి అరుస్తున్నారు. ప్రజల కొరకు మొదలు పెట్టిన చెరువుల పునరుద్ధరణ కార్యక్రమాన్ని ప్రజల పేరుమీద ప్రశ్నిస్తున్నారు.

హైదరాబాద్ నగరంలో కొత్తగా ఏర్పడిన హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) సంస్థ పని మొదలుపెట్టిన కొద్దిరోజులలోనే నగరంలో అనేక రకాల చర్చలకు దారి తీసింది. అయితే వేగంగా ఇది రాజకీయ నాయకుల చర్చగా మారింది. చెరువులు, కుంటలు, గొలుసుకట్టు చెరువులు, వాటి మధ్య వాగులు సహజ నీటి వ్యవస్థలో కీలకం. వీటిని కాపాడుకోవడం ముఖ్యం. అందుకే నీటి వనరుల నిర్వహణలో ఇమిడిఉన్న రాజకీయ, సామాజిక, ఆర్థిక కోణాలను చర్చించాలి. హైదరాబాద్ నగర అభివృద్ధిలో సమిధలుగా మారిన చెరువుల గురించి రాజకీయ నాయకుల వ్యవహారంగా మారిస్తే ప్రజలకు అసలు విషయం అర్థమయ్యే అవకాశం లేదు. ఇప్పుడు జరుగుతున్న పరిణామాలలో పార్టీల మధ్య సంవాదంగా దీన్ని మార్చితే ప్రజలకు నష్టం.

రాజకీయ సవాళ్ల మధ్య హైడ్రా

ప్రకృతి వనరులను తమ కబంధహస్తాలలో బంధించిన 'ప్రయివేటు' వ్యాపార వర్గం ఉనికిని ఇప్పటి పరిస్థితి ఎత్తి చూపుతున్నది. ఈ వర్గంలో రాజకీయ నాయకులు, అధికారులు, భవన నిర్మాణదారులు, ఎన్నికైన ప్రజా ప్రతినిధులు. వీళ్లకు మద్దతుగా అనేక మంది ప్రొఫెషనల్స్ ఉన్నారు. ఈ వర్గం రాజకీయ పలుకుబడి ఉపయోగించి, మీడియాలో ఇంకా ఇతరత్రా ఉన్న సంబంధాలను వాడుకుని సమస్యను జటిలం చేసే ప్రయత్నాలను మొదలు పెట్టారు. మున్ముందు మతం, కులం, ప్రాంతం, పార్టీ, వగైరా అన్నీ రకాల వాదనలు వినపడుతూనే ఉంటాయి. చెరువులను చెరబడుతున్నప్పుడు పట్టించు కోని వ్యక్తులు ఇప్పుడు అన్ని రకాల వాదనలతో సిద్ధంగా ఉన్నారు.



రాజకీయ సవాళ్లకు ఇది సందర్భం కాదు. చెరువుల పరిరక్షణ ద్వారా మన నివాస ప్రాంతాన్ని ఆహ్లాదకరమైన వాతావరణంగా మార్చే అవకాశం ఉన్నది. భూగర్భ జలాలు, పచ్చదనం, ఖాళీ స్థలాలు పరిరక్షిస్తే, పెరిగే వేడి తగ్గి, ఉష్ణోగ్రతలు నియంత్రణలోనికి వస్తాయి. చెరువుల పునరుద్ధరణ మీద రాజకీయ నీలినీడలు పడకుండా హైడ్రా సంస్థ పనితీరు ఉండాల్సిన ఆవశ్యకతను ప్రస్తుత విష రాజకీయ సంస్కృతి గుర్తు చేస్తున్నది. హైడ్రా పనికి ప్రజల నిరంతర మద్దతు అవసరం ఉన్నది. ప్రజల మద్దతు రావాలంటే హైడ్రా తన పనిలో ప్రజల్ని భాగస్వాములు చేయాలి. పారదర్శక పద్ధతులను అవలంబించటం ద్వార మాత్రమే ఇది సాధ్యం.

ఫలానా ఆక్రమణను తొలగించే దమ్ము హైడ్రాకు ఉన్నదా? అని కొందరు రాజకీయ నాయకులు ప్రశ్నిస్తున్నారు. తమ అక్రమ నిర్మాణాన్ని లక్ష్యం చేసుకున్నారు, ఇంకెవరిదో చేసుకోలేదు అని హైడ్రా పనిమీద బురద జల్లుతున్నారు. సామాన్యులు గమనిస్తున్నారు. ఇట్లాంటి అనుమానాలకు సమాధానం హైడ్రా పనితీరు వల్ల వస్తుందని ఆశిద్దాం. ప్రకటనల వల్ల రాదు. కొంతకాలం ఓపిక పట్టాల్సిందే. సవాళ్లను విసిరే రాజకీయ నాయకులు సమస్యను పక్కదారి పట్టించే ప్రయత్నాలలో భాగంగా చేస్తున్నారు. ఆక్రమించిన వారికి వేరే ఆక్రమణ గురించి ఆక్షేపించే హక్కు లేదు.అన్ని రకాల ఆక్రమణలు ఎత్తి చూపే హక్కు,ఆస్కారం, అవకాశం ప్రజలకు మాత్రమే ఉన్నది. అది కల్పిం చాల్సిన బాధ్యత హైడ్రా ఉన్నతాధికారుల మీద ఉన్నది.హైడ్రాకు బలం చేకూర్చాల్సింది ప్రజలే. కొందరి స్వలాభం వేలమందికి నష్టంగా మారిన తరుణంలో ప్రభుత్వం హైడ్రాతో ముందుకొస్తే దానికి మద్దతు ప్రకటించి, రాజకీయ ప్రాబల్యం నుంచి దానిని రక్షించుకుంటూ, చెరువుల పరిరక్షణలో ప్రజలు కూడా నడుము బిగిస్తే సవాలుగా మారిన చెరువుల పరిరక్షణ సాకారం అవుతుంది.

> హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవడంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చదనానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం.

హైదరాబాద్ నగరమంతటా, బయటా కొన్ని వేల ఆక్రమణలు ఉన్నాయి. అన్ని ఒకే రోజు తొలగించడానికి హైడ్రా ఒక మంత్రం దండం కాదు. ఒక దాని వెంట ఒకటి తనకున్న వనరులను బట్టి ఆక్రమణలు తొలగిస్తే, కొత్త ఆక్రమణలు కూడా ఆగుతాయి. ఇది నిరంతర ప్రక్రియ. హైడ్రా తనదగ్గర ఉన్న సమాచారం మేరకు, ప్రజలు ఇస్తున్న సమాచారం జత చేర్చి కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. తయారు చేసిన చిట్టాలో కట్టడాల తొలగింపు, కూల్చివేతలకు ఒక ప్రాధాన్యత క్రమం ఏర్పాటు చేసుకోవాలి. ఇందులో రహస్యం ఏమి ఉంచకూడదు. ఆక్రమణల చిట్టా తయారుచేసి ఎప్పటికప్పుడు ప్రజలముందు పెట్టాలి.ఈ చిట్టా తీసుకుని ఆక్రమణలను తొలగిస్తూ చెరువుల పునరుద్ధరణ పనులకు శ్రీకారం చుట్టాలి. ఒక దీర్ఘకాల కార్యాచరణ ప్రణాళిక తయారు చేస్తే ప్రజలు కూడా ఆమోదిస్తారు.

పేదలకు పునరావసం కల్పించాలి

ఆక్రమణలు కూడా అనేక విధాలుగా సంవత్సరాలుగా జరిగిన దరిమిలా కూల్చివేతలు కూడా ఆ మేరకు విభిన్నంగా ఉండాలి. కొన్ని చెరువులోపల కడితే, కొందరు చెరువు ఒడ్డున కట్టారు. కొందరు దొడ్డిదారిన అనుమతి తెచ్చుకుంటే, ఇంకొందరు అనుమతి లేకున్నా కట్టుకున్నారు. కొందరు తెలియకకొంటే, అనేకులు తెలిసి ఆక్రమించారు.ఏ విధంగా ఆక్రమణ జరిగినా, ఎప్పుడు జరిగినా, చివరికి ఆక్రమణలు ఉండడమే కొలమానం. కట్టడాల తొలగింపు, కూల్చివేతలు వంటి మొదటి అడుగులు అమాయకులు, పేదలు, బలహీనులు మీద పడకుండా జాగ్రత్త పడాలి. అటువంటి సందర్భంలో వాళ్ల విషయంలో, హైడ్రా తొలి అడుగు వారి పునరావాసానికి ఇచ్చి, ఆక్రమణల నిర్మూలన తదుపరి చేపట్టాలి. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ వంటి చెరువుల చుట్టూ, లోపట ఉన్న ఆక్రమణలను యుద్ధ ప్రాతిపదికన తొలగించాలి. ఈ జంట జలాశయాల పునరుద్ధరణ వేగంగా, పూర్తి స్థాయిలో సంపూర్ణంగా చేసి హైడ్రా తన పనితీరు మెరుగుపరుచుకోవాలి. ఇక్కడి ఆక్రమణలు అన్ని తొలగించి, పూర్తిగా పునరుద్ధరణ చేసి ఫలితాలు రాబడితే ప్రజలకు హైడ్రా పని మీద విశ్వాసం పెరుగుతుంది.

చెరువుల ఆక్రమణ వల్ల అనేక రూపాలలో ప్రజలకు, ప్రభుత్వానికి నష్టమవుతున్నది. ఆర్థిక నష్టం మీద అధ్యయనాలు, అంచనాలు లేవు. చేస్తే ప్రజలు హైడ్రా చర్యలను బేరీజు వేసుకునే అవకాశం వస్తుంది. హైదరాబాద్‌లో చెరువులలో వర్షపు నీటిని నిలువ చేసుకునే పరిస్థితి ఇప్పుడు లేదు. ఏ ఒక్క చెరువు కూడా కాలుష్యరహితంగా లేదు. పడ్డ ప్రతి వర్షపు చుక్కా కొన్ని క్షణాలలో కలుషితం అయిపోతున్నది. మరి మంచినీరు ఎక్కడ నుంచి వస్తున్నది? నిత్యం అవసరమయ్యే మంచి నీరు ఎక్కడి నుంచో వస్తే దాని ఖరీదు ఎంత? మంచి నీటి మీదనే ఖర్చు పెట్టడం వల్ల హైదరాబాద్ జలమండలి మురుగు నీటి పారుదల వ్యవస్థ మీద పెట్టుబడి పెట్టడం లేదు. ప్రతి రోజు దాదాపు 1800 మిలియన్ గ్యాలన్ల మురుగునీరు పరివాహక ప్రాంత చెరువుల ద్వార మూసినదిలోకి చేరుతున్నది. చెరువులలో దోమలు, దోమల వల్ల రోగాలు, వైద్యానికి కోట్ల రూపాయలు ప్రజలు ఖర్చు పెడుతున్నారు. ఒక్క అపార్ట్‌మెంట్, ఒక్క కాలేజి, ఒక్క లేఔట్ వల్ల చెరువు నాశనం. చెరువు నాశనం వల్ల చుట్టుపక్కల నివసించేవారికి కష్టం, నష్టం. ఈ ఆర్థికభారం భరించేకంటే చెరువులను పరిరక్షిస్తే జీవనం సుఖం.కాబట్టి హైడ్రా పనిచేస్తే ప్రజలకే లాభం.

పర్యావరణ వ్యవస్థ నిర్మాణమే ప్రధానం

చెరువుచుట్టే పల్లెలు, పట్టణాలు నిర్మాణమైనవి. అటువంటి చెరువును నీటి వనరుల సుస్థిరత మీద ఆధారపడ్డ దెక్కన్ పీఠభూమిలో కొందరు స్వార్థపూరితంగా కబ్జాచేస్తే, ఆక్రమిస్తే ఫలితాలు మొత్తం జీవనం మీద పడుతుంది.ఆరోగ్యకరమైన చెరువుల మీద ఆధారపడి మను ష్యులు, మొక్కలు, సూక్ష్మజీవులు, జంతువులు మనగలుగుతాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సరస్సుల ద్వార ఆహారం వస్తుంది. అనేక జీవనోపాధులు చెరువుల మీద ఆధారపడి ఉంటాయి. వినోదానికి, ఆహ్లాద కరమైన వాతావరణానికి చెరువులే పరిష్కారం.మానవ జీవనంలో చెరువులకు చాలా విలువ ఉన్నది.

ఆరోగ్యం పెంపొందించే చేపలు, ఇతర జలచరాల కోసం చెరువులు ఎప్పటి నుంచో ఉపయోగిస్తున్నాము. చెరువులు కలుషితమైతే, వాటి విస్తీర్ణం తగ్గితే ఇవేవి కూడా మనకు అందవు. పుడమి మీద ఉష్ణోగ్రతలు తగ్గించడానికి, వరదలను నివారించడానికి చెరువులు సహాయపడతాయి. భూ ఉపరితలంలో 5-8 శాతాన్ని మాత్రమే ఆక్రమించినప్పటికీ, సరస్సులు, నదులు, చిత్తడి నేలలు ప్రపంచ నేల కార్బన్ లో 20-30 శాతం నిలువ చేస్తాయి. మానవులు వాతావరణ మార్పుల ప్రభావాలను ఎదుర్కోవడంలో దిగజారిన పర్యావరణ వ్యవస్థలను తిరిగి నిర్మించడం తొలి మెట్టు కాగా చెరువులను రక్షించడం, పునరుద్ధరించడం వంటి ఉపశమన ప్రయత్నాలు ఈ తొలి మెట్టు అందుకోవడంలో చాలా కీలకం.

హైడ్రా చేస్తున్న పని ప్రస్తుత తీవ్ర వాతావరణ మార్పుల నేపథ్యంలో, పెరుగుతున్న ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కోవ డంలో భాగంగా మనం చూడాలి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే చెరువులు చాలా అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే పచ్చదనం, చెట్లు అవసరం. పచ్చద నానికి, చెట్లకు చెరువులు అవసరం. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించాలంటే నీటితో నిండిన చెరువుల పాత్ర చాలా ముఖ్యం. ■

రుణమాఫీ అయిన రైతులకు కొత్త రుణాలు చెల్లించండి

- జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య
- కందుకూరులో కుటుంబ నిర్ధారణ సర్వే పరిశీలన

నవతెలంగాణ- వేంసూరు

రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే బ్యాంకులు కొత్త రుణాలను మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని కందుకూరు గ్రామంలో రైతు రుణమాఫీ పై వ్యవసాయ శాఖ నిర్వహిస్తున్న కుటుంబ నిర్ధారణ సర్వేను పరిశీలించి రైతుల సందేహాలకు వివరణ ఇచ్చారు. అనంతరం కందుకూరు సహకార సంఘం కార్యాలయాన్ని సందర్శించి రుణమాఫీ పొందిన రైతులకు వెంటనే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలి సిబ్బందిని సూచించారు. ఇప్పటివరకు జిల్లాలో 50వేల 68 మంది రైతుల



ఖాతాలకు కుటుంబ నిర్ధారణ జరగాల్సి ఉందని, అర్హత ఉండి రుణమాఫీ రాని రైతులు మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు. రైతులు అధైర్య పడవద్దని, అర్హులైన అందరికీ వర్తిస్తుందని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సర్వే పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు.

సత్తుపల్లి : రైతు రుణమాఫీ కోసం సత్తుపల్లి మండలంలో జరుగుతున్న కుటుంబ నిర్ధారణ సర్వేను జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య పరిశీలించారు. గురువారం సత్తుపల్లి వచ్చిన డీఏవో పుల్లయ్య మండలంలోని తాళ్లమడలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కుటుంబ నిర్ధారణ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో బుధవారం నుంచి కుటుంబ నిర్ధారణ సర్వే ప్రారంభమైందన్నారు. బ్యాంకుల నుంచి రుణం తీసుకొని రేషన్‌కార్డు లేని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా డీఏవో పుల్లయ్య కోరారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏడీఏ వి.శ్రీనివాసరెడ్డి, ఏవో వై.శ్రీనివాసరావు, ఏఈవోలు టి.నరేశ్, కె.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ప్రియదర్శిని లక్ష్యం

- కళాశాల కరస్పాండెంట్ కాటేపల్లి నవీన్ బాబు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే ప్రియదర్శిని కళాశాలల లక్ష్యమని కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు అన్నారు. మండలంలోని పెద్దతండా వద్ద గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా నవీన్‌బాబు మాట్లాడారు. తమ కళాశాలలో విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించి, మహిళా సాధికారత పెంచడమే తమ ధ్యేయమన్నారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అనేక రంగాల్లో అగ్రస్థానంలో ఉన్నారని తెలిపారు. జేఎన్టీయూ యూనివర్సిటీ పరిధిలో తమ కళాశాలకు అగ్రస్థాయిలో ఫలితాలు వచ్చాయని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు అనేక సాంస్కృతిక



కార్యక్రమాలు, విలువలు బోధించడమే తమ బాధ్యత అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.గోపాల్, డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

50 పడకల ఆస్పత్రికి వంద పడకల ఆస్పత్రిగా శంకుస్థాపన

- ఆగస్టు 9న డిప్యూటీ సీఎం శంకుస్థాపన
- ఇదేమి విచిత్రం

నవతెలంగాణ-వైరా

ఎన్నో ఏళ్లుగా ఊరిస్తూ వస్తున్న 100 పడకల ఆసుపత్రిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ 50 పడకలకు కుదిస్తూ జులైలో ఉత్తర్వులు విడుదల చేయగా, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆగస్ట్ 9వ తేదీన 100 పడకల ఆసుపత్రిగా శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రికి రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ తెలియజేయలేదా, ఉప ముఖ్యమంత్రి తెలుసుకో లేదా, ముఖ్యమంత్రి వచ్చే నాటికి వైరాలో తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు తానే శంకుస్థాపన చేయాలన్న తొందర పాటులో ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారా అన్న చర్చ జరుగుతుంది. వైరాలోని గురుకుల పాఠశాలలు, ఏసిపి కార్యాలయం, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న ప్రభుత్వ భూమి 5 ఎకరాలలో 100 పడకల ఆసుపత్రి నిర్మించాలని ప్రభుత్వం భావించింది. కానీ విశ్వసనీయ సమాచారం ప్రకారం ఆ స్థలాన్ని నేటి వరకు ఏరియా ఆసుపత్రికి కేటాయింపూ జరగలేదు. కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్ట్ 15న సీతారామ ప్రాజెక్టు నీటిని ఏన్కూరు వద్ద ఎన్ఎస్‌పి కాలువలోకి



విడుదల చేసి వైరా ప్రాజెక్టుకు, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూర్, మధిర, ఎర్రుపాలెం మండలాలకు సాగునీటి సమస్య లేకుండా చేసే ఉద్దేశంతో తాత్కాలిక ప్రయత్నాలు చేశారు. అదే రోజు వైరాలో 2 లక్షల రూపాయల రుణ మాఫీ చెక్కులు ఇచ్చేందుకు భారీ బహిరంగ సభ జరిపారు. ఉప ముఖ్యమంత్రి 100 పడకల ఆసుపత్రి కి శంకుస్థాపన చేసిన తేదీకి ముఖ్యమంత్రి వైరా వచ్చిన తేదీకి కేవలం 6 రోజులే. ముఖ్యమంత్రితో శంకుస్థాపన చేయించవచ్చుగా ఇంత హడావిడిగా ఎందుకు శంకుస్థాపన చేసినట్లు అని అందరూ గుసగుసలాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అప్పటి వైరా ఎంఎల్ఏ లావుడ్యా రాములు నాయక్ ఆసుపత్రి విషయాన్ని ప్రస్తావించగా 2023 జులై 27న జిఓ ఆర్‌టీ నెంబర్ 419 ద్వారా హెచ్ఎం అండ్ ఎఫ్ డబ్ల్యు ద్వారా 37.50 కోట్లతో వైరాకు 100 పడకల ఆసుపత్రి మంజూరు చేసింది. జులైలో జరిగిన ఆరోగ్య శాఖ సమీక్ష వైరాకు మంజూరైన 100 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా నిర్మించాలని ఉత్తర్వులు జారీచేసింది. జులై 12వ తేదీన ఎంఎస్ ఐడిసి మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు చేరినప్పటికీ ఆగస్ట్ 9న ఆసుపత్రికి శంకుస్థాపన చేసే సమయం వరకు ఉప ముఖ్యమంత్రికి తెలియకుండా ఎలా ఉంటుంది? ఎలా ఉంచారు? అన్న ప్రశ్నలు వస్తున్నవి. శంకుస్థాపన జరిగిన రోజునే టెండర్ గురించి, కాంట్రాక్టు అగ్రిమెంట్ గురించి సంబంధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులను ఉప ముఖ్యమంత్రి ప్రశ్నించిన సమయంలో అధికారులు నీళ్ళు నములుతూ పొంతన లేని సమాధానాలు ఇవ్వటంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో కూడా ఆసుపత్రిని 50 పడకలకు కుదించిన విషయం చెప్పక పోవడం దారుణం. ఆసుపత్రి కుదింపు విషయం తెలుసుకున్న వైరా ఎంఎల్ఏ రాందాస్ నాయక్ డిప్యూటీ సీఎం, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్‌తో సహా అందరికీ వినతి పత్రాలు అందజేశారు. మల్లు భట్టివిక్రమార్క స్వంత మండలం వైరా కేంద్రానికి మంజూరైన 100 పడకల ఏరియా ఆసుపత్రి 50 పథకాలకు కుదించటమే విచిత్రంగా ఉంటే, కుదించిన విషయం కూడా తెలియకుండా ఉంచటంలోని ఆంతర్యం ఏమిటో ఎవరికీ బోడపడక రాష్ట్ర ప్రభుత్వంలో సమన్వయం, పారదర్శకత లోపించిందని చర్చ జరుగుతుంది.

జ్వరంతో మృతిచెందిన చిన్నారి కుటుంబానికి మార్పు చేయూత

నవతెలంగాణ-వైరాటౌన్

ఇటీవల జ్వరంతో బాధపడుతూ మృతి చెందిన ఐదేళ్ల చిన్నారి సిద్దిక్ కుటుంబానికి మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత అందించారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్‌కు చెందిన కూలి పనులు చేసుకొని జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబం అక్బర్, నూర్జహాన్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె సిద్దిక్ (5) జ్వరంతో బాధపడుతూ ఆగస్టు 24వ తేదీన మృతి చెందినది. ప్రస్తుత సమయంలో కూలీ పనులకు బయటకి వెళ్ళలేని పరిస్థితిలో ఉన్నామని ఏదైనా సహాయం చేయాలని చిన్నారి తల్లిదండ్రులు కోరడంతో మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత వారి ఇంటికి వెళ్ళి 5వేల రూపాయలు ఆర్థిక సహాయం



అందజేశారు. కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహన్‌రావు, ఆదూరి ప్రేమ్ కుమార్, కుదురుపాక సుధాకర్, ఈలప్రోలు ప్రశాంత్, బత్తుల నాగార్జున, షేక్ మీరా, జానీ, అజిత, కారుమంచి మురళి, చిన్నారి తల్లిదండ్రులు నూర్జహాన్, అక్బర్, అక్క సన తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ హాస్టళ్ల మెస్‌-చార్జీల పెంపుకోసం 2న కలెక్టరేట్ ఎదుట ధర్నా

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ- ఖమ్మం

సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల మెస్ చార్జీలు పెంచాలని, మెడికల్ క్యాంప్‌లు పెట్టాలని, కనీస సౌకర్యాలు మెరుగు పరచాలని కోరుతూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో కేవిపిఎస్ జిల్లా స్థాయి సమావేశం కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు పాపిట్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ సాంఘీక సంక్షేమ హాస్టల్ యాత్ర కేవిపిఎస్ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహించిందన్నారు. విద్యార్థుల మెస్ చార్జీలు పెరిగిన ధరలకు సరిపోక నాసిరకం భోజనం పెడుతున్నారని చెప్పారు. హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు రూ 2500లకు పెంచాలన్నారు. కాస్మొటిక్ చార్జీలు పెంచాలన్నారు. విద్యార్థుల పాకెట్ మనీ రూ. 1000 పెంచుతూ జీవో విడుదల చేయాలన్నారు. మెనూ అమలు, మెస్ చార్జీలు



పాకెట్ మని పెంపుకోసం సెప్టెంబర్ 2న కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షురాలు మాచర్ల భారతి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికలకు ముందు దళిత, గిరిజనుల కోసం చేవెళ్ల ఎస్సి, ఎస్టీ డిక్లరేషన్‌కు ఏడాది గడిచిందని, ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచిందన్నారు. ప్రభుత్వం అంబేద్కర్ అభయహస్తం కోసం 2000 కోట్ల రూపాయలు బడ్జెట్‌లో ప్రకటించారని, కానీ ఆ పథకం అమలుకు మార్గదర్శకాలు రూపొందించలేదన్నారు. దళితుల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలన్నారు. సాంఘీక సంక్షేమ మంత్రిని నియమించాలన్నారు. ఎస్సి, ఎస్టీ కేసులలో బాధితులకు నష్టపరిహారం అందించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. తక్షణమే పెండింగ్ ఎక్స్ గ్రేషియో చెల్లించాలన్నారు .2018 సంవత్సరాల నుండి ఎస్సి కార్పొరేషన్ రుణాలు పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే పెండింగ్ రుణాలు విడుదల చేయాలన్నారు. సాంఘీక సంక్షేమ మంత్రి లేకుండా దళితుల సంక్షేమం గురించి కాంగ్రెస్ ప్రగల్భాలు పలుకుందని విమర్శించారు. ఈ సమావేశంలో కేవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బొట్ల సాగర్, జిల్లా నాయకులు ఎస్‌కె సైదులు, నాగటి సురేష్, కర్లకుంట నరేష్, బందేల కల్యాణ్, జెర్రిపోతుల కిరణ్, వెల్తూరు రామనాథం తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవి స్క్రీనింగ్‌పై శిక్షణ

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఆధ్వర్యంలో జిల్లాలో హెల్త్ వెల్నెస్ సెంటర్లో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లలందరికీ కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో హెచ్ఐవి స్క్రీనింగ్‌పై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో అందరికీ హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల నియంత్రణకు అవగాహన కలిపించాలన్నారు. అందరికీ హెచ్ఐవి స్క్రీనింగ్ చేయాలని, హెచ్ఐవి పాజిటివ్ వచ్చిన కేసులను దగ్గరలోని ఐసిటిసి కేంద్రానికి పంపాలని తెలిపారు. జిల్లా అదనపు వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జేవిఎల్ శిరీష, (ఎయిడ్స్ అండ్ లెప్రసీ) మాట్లాడుతూ ప్రతి హెల్త్ వెల్నెస్ సెంటర్‌కి నిర్దేశించిన హెచ్ఐవి టెస్టింగ్ లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఈ వివరాలన్నీ ఆన్లైన్‌లో పోర్టల్‌లో పొందుపర్చాలని తెలిపారు. ప్రోగ్రాం అధికారి రామారావు మాట్లాడుతూ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్‌లందరూ సమయం పాటిస్తూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు . ప్రోగ్రాం అధికారులు డాక్టర్



వెంకట రమణ, డాక్టర్ బి.సైదులు మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల వివరాలను గోప్యంగా ఉంచాలని అన్నారు. డాక్టర్ బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతి గ్రామా స్థాయిలో నిర్వహిస్తున్న మీటింగ్‌లలో హెచ్ఐవిపై అవగాహన కలిపిస్తూ, హెచ్ఐవి రక్త పరీక్ష ప్రాముఖ్యతను అందరికి తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డెమో సాంబశివ రెడ్డి, జిల్లా ఎయిడ్స్ నివారణ సిబ్బంది సత్య కుమార్, అలీ, వీరయ్య, రామకృష్ణ, జనవాణి స్వచంద సేవ సంస్థ సిబ్బంది, జాగృతి స్వచంద సేవ సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) సానుభూతిపరుడు మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సానుభూతిపరుడు వెన్ను తిరుమలయ్య (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. వెన్ను తిరుమలయ్య మృతదేహాన్ని సీపీఎం జిల్లా నాయకులు తమ్మినేని కోటేశ్వరరావు సందర్శించి ఎర్రజెండా కప్పి నివాళు లర్పించారు. తిరుమలయ్య-సుగుణమ్మ దంపతులకు పిల్లలు లేకపోవడంతో తిరుమలయ్య అన్న అప్పయ్య కుమార్తె ధనమ్మను దత్తత తీసుకున్నారు. తిరుమలయ్య మృతదేహానికి ధనమ్మ తలకొరివి పెట్టారు. మృతునికి భార్య సుగుణమ్మ ఉన్నారు. నివాళు లర్పించిన వారిలో సీపీఎం సీనియర్ నాయకులు సిద్దినేని కోటయ్య, యల్లంపల్లి నాగయ్య, రంజాన్, పగిడిపల్లి ఉపేందర్, జక్కంపూడి సైదులు, సిద్దినేని పున్నయ్య, వేగినాటి చిన్నా, వెన్ను రమేష్, కృష్ణ, ఫ్రాన్సిస్ తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో జీపీ కార్మికుడు మృతి

నివాళ్లర్పించిన సీఐటీయు నాయకులు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం రేగులగూడెం గ్రామపంచాయతీ కార్మికుడు ఏపె శ్రీను(46) గురువారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఏపె శ్రీను ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతదేహాన్ని సీఐటీయు మండల కన్వీనర్ కే.నరేంద్ర, జీపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎస్‌కె.హుస్సేన్‌ల ఆధ్వర్యంలో కార్మికులు సందర్శించి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాప సభలో వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ లేక జబ్బు చేస్తే పట్టించుకునే నాథుడు కరువైనారని ఆవేదన వ్యక్తం చేశారు. మల్టీపర్పస్ విధానం వచ్చిన తర్వాత జీపీ కార్మికులపై మరింత పని బారం పెరిగిందని, దానికి తోడు నెల వారి వేతనాలు రాక చేస్తున్న పనిని వీడ లేక మానసికంగా కృంగి పోతున్నారన్నారు. సేవ చేసే కార్మికుడు చనిపోతే దాన ఖర్చులకు రూ.5వేలు మినహా ప్రభుత్వం నుంచి సాయం అందని దుస్థితి ఉందన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి స్కీం వర్కర్స్, కాంట్రాక్టు కార్మికులకు, మల్టీపర్పస్ వర్కర్స్‌ను పర్మినెంట్ చేయాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కె నరేంద్ర కోరారు. మృతుడు ఏపె శ్రీను విధి నిర్వహణలో నీతి, నిజాయితీగా పనిచేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొనటంతో పాటు కార్మికుల సమస్యలపై సంఘం కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనే వారన్నారు. ఈ సంస్మరణ కార్యక్రమంలో జీపీ వర్కర్స్ యూనియన్ నాయకులు బోళ్ల కొమరయ్య, మూడు హిట్లర్, బానోతు మోతి, సూర్యం, వజ్జా భాస్కర్, ఆదెర్ల గౌతమ్, అచ్చయ్య, రాధా, నంద, రాందాసు, కోటేష్, చల్లా నాగేష్, ఈసం అర్జున్‌రావు, భద్రం, నాగరాజు, ఆదెర్ల శ్రీను, మురళి, కేలోత్ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఓటర్ జాబితా సర్వేలో ఆన్‌లైన్ చేయాలి

ఇన్‌చార్జి తహసీల్దార్ కరుణాకర్ రెడ్డి

నవతెలంగాణ-ముదిగొండ

ఓటర్ల జాబితా సర్వేలో బిఎల్వోలు ఆన్లైన్ తప్పనిసరిగా చేయాలని ఇన్చార్జి తాసిల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులకు, బిఎల్‌ఓలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ కార్డులో తప్పులు సవరణతోపాటు, మరణించిన వారి పేర్లను తొలగించాలన్నారు. పేరు, ఇంటి పేరు, తప్పు పడితే సంబంధించిన ధ్రువపత్రాలతో సవరణ చేసే ఆన్లైన్‌లో



నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తాసిల్దార్ ఎం.డేవిడ్ కరుణాకర్, ఆర్ఐలు ఎస్కే వహీదాబేగం, పి.ప్రసన్నకుమార్, ఎల్డిసి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

31న ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

ఎన్జీఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఎటుకూరి రామారావు

నవతెలంగాణ-నేలకొండపల్లి

ఈ నెల 31వ తేదీన స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో, హైదరాబాద్ కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, ఖమ్మం ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ సహకారంతో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్ ద్వారా నిర్వహించే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్జిఆర్ సేవా కమిటీ కన్వీనర్ ఏటుకూరి రామారావు కోరారు. గురువారం సీపీఐ(ఎం) కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక సమాజంలో మానవ జీవితం, ఆరోగ్యం కలుషితమైపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ జబ్బు ఎవరికి ఎప్పుడు ఎలా వస్తుందో కూడా అర్థం కాని భయంకర పరిస్థితులు నెలకొన్నాయన్నారు. జబ్బును గుర్తించే లోపే మనిషి ఆరోగ్యం పూర్తిగా క్షీణించి ప్రాణాంతకంగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మనిషి ఆరోగ్య పరిస్థితిని ముందస్తుగా గుర్తించి తగిన వైద్య పరీక్షలు చికిత్స చేయించుకోవడం ద్వారా ప్రాణాలను రక్షించుకునే అవకాశం ఉందన్నారు. అందులో భాగంగా బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ద్వారా హైదరాబాద్ కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్, ఖమ్మం ఎన్నారై పేరెంట్స్ అసోసియేషన్ సహకారంతో నూతక్కి గంగాధరరావు సేవ కమిటీ, భక్త రామదాసు సర్వీసెస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్



నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. గత 20 నెలలుగా ఎన్జీఆర్ సేవ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయంలో బిపి, షుగర్, ఇతర సాధారణ వ్యాధులకు వైద్య శిబిరాన్ని నిర్వహిస్తూ పేదలకు సేవ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 100 రూపాయలకే బీపీ, షుగర్ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి నెల నిర్వహించే వైద్య శిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. వైద్య సేవలను మరింత విస్తతం చేయాలనే లక్ష్యంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వైద్య శిబిరంలో సుదీర్ఘకాలంగా మానని పుండు లేక కురుపు కలిగి ఉండడం, రొమ్ము ప్రదేశంలో గానీ ఇతర శరీర భాగంలో వాపు రావడం, గట్టిపడటం, పుట్టుమచ్చలు గాని, పులిపిరకాయలోగాని మార్పు రావడం వంటి లక్షణాలు ఉన్నవారు, చాలాకాలంగా గొంతు బొంగురు పోయినట్లు ఉండడం, వీడని దగ్గు, రోజుల తరబడి అజీర్ణం, ఆహారం మింగేటప్పుడు కష్టంగా ఉండడం, జీర్ణాశయ వ్యవస్థలో, మల మూత్ర విసర్జన పద్ధతిలో ఆకస్మిక మార్పులు, స్త్రీలలో తెల్లబట్ట అవడం, రుతుక్రమంలో మార్పులు వంటి ఇబ్బందులు పడుతున్న వారు తక్షణమే ఉచిత క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరానికి హాజరై పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో నిపుణులైన వైద్య బృందంచే పరీక్షలు చేస్తారన్నారు. అత్యాధునిక వైద్య పరికరాలు కలిగి మొబైల్ వాహనంలో అవసరమైన వారికి వైద్య పరీక్షలు, రొమ్ములకు మమోగ్రఫీ, గర్భాశయానికి స్కానింగ్, పాప్స్మియర్, ఊపిరితిత్తులకు ఎక్రే నిర్వహించి రిపోర్టు ఇవ్వబడుతుందన్నారు. పై లక్షణాలు కలిగి క్యాన్సర్ కారకాలుగా నిర్ధారణ అయితే తెల్ల రేషన్ కార్డు ఉన్న యెడల వారికి బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాదు నందు చికిత్స పొందే అవకాశం ఉందన్నారు. ఈ వైద్య శిబిరాన్ని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఉదయం 9 గంటలకు ప్రారంభిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 9490098225, 9866523282, 9849545434, 9951721433 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కెవి రామిరెడ్డి, నాయకులు రచ్చ నరసింహారావు, కట్టెకోల వెంకన్న, పగిడికత్తుల నాగేశ్వరరావు, బెల్లం లక్ష్మి, భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పొన్నగాని శ్రీనివాస్, కార్యదర్శి చిన్న లింగస్వామి, వల్లంచెట్ల భాస్కరరావు, కోటి హనుమంతరావు, భవనాసి దుర్గారావు పాల్గొన్నారు.

నేడు భద్రాద్రి జిల్లాలో ఎంపీ రఘురాంరెడ్డి పర్యటన

నవతెలంగాణ-ఖమ్మం

ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారని టూర్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా సుజాతనగర్ మండలంలోని సర్వారం గ్రామానికి ఉదయం 10 గంటలకు చేరుకుంటారని పేర్కొన్నారు. అనంతరం సింగభూపాలెం, రాఘవపురం, సుజాతనగర్‌లో పర్యటించి కాంగ్రెస్ పార్టీ శ్రేణులను కలుసుకుంటారని తెలిపారు. ఆ తర్వాత కొత్తగూడెం (విద్యానగర్)లోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తారు. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో ఎంపీ పర్యటన కొనసాగుతుందని పేర్కొన్నారు. సాయంత్రం 4:30 గంటలకు రామవరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వెళ్లి.. తన భారీ విజయానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతారు. అనంతరం గౌతమ్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో ఎంపీ రఘురాం రెడ్డి సమావేశమవు తారని, కూలీలైన్, న్యూ గొల్లగూడెంలలో 16, 17, 18, 19, 20, 24వ వార్డులకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారని పేర్కొన్నారు. వారితో ఆత్మీయ సమావేశమవడంతో పాటు.. ఆయా ప్రాంతాల ప్రజల సమస్యలు తెలుసుకుంటారని పేర్కొన్నారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరై ఎంపీ రఘురాం రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలో ఆళ్లపాడు గ్రామంలో రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కొండూరి విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. రుణమాఫీ కానీ రైతులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణమాఫీ కానీ రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. షెడ్యూల్ ప్రకారం రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాలలో ధ్రువీకరణ పత్రంతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్సులు, లోన్ అకౌంట్ జిరాక్సులు వంటి వివరాలతో మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణ అధికారుల బందాన్ని సంప్రదించాలని ఆయన కోరారు. షెడ్యూలు ప్రకారం శుక్రవారం నాడు బోనకల్ రైతు వేదిక నందు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బంధం రజిత, షేక్ హుస్సేన్ సాహెబ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
శుక్రవారం | ఆగస్టు 30, 2024 | www.navatelangana.com

త్రివేణి పాఠశాలలో వ్యవహారిక భాషా దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని త్రివేణి పాఠశాలలో వ్యవహారిక భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత వ్యవహారిక భాష ఉద్యమ స్ఫూర్తి గిడుగు రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ వ్యవహారిక భాషా ఉద్యమం కారణంగానే తెలుగు భాష విస్తరణ పెరిగిందని, విద్యార్థులకు తెలుగు భాష పట్ల మక్కువ సులభంగా నేర్చుకోగలిగిన స్థాయి అందాయని అందుకు కృషి చేసిన మహానుభావులకు నివాళులు అని పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ పి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ తెలుగు భాష పట్ల ప్రేమ గౌరవం కలిగి ఉండాలని, ఎన్ని ఇతర భాషలు నేర్చుకున్న మాతృభాష స్థాయి ఎన్నడూ తగ్గదని, మాతృభాషలో ప్రావీణ్యం లేని వారికి ఇతర భాషల పట్ల పాండిత్యం అవ్వదని అన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, పాఠశాల వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, క్యాంపస్ ఇన్‌చార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించిన డీఏఓ

నవతెలంగాణ-కల్లూరు

రుణమాఫీ పథకానికి సంబంధించి చేపట్టిన కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ జిల్లా డీఏవో పుల్లయ్య బుధవారం పరిశీలించారు. మండలంలోని తెల్లగారం గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని పరిశీలించి ఏవో ఎం.రూపను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో 3036 మంది ఖాతాదారుల కుటుంబం నిర్ధారణ సర్వే నిర్వహించాల్సి ఉండగా చెన్నూరు, పెద్ద కోరుకొండి తెలగారం, మర్లపాడు, గ్రామాల్లో 150 మందికి పూర్తయిందని డిఏవోకు తెలిపారు. సత్తుపల్లి ఏడీఏ శ్రీనివాస్ రెడ్డి, ఏఈఓలు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో రేషన్ కార్డు నిర్ధారణ కార్యక్రమం

- మండల వ్యవసాయ అధికారిని వాణి

నవతెలంగాణ-కూసుమంచి

2లక్షల లోపు రుణమాఫీ కానీ రైతులకు ప్రతీ గ్రామంలో రేషన్ కార్డు కుటుంబ సభ్యులతో నిర్ధారణ కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి ఆర్.వాణి తెలిపారు. గురువారం మండలంలోని జీళ్ళచెరువు, నేలపట్ల గ్రామాలలో రేషన్ కార్డు లేకపోవడం వల్ల రుణమాఫీ కానీ రైతుల కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రేషన్ కార్డ్ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి వాణి మాట్లాడుతూ... రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ కానీ రైతులు తమ కుటుంబ సభ్యులతో రేషన్ కార్డు నిర్ధారణ కోసం షెడ్యూల్ ప్రకారం వారి మండలంలోని ప్రతి గ్రామానికి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తారని ఈ సందర్భంగా రైతులు తమ ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్స్ ను సంబంధిత అధికారులకు అందజేయాల్సి ఉంటుందని తెలిపారు. రేషన్ కార్డు కుటుంబ సభ్యులతో నిర్ధారణ అయిన తర్వాత ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీళ్లచెరువు క్లస్టర్ ఏఈఓ రవీందర్, గట్టసింగారం క్లస్టర్ ఏఈఓ వంశీకృష్ణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల నందు వైద్య శిబిరం

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ఎర్రుపాలెంలో గల గురుకుల పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు విజృంభిస్తుండటంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల పరిధిలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు డాక్టర్ శశి పూర్ణ ఆధ్వర్యంలో వైద్య శిబిరం గురువారం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా జ్వరం, తలనొప్పి, జ లుబు, దగ్గు వంటి వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్న విద్యార్థినులను పరీక్షించి వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, హెచ్ఈఓ సదాశివరావు, హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వరరెడ్డి, ఏఎన్ఎం స్నేహ, ఆశా కార్యకర్తలు రమణ, హేమలత, పాఠశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-చింతకాని

మండల కేంద్రంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క, తెలంగాణ వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు సిఫార్సుతో సుమారు 15 లక్షల రూపాయలతో మంజూరైన చెక్కులను మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 30 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకుల చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వరరావు, ఖమ్మం మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మడుపల్లి భాస్కర్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, కాంగ్రెస్ పార్టీ మండల అధికార ప్రతినిధి కూరపాటి కిషోర్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బందెల నాగార్జున, కిసాన్ సెల్ అధ్యక్షులు కొప్పుల గోవిందరావు, పాతర్లపాడు మాజీ ఎంపీటీసీ బొర్రా ప్రసాద్, పందిళ్ళపల్లి ఎంపీటీసీ ఓర్సు వీరభద్రం, మహిళా మండల కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, బీసీ సెల్ అధ్యక్షులు సట్టు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యు గోడపత్రిక ఆవిష్కరణ

నవతెలంగాణ-కొణిజర్ల

సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలలో స్త్రీ పురుష సమానత్వం కోసం ప్రగతి మహిళా సంఘం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి పేర్కొన్నారు. మండల కేంద్రం కొనిజర్లలో సంఘం రాష్ట్ర మహాసభల పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్త్రీల ఆహార ఆరోగ్య భద్రతతో పాటు విద్యా ఉద్యోగ ఉపాధి అవకాశాల మెరుగుదల కోసం మహిళా సంఘం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆంగోత్ శాంతి, నాయకురాలు గడ్డం మాధవి, బానోతు మాలని, సూరబోయిన భూలక్ష్మి, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఎరువుల కొరత లేదు

- జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

జిల్లా వ్యాప్తంగా ఎరువులు కొరత లేదని, రైతులకు అవసరానికి సరపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య తెలిపారు. గురువారం సత్తుపల్లి మండలం తాళ్ళ మడ గ్రామంలో రైతు రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వే నిమిత్తం సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. బుధవారం నుండి జిల్లా వ్యాప్తంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ అన్ని గ్రామ పంచాయతీలలో జరుగుతుందన్నారు. బ్యాంక్ లనుంచి రుణం తీసుకొని రేషన్ కార్డు లేని వారు, రుణ మాఫీ రాని వారు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచన చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వి.శ్రీనివాస్ రెడ్డి, మండల వ్యవసాయాధికారు వై.శ్రీనివాసరావు, ఏఈవోలు టీ.నరేష్, కె.ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నయారా ఎస్.ఆర్ ఫ్యూయల్స్ పెట్రోల్ బంక్ ప్రారంభం

నవతెలంగాణ -ఎర్రుపాలెం



మండల పరిధిలోని మీనవోలు గ్రామంలో సంధ్య మోటర్స్ అధినేత లక్కిరెడ్డి సుధాకరరెడ్డిచే నూతనంగా నిర్మించబడిన నయారా ఎస్.ఆర్ ఫ్యూయల్స్ పెట్రోల్ బంకును గురువారం స్థానిక ఎస్సై వి.వెంకటేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి, టీపీసీసీ సభ్యులు శీలం ప్రతాపరెడ్డి, మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చా వ రామకృష్ణ,నాయకులు బొగ్గుల గోవర్ధన్ రెడ్డి,బండా రు నరసింహారావు,అనుమోలు కృష్ణారావు,తల్లపురెడ్డి నాగిరెడ్డి,లక్కిరెడ్డి సందీప్ రెడ్డి,కాశవర్గుల సత్యనారా యణ, కాశవర్గుల రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం వినతి

నవతెలంగాణ -కూసుమంచి



మండలంలోని ప్రతి గ్రామంలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారనివ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గన్యానాయక్ , శీలం గురుమూర్తి అన్నారున. ప్రభుత్వం వెంటనే గ్రామాల్లో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మండల వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... మండలంలో సీజనల్ జ్వరాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, మండలంలో ప్రతి గ్రామంలో వైద్య బృందం సర్వే నిర్వహించి వెంటనే గ్రామాలలో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో 100 పడకల హాస్పిటల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవి, సైదులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే మట్టా రాగమయి

నవతెలంగాణ-కల్లూరు

పేద ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎంతో నమ్మకం ఉంచి అధికారాన్నిచ్చిన వారికి సంక్షేమ పథకాలు అందజేయటమే తమ లక్ష్యం అని సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయ దయానంద్ అన్నారు. బుధవారం స్థానిక రైతు వేదికలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు లబ్దిదారులకు పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. 50 మందికి షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయటానికి విశేషమైన కృషి చేస్తుందన్నారు. రెండు లక్షల రైతు రుణమాఫీ అర్హులైన వారందరికీ అందిస్తామని, దీంట్లో ఎలాంటి సందేహం లేదని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజల ప్రభుత్వం, ప్రజలను అన్ని విధాలుగా ఆదుకోవడం కోసమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేక సంక్షేమ పథకాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఏఎంసీ చైర్మెన్ భాగం నీరజాదేవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, డిప్యూటీ తహసీల్దార్ బాబ్జి, జంగా ప్రసాద్, ఎంపీడీవో డి.చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, పసుమర్తి మోహన్రావు, ఆలకుంట నరసింహారావు, మోహన్ రెడ్డి, ఏనుగు సత్యం బాబు, శీలం బ్రహ్మారెడ్డి, మండల గ్రామ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్, కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ

తల్లాడ : కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్, షాదీ ముబారక్ చెక్కులను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మట్ట



రాగమయి తల్లాడ రైతు వేదికలో లబ్దిదారులకు పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.37 లక్షల 72500లను 151 మంది లబ్దిదారులకు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు రూ.50 లక్షల 5800 అందజేశారు. ఎంపీడీవో చంద్రమౌళి, డిప్యూటీ తహసీల్దార్ వనజ, కాపు సుధాకర్, దగ్గుల రఘుపతి రెడ్డి, మారళ్ళ మల్లికార్జున్, తాళ్ల జోసెఫ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్యశాఖలో ప్రక్షాళన చేయాలి

- డెంగ్యూ మృతులకు పరిహారం చెల్లించాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు

నవతెలంగాణ-ఖమ్మం

వైద్య ఆరోగ్య శాఖను ఉమ్మడి ఖమ్మం జిల్లాలలో ప్రక్షాళన చేయాలని, వైద్య సేవలందించడంలో ప్రభుత్వాసుపత్రులు విఫలమయ్యాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. పేద, మధ్యతరగతి ప్రజలు ప్రయివేట్ వైద్యం పొందలేక, ప్రభుత్వాసుపత్రిలో వైద్యం అందక ప్రాణాలను కోల్పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల సంయుక్త సమావేశం గురువారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో సి.పి.ఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ ప్రతి ఇంట్లోను జ్వర పీడితులున్నారని, విషజ్వరాలు, చికెన్‌గున్యా డెంగ్యూ వ్యాధులు తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయని, ఒక సారి జ్వరం వస్తే రెండు నెలల పాటు కనీసం ఇంట్లోకూడా పనిచేసే పరిస్థితి లేదని ఆయన తెలిపారు. ఇప్పటికే ఒక్క ఖమ్మం జిల్లాలోనే సుమారు 50 మంది డెంగ్యూతో మృతి చెందారని తెలిపారు. డెంగ్యూతో మృతి చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు సరఫరా కావడం లేదని ఆరోపణలు వినవస్తున్నాయని, అవసరమైతే



ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి స్టాక్ రిజిష్టర్లు బహిర్గతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తాటి వెంకటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

త్రివేణిలో జాతీయ క్రీడా దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని త్రివేణిలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ధ్యాన్చంద్ చిత్రపటానికి పాఠశాల డైరెక్టర్ ప్రిన్సిపల్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు చదువులోనే గాక క్రీడల్లో కూడా తమ ప్రతిభను చాటి పాఠశాలకు దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు విద్యతో పాటుగా క్రీడల పట్ల కూడా అభిరుచి కలిగించే కార్యక్రమాలను మరిన్ని చేపట్టి వారిని సర్వతో అభివృద్ధిగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిఆర్ఓ మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ స్వప్న, ముస్తఫా, శ్రీదేవి, క్యాంపస్ ఇంచార్జ్ చార్లెస్, సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాయకన్ గూడెంలో ఘనంగా గంగమ్మ పండుగ

నవతెలంగాణ-కూసుమంచి

మండలంలోని నాయకన్ గూడెం గ్రామంలో గురువారం ఘనంగా గంగమ్మ పండుగను గ్రామస్తులు జరుపుకున్నారు. ఈ పండుగలో ముఖ్యంగా చెరువులో చేపలు పట్టే పనే వృత్తిగా జీవించే మత్స్యకారులు గంగమ్మ తల్లిని తమ దైవంగా భావిస్తారు. ఈ సందర్భంగా మత్స్యకారులు పెద్ద ఎత్తున గంగమ్మ గుడికి బోనాలు ఎత్తుకొని జాతరగా వెళ్లి తమ మొక్కులను చెల్లించుకుంటారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు, వారి కుటుంబ సభ్యులు ఆనంద ఉత్సవాలతో గంగమ్మ జాతర జరుపుకున్నారు.



రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు వైరా ఎంజెపి విద్యార్థులు ఎంపిక

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం జరిగిన జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఈ.జీవన్ కుమార్, రిత్విక్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ 1, 2 తేదీలలో నిజామాబాద్‌లో జరగబోయే అండర్ 13 రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రతిభ కనపరిచిన విద్యార్థులను ఆర్సిఓ టి. అంజలి, ప్రిన్సిపల్ జహీద, పిఈటి రవి, ఏటీపీ పద్మజ, వార్డెన్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయ బృందం అభినందించింది.

న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీపై కేసు కొట్టివేత

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

హైటెక్ డిజిటల్ కమ్యూనికేషన్ వారు న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీపై వేసిన కేసును కొట్టి వేస్తూ ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఏ.మాధవీలత తీర్పునిచ్చారు. కేసు వివరాలు ఖమ్మం పట్టణానికి చెందిన హైటెక్ డిజిటల్ కమ్యూనికేషన్ పేరుతో కేబుల్ టీవీలను నడిపుతున్నాడు. కేబుల్ టివిలకు సంబంధించిన సెట్ ఆఫ్ బాక్స్‌లను ఎల్ఎంవి గూడ్స్ కేరియర్‌లో హైదారాబాద్ నుండి ఖమ్మం తీసుకొస్తున్న సందర్భంలో చెట్టుకు డీ కొట్టడం వల్ల ఫైర్ యాక్సిడెంట్ కావటంతో కాలిపోయాయి. దీంతో తనకు నష్టం వచ్చిందని, ఆ నష్టాన్ని ఇన్సూరెన్స్ వారు చెల్లించాలని ఫిర్యాదిదారుడు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌కు నివేదించారు. ఇట్టి కేసు పూర్వ పరాలను పరిశీలించిన ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ పైవిధంగా తీర్పునిచ్చారు. న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ తరపున న్యాయవాదిగా బండారుపల్లి గంగాదర్ వాదించారు.

1న నిరసనలు

నవతెలంగాణ-ఖమ్మం

సెప్టెంబర్ -1 (ఆదివారం) పెన్షన్ విద్రోదినంగా పాటిస్తూ రాష్ట్ర అండ్ జిల్లా స్థాయిలో చేసే నిరసన కార్యక్రమాలలో పాల్గొంటూ భాగస్వామ్యం అవుతామని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ వస్కుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. నిరసన కార్యక్రమంలో తమ సంఘ సభ్యులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, రాష్ట్ర, జిల్లా స్థాయి నిరసన కార్యక్రమంలో పాల్గొంటామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సీపీఎస్, యు.పి.ఎస్.రద్దు చేయాలని, ఓ.పి.ఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.



కొండంగుల బోడులో గ్రామ దేవతలకు బోనాలు

నవతెలంగాణ- టేకులపల్లి

టేకులపల్లి మండలంలోని మద్రాస్ తండా గ్రామపంచాయతీ పరిధిలో గల కొండంగుల బోడు గ్రామంలో గ్రామ దేవతలకు బోనాలు మహిళలు సమర్పించినట్లు గురువారం తెలిపారు. గ్రామ ప్రజలు ఉత్సవాలతో బోనాల పండుగ ఘనంగా చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామములో ఉన్న యువతి, యువకులు, చిన్న, పెద్ద అందరు ఐకమత్యంతో పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగికి ఘన సత్కారం

ప్రజలతో మమేకమై సేవలందించిన ఏఎన్ఎం

నవతెలంగాణ-కల్లూరు

6 సంవత్సరాల పాటు ఏఎన్ఎంగా పని పనిచేసి బదిలీపై వెళ్లిన తడికి మల్ల పద్మకు గ్రామ పెద్దలు, మహిళలు ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని పుల్లయ్య బంజర గ్రామంలో ఏఎన్ఎంగా 2018 నుండి విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై కష్టకాలమైన కరోనా సమయంలో కూడా ప్రజలకు దగ్గరగా ఉండి విశేష సేవలు అందించారని గ్రామ పెద్దలు కొనియాడారు. బదిలీపై మండల పరిధిలోని పేరువంచ గ్రామానికి వెళ్లటంతో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సొసైటీ చైర్మెన్ బోబోలు లక్ష్మణ్ రావు, బుర్రి వీరయ్య, పెద్ద బోయిన విజయ్ కుమార్, కిష్టంశెట్టి ఏడుకొండలు, బోబోలు కృష్ణయ్య, వై. శ్రీనివాసరావు, ఝాన్సీ, సుజాత, పాల్గొన్నారు.

త్రివేణిలో క్రీడా దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-కొత్తగూడెం టౌన్

స్థానిక లక్ష్మీదేవి పల్లి త్రివేణి పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలు గురువారం నిర్వహించారు. ఖేల్ రత్న బిరుదు పొందిన ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ప్రతి ఏడాది జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటామని త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి తెలిపారు. ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలవేసి ఆయనకు నివాళులు అర్పిస్తూ ఆయన హాకీ రంగానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్, సీఆర్ఓ కె.మురళీకృష్ణ, ప్రిన్సిపల్స్ వైవి సురేష్, శ్రీనివాస్ సింగ్, వైస్ ప్రిన్సిపల్ సౌజన్య, ఇంచార్జ్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు

నవతెలంగాణ-ఎర్రుపాలెం

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ పుట్టిన రోజును పురస్కరించుకొని ప్రభుత్వం ప్రకటించిన క్రీడా దినోత్సవంలో భాగంగా గురువారం మామునూరు గ్రామంలో గల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్యాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ మారాబత్తుల జమలయ్య విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు విలువైన బహుమతులు అందించారు. బా లుర విభాగంలో కబడ్డీ మొదటి బహుమతి ఉపేంద్ర, రెండవ బహుమతి షేక్ బాజీ గెలుపొందారు. బాలికల విభాగంలో కబడ్డీ మొదటి బహుమతి సమీరా, రెండవ బహుమతి షేక్ ముస్తాన్ జట్లు గెలుపొందినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ కుమారి, వెంకమ్మ, పుల్లయ్య, కాంతమ్మ లింగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రెజొనెన్స్‌లో నేషనల్ స్పోర్ట్స్ డే

నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని శ్రీనగర్ కాలనీలోని రెజొనెన్స్ స్కూల్‌లో భారతీయ హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత స్కూల్‌లో జరిగిన స్పోర్ట్స్ మీట్‌ను డైరెక్టర్ కొండా శ్రీధర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదడుకు ధ్యానం ఎంత అవసరమో, శరీరానికి క్రీడలు అంత అవసరం అన్నారు. విద్యార్థులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరిస్తూ క్రీడా స్ఫూర్తిని అలవాటు చేసుకొని ఆత్మవిశ్వాసం, పట్టుదలతో ధ్యాన్‌చంద్ వంటి గొప్ప క్రీడాకారుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపచేయాలని అన్నారు. నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా నిర్వహించిన వివిధ క్రీడలలో తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థి విద్యార్థులకు బహుమతులను అందించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కొండా కృష్ణవేణి, ప్రిన్సిపాల్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) సభ్యులు మృతి

మృతదేహంపై జెండా కప్పి నివాళి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ గోపవరం గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) శాఖ సభ్యులు మందడపు వీరబాబు(46) మృతి చెందారు. పార్టీ మండల కార్యదర్శి దివ్వెల వీరయ్యతో పాటు మండల కమిటీ సభ్యులు కలిసి మృతదేహాన్ని సందర్శించారు. అనంతరం వీరబాబు పార్థివదేహానికి పూలమాలలు వేసి పార్టీ జెండాను కప్పి ఘనమైన నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి కోటేశ్వరరావు, సగ్గుర్తి సంజీవరావు, మందడపు ప్రభాకర్ రావు, మేడగాని తి రుపతిరావు, నల్లమోతు హనుమంతరావు, గామాసు జోగయ్య, నాగులవంచ వెంకట్రామయ్య, గోధుమ వెం కటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే ఐశ్వర్యం

నవతెలంగాణ-టేకులపల్లి

మండలంలోని పలు గ్రామాలలో ప్రజలకు సులానగర్ ప్రాథమిక ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి, ఐశ్వర్యమే ఆరోగ్యం, ఆరోగ్యమే ఐశ్వర్యమని వైద్య సిబ్బంది తెలిపారు. టేకులపల్లి మండలంలోని బద్దు తండా, రామచంద్రుని పేట, జి.కొత్త తండా, కోయగూడెం, చింతోని చలక తండ, బేతంపూడి, రాజారాం తండ, వజ్జోని గూడెం గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. ఐశ్వర్యమే ఆరోగ్యం - ఆరోగ్యమే ఐశ్వర్యం అని దీనికి వైద్య ఆరోగ్యశాఖ వారిచ్చే సూచనలు, సలహాలను పాటించాలని ప్రజలను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్వైజర్లు గుజ్జ విజయ, నాగు బండి వెంకటేశ్వర్లు, ఇల్లందు డివిజన్ క్షయ వ్యాధి పర్యవేక్షణ అధికారి శంకర్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు ధరణి, హారిక, రుక్సాన, చందన, శైలజ, ఏఎన్ఎంలు కమల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) జిల్లా నేత యర్రా శ్రీనివాసరావుపై అక్రమ కేసు కొట్టివేత

నవతెలంగాణ-ఖమ్మం లీగల్

2018 సంవత్సరంలో గత రాష్ట్ర ప్రభుత్వం మంత్రి కేటీఆర్ ఖమ్మం వస్తున్న సందర్భంగా అక్రమంగా నిర్బంధించి కేసు పెట్టారు. దానిపై కోర్టులో వాదోపవాదాలు జరిగిన అనంతరం గురువారం కేసు కొట్టివేశారు. కేసును లాయర్ యర్రా జ్ఞానేష్ యర్రాశ్రీనివాసరావు తరపున వాదించారు. లాయర్ యర్రా జ్ఞానేష్ సహాయకులు సాయిరెడ్డిలకు యర్రా శ్రీనివాసరావు ఒక ప్రకటనలు అభినందన తెలియజేశారు.





అగ్ని బాధిత కుటుంబానికి బాసటగా నిలిచిన రెడ్ క్రాస్ సొసైటీ

- ఎమ్మెల్యే వెంకట్రావు చేతుల మీదుగా వంట సామగ్రి అందజేత

నవతెలంగాణ -దుమ్ముగూడెం

మండలంలోని మంగువాయిబాడవ గ్రామంలో గత రెండు రోజుల క్రితం జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన పొడియం సురేష్‌కు చెందిన పూరిల్లు పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబానికి భద్రాచలం రెడ్ క్రాస్ సొసైటీ వారు బాసట నిలిచి కొంత నగదుతో పాటు నిత్యావసరాలు, వంట సామగ్రిని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకోవడంతో పాటు బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇప్పించే విధంగా చూస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం రెడ్ క్రాస్ సభ్యులు తిప్పన సిద్దులు, వెంకటరెడ్డి, యోగి నారాయణ, ఎస్సై వెంకటప్పయ్య, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కారం పుల్లయ్య, జిల్లా నాయకులు యలమంచి వంశీకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఎండి నవాబ్, కిసాన్ కేత్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దర్శి వెంకట సాంబశివరావు, లంక శ్రీనివాసరావు, కుంజా శ్రీనివాసరావు, డివిజన్ సేవాదళ్ అధ్యక్షులు పిలక వెంకటరమణారెడ్డి, యువజన నాయకులు కోడి చంటి, పూజారి సూర్యచంద్రరావు, వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సహకారం అందించడం అభినందనీయం

నవతెలంగాణ-చర్ల



కష్టంలో ఉన్నవారికి చేయి చేయి కలిపి సహకారం అందించడం అభినందనీయమని మేమున్నాం కమిటీ చైర్మెన్ నీలి ప్రకాష్ అన్నారు. పాతచర్ల - అంబేద్కర్ నగర్‌కు చెందిన అందుగుల ప్రసాద్ (తాపీమేస్త్రీ) కు ఇద్దరు కుమార్తెలు. కష్టపడి ఇద్దరినీ చదివిస్తూ బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేర్పించాడు. సిరిసిల్ల (ఆదిలాబాద్)లో చదువుతున్న పెద్ద కుమార్తె అయిన మహిమ తారకు కడుపునొప్పి రావడంతో హాస్పిటల్‌కు తీసుకెళ్లడం, పరీక్షల అనంతరం కిడ్నీ ఆపరేషన్ చేయాలని డాక్టర్లు చెప్పడం జరిగింది. రెక్కాడితే గానీ కుటుంబం గడవని ఈ పేద కుటుంబాన్ని ఆదుకోవడానికి ఫండ్ రైజింగ్ పోస్టు ద్వారా సేకరించిన రూ.30 వేలను గురువారం ఉదయం 11 గంటలకు చర్లలోని మేమున్నాం కార్యాలయంలో ఏఐటీయూసీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కు చెందిన గుంజి మాల్యాద్రి, సాయిలు తిరుపతిల చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ విధంగా పేదలు కష్టాల్లో ఉన్నప్పుడు తలా ఓ చేయి వేసి సహాయమందిస్తే వారికి ఎంతో ఊరటగా ఉంటుందని, పేద కుటుంబాలకు భరోసాను ఇచ్చే క్రమంలో మేమున్నాం టీం ఎల్లప్పుడూ ముందుంటుందని చైర్మెన్ తెలుపుతూ దాతలకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో దొడ్డి తాతారావు మాష్టారు, దొడ్డ ప్రభుదాస్, తోటమల్ల రమణమూర్తి, పులపాక రాజు, తొండూరి అనిల్, దూలం ప్రసాద్, దొడ్డి సూరిబాబు, కొమరవరపు రవి, దొడ్డి దశరథ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నవతెలంగాణ-కరకగూడెం

కరకగూడెం గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తన క్యాంపు కార్యాలయంలో సుమారు రెండు లక్షల నలభై ఐదువేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను తన చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. లక్షలు ఖర్చు చేసి కార్పొరేట్ వైద్యశాలల్లో చికిత్స చేయించుకోలేని వారికి సీఎంఆర్ఎఫ్ పథకం కొండంత అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎర్ర సురేష్, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలి

- ఎస్ఓటూ డైరెక్టర్‌కు వినతి

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కోరుతూ కొత్తగూడెంలో ఎస్ఓటూ డైరెక్టర్ పా ఎస్.వరప్రసాద్ (డిజియం పర్సనల్)కి గురువారం వినతి పత్రం అందజేసినట్లు సామాజిక సేవకులు కర్నే బాబురావు తెలిపారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సుమారు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు ఓబీ వర్కర్లు అతి తక్కువ వేతనాలతో పని చేస్తూ బ్రతుకు బండినీ లాగుతున్నారని తెలిపారు. అదే సమయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 22 నెంబర్ జీఓ అమలుకు సన్నాహాలు అయితే చేశారు. కానీ గెజిట్ చేయని కారణంగా కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు పెరగలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారి వేతనాలు పెరుగుతాయని ఎంతగానో ఎదురుచూస్తున్నారని తెలిపారు. దయచేసి సింగరేణి యాజమాన్యం స్పందించి కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 22 గెజిట్ చేసి అమలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని లేదా హై పవర్ కమిటీ వేతనాలు అమలు చేసి అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు ప్రైవేటు కన్వీనెంట్స్ వాహన డ్రైవర్ల వేతనాలు పెరిగే విధంగా చూడాలని అధికారులను కోరారు.



బోడ తులుశ్య మరణం పార్టీకి తీరని లోటు

నవతెలంగాణ-ఇల్లందు

న్యూడెమోక్రసీ పార్టీ కొమరారం ప్రాంతీయ కమిటీ సీనియర్ నాయకుడు బోడ తులుశ్య మరణం చాలా బాధాకరమని, ఆయన మృతి పార్టీకి తీరని లోటని మండల నాయకులు, బోయి తండా మాజీ సర్పంచ్ బానోత్ సంతు అన్నారు. బోయితండా పంచాయతీలోని (విక్రమ్ నగర్)తుంటాబాలు తండాలో బోడ తులుశ్య సంతాప సభ గురువారం సంతు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా న్యూడెమోక్రసీ నాయకులు మాణిక్యారం మాజీ సర్పంచ్ మోకాళ్ళ క్రిష్ణ, పోచారం మాజీ సర్పంచ్ శ్రీను, పివైఎల్ రాష్ట్ర కమిటీ సభ్యులు మోతిలాల్, మాస్‌లైన్ జిల్లా నాయకులు అజ్మీరా బిచ్చ, బుర్ర రాఘవులు మాట్లాడారు. బోడ తులుశ్య సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, గన్ను, మురళి, రమేష్, సురేష్, హర్యా జగన్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఆటోనగర్ స్థాపనకు కృషి

- మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు

ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీ పరిధిలో ఆటోనగర్ స్థాపించేందుకు కృషి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు తెలిపారు. గవర్నమెంట్ హాస్పిటల్ సమీపంలో గురువారం ఆటోనగర్ ఆల్ మోటార్స్ వర్క్ యూనియన్ నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అందరూ ఒకే దగ్గర పని చేసుకోవడం వలన కార్మికులకు వాహన యాజమాన్యులకు సహకారంగా ఉంటుందని తెలిపారు. అనంతరం చైర్మెన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపాలిటీ వైస్ చైర్మెన్ సయ్యద్ జానీ పాషా, కార్యదర్శి జాఫర్, ఆటోనగర్ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలి

- సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాలకు సీఐటీయూ మద్దతు
- జిల్లా అధ్యక్షులు కే.బ్రహ్మచారి

నవతెలంగాణ-పాల్వంచ



తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కే. బ్రహ్మచారి డిమాండ్ చేశారు. గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సీఐటీయూ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ధర్నాను ఉద్దేశించి బ్రహ్మచారి మాట్లాడారు. కాంట్రాక్టు వ్యవస్థను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్కువ వేతనాలు చెల్లిస్తూ ఎక్కువ పని గంటలు నిర్దేశిస్తూ శ్రమ దోపిడీ జరుగుతుందని పేర్కొన్నారు. కాంట్రాక్టు వ్యవస్థ అనేది బానిస వ్యవస్థ అని ఈ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు సమగ్ర శిక్ష ఉద్యోగులు కార్మికుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆ సమస్యలను పరిష్కారం చేయటం లేదని విమర్శించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సమగ్ర శిక్ష కార్మికుల న్యాయమైన కోరికలను పరిష్కారం చేయాలని, అందరిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ సమాన పనికి సమాన వేతనం అమలు కావడం లేదని కోర్టుల అన్నా, చట్టాలన్న ప్రభుత్వానికి లెక్కలేనితనంగా మారిందని పేర్కొన్నారు. సమగ్ర శిక్ష కార్మికులు ఉద్యోగులు పోరాటానికి సీఐటీయూ అండగా ఉంటుందని తెలిపారు. అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అవుట్సోర్సింగ్ కార్మికులను ఐక్యపరిచి ఐక్య ఉద్యమాల నిర్మాణానికి సిఐటియు కృషి చేస్తుందని, అటువంటి పోరాటంలో సమగ్ర శిక్ష కార్మికులు ఉద్యోగులు కలిసి రావాలని సిఐటియు విజ్ఞప్తి చేసింది. సిఐటియు నుంచి మద్దతు తెలిపిన వారిలో సిఐటియు జిల్లా కోశాధికారి జి. పద్మ, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్ తదితరులు ఉన్నారు.

నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలి

- పాత పెన్షన్ అమలు చేయాలి... యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.కృష్ణ

నవతెలంగాణ-మణుగూరు



నూతన పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్.కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం మీరా హుస్సేన్ అధ్యక్షతన ధర్నా, సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగుల పాలిట శాపంగా మారిన నూతన పెన్షన్ విధానాలను సామాజిక భద్రతలో భాగంగా రద్దు చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలన్నారు. సిపిఎస్ ఉద్యోగి రిటైర్ లేదా చనిపోతే వచ్చే అతి తక్కువ పెన్షన్ వలన సిపిఎస్ ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే చెల్లించి పీఆర్సీ రిపోర్టును తెప్పించుకొని నూతన పిఆర్సిని వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నెలనెలా ఏర్పడే ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి స్వర్ణ, మండల అధ్యక్షులు కారం సీతారామయ్య, జ్యోతి, సంఘ సభ్యులు విజయలక్ష్మి, బీ. ఐలయ్య, కుమారస్వామి, వజ్జా, కృష్ణమూర్తి, పద్మ, సురేష్, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆరోగ్యానికి ఎంతో అవసరం

- ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి



ఆటలు ఆరోగ్యానికి ఎంతో అవసరమని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జన్మదిన సందర్భంగా యర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హాకీ క్రీడా పోటీలు నిర్వహిస్తున్న సందర్భంగా గురువారం పాఠశాల హెడ్మాస్టర్ ఆనంద్ కుమార్ జాతీయ జెండా ఆవిష్కరణ చేసి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ తో కలసి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ క్రీడా అయిన హాకీ ఆడటం నేర్చుకొని జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు ప్రతిభ కనబరిచి పాఠశాలకు, తల్లితండ్రులుకు మంచి పేరు తీసుకురావాలన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని శారీరక దృఢత్వాన్ని పెంచుతాయని, విద్యార్థులు చదువుతో పాటు ఆటలు కూడా ఆడాలని సూచించారు. కాంగ్రెస్ మండల యువజన నాయకులు వేముల నరేష్ బాబు మండలంలో వున్న యువత కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ మరో అడుగు ముందుకు వేసి విద్యార్థులు కోసం హాకీ స్టిక్స్ బహుకరించడం చాల సంతోషం అన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి హాకీ ఆడి పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణ, తహసీల్దార్ జగదీష్ ప్రసాద్, డాక్టర్ ప్రియాంక, సర్కిల్ ఇన్స్‌పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి, సబ్ ఇన్స్‌పెక్టర్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయానికి అద్దం పట్టాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్
- నవతెలంగాణ వార్షికోత్సవ ప్రత్యేక సంచిక ఆవిష్కరణ

నవతెలంగాణ-పాల్వంచ



నవతెలంగాణ దినపత్రిక ప్రజాభిప్రాయానికి అద్దం పట్టి చురుకైన పాత్ర వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆకాంక్షించారు. గురువారం నవ తెలంగాణ 9వ వార్షికోత్సవ సందర్భంగా వెలువడిన ప్రత్యేక సంచికను ఆయన తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవతెలంగాణ 9వ వార్షికోత్సవ సందర్భంగా సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సుకు జిల్లా సమతుల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టే అవినీతిన కార్యక్రమాలను ఎప్పటికప్పుడు నవతెలంగాణ తెలియజేస్తుందన్నారు. ప్రజల సమస్యలు వెలుగులోకి తీసుకురావడంలో, సమస్యలు గ్రహించడంలో నవతెలంగాణ దినపత్రిక ముందుంటుందన్నారు. నవతెలంగాణ దినపత్రిక ప్రగతిశీలింగా ప్రజల కోసం నిరంతరం ఇప్పటికే పని చేస్తుందని, దినదినాభివృద్ధి చెంది మరెన్నో వార్షికోత్సవ జరుపుకోవాలన్నారు. ఏవో గన్యా నాయక్ మాట్లాడుతూ వర్తమాన ప్రపంచంలో ప్రచార ప్రసార సాధనలకు అత్యంత ప్రాముఖ్యత ఉందని, ఆధునికరణ గ్లోబలీకరణ నేపథ్యంలో వీటి పాత్ర ప్రాముఖ్యత మరింత పెరిగిందన్నారు. వార్షికోత్సవం జరుపుకోవడం పట్ల ఆయన హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నవతెలంగాణ పాత్రికేయులు రాళ్ల బండి కృష్ణమూర్తి, ఏడివిటీ ఇంచార్జ్ నందిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో 25 తీర్మానాలు ఆమోదం

నవతెలంగాణ-ఇల్లందు



మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మెన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. చైర్మెన్‌తో పాటు 12 మంది మున్సిపల్ కౌన్సిలర్లు హాజరయ్యారు. మొత్తం 25 తీర్మానాలు ఆమోదించారు.

కౌన్సిల్ సమావేశంలో ముఖ్యాంశాలు

రెండో వార్డు స్మశాన వాటిక వెళ్లే దారిలో బ్రిడ్జి నిర్మాణానికి కౌన్సిల్ సభ్యులు ఆమోదం. దసరా, బతుకమ్మ వేడుకలకు నిధులకు సంబంధించి తీర్మానం ఆమోదం తెలిపారు. ఏడో వార్డులో ఉన్న కమ్యూనిటీ హాల్ మరమ్మతు చేయుటకు కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. స్వచ్ఛ ఆటోలు మరమ్మతులకు డీఆర్సీసీ వర్మి కంపోస్ట్ యాడ్ సంబంధించి టెండర్ ద్వారా లీజుకి ఇవ్వాల్సిందిగా కౌన్సిల్ సభ్యులు తీర్మానం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ యాదగిరి, మేనేజర్ అంకుశావళి, డిఈ, ఏఈ, ఏఓ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రాధాకృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు వారా రవి, కటకం పద్మావతి, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ హాజం, ఎలమందల వీణ, నాగలక్ష్మి, రజిత, పత్తి స్వప్న, మొగిలి లక్ష్మీ, అంకెపాక నవీన్‌కుమార్, కుమ్మరి రవీందర్, కోఆప్షన్ సభ్యులు నాగమణి, మున్సిపల్ జూనియర్ అసిస్టెంట్లు జవాన్లు పాల్గొన్నారు.

వేతన ఏరియర్స్ వెంటనే చెల్లించాలి

- టీటైమ్‌లో మున్సిపాలిటీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఇల్లందు



స్థానిక ఇల్లందు మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటరీ, వాటర్ వర్కర్స్‌కు వేతన ఏరియర్స్ వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపాలిటీ కార్మికులు టీటైమ్‌లో కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కన్వీనర్ తాళ్లూరి కృష్ణ పాల్గొని మాట్లాడారు. రావసిన 13నెలల మేడే కానుక, 18నెలల పెరిగిన వేతనాలు పెండింగ్ లో ఉన్నాయన్నారు. వాటిని తక్షణమే చెల్లించాలని మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, ఆర్జేడీ, మునిసిపల్ కమిషనర్, చైర్మెన్, 24వార్డుల కౌన్సిలర్లకు వినతి పత్రాలు అందజేశామన్నారు. అయినా అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్న తీరుకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా కార్మికులు టీటైమ్‌లో మున్సిపాలిటీ వద్ద నిరసన చేపట్టాల్సి వచ్చిందన్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని పలు దఫాలుగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ అధికారులకు, పాలకులకు పట్టింపు లేకుండా పోయిందన్నారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో దశల వారీ ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. శుక్రవారం కార్మికులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని విధులు నిర్వర్తిస్తున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుక్కాచందర్, కొల్లపురి వేణు, ఎస్. సంజీవ్, బీ.మైబిరెడ్డి, కే.శ్రీను, సాంబ, సిహెచ్.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోరు వానలోనూ కల్యాణ చెక్కులు పంపిణీ

- మీ ఇంటికే మీ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎంపీ రామ సహాయం

నవతెలంగాణ-అశ్వారావుపేట

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండవ విడత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ "మీ ఎమ్మెల్యే మీ ఇంటికే" పేరుతో ఇంటింటికీ వెళ్ళి లబ్ధిదారులకు అందజేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం చేపట్టిన ఈ కార్యక్రమం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి సైతం పాల్గొన్నారు. మండలంలో ఆసుపాక, అనంతారం, గాండ్లగూడెం, మల్లాయి గూడెం, పంచాయతీలలోని పలు గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో కలసి చెక్కులు పంపిణీ చేసారు. పలు గ్రామాలలో జటిలంగా ఉన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను స్వయంగా



పరిశీలించినందు వలన తప్పకుండా గిరిజన ప్రాంత నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్రిష్ణ ప్రసాద్, ఆర్ఐలు పద్మావతి, క్రిష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు జూపల్లి రమేష్, తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

చింతలక్ష్మీ నగర్‌కు రక్షణ కల్పించాలి

- ఎమ్మెల్యే పాయంకు వినతి

నవతెలంగాణ-మణుగూరు



చింతా లక్ష్మీ నగర్ నిరుపేదలకు గృహవసతి రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకి గురువారం గోదావరి ముంపు బాధితులు, నిరుపేదల పోరాట కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. గోదావరి ముంపు బాధితుల, ఇండ్లు లేని నిరుపేదల పోరాట కమిటీ కార్యదర్శి సున్నం భూలక్ష్మి మాట్లాడుతూ పినపాక నియోజకవర్గం పరిధిలోని తమ ప్రాంత ఎమ్మెల్యేగా తమకు అండగా నిలవాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గృహ పోరాట కమిటీ సభ్యులు కోడిమి రాధా, రావర్తి లక్ష్మి, మరల కృపారాణి, సోడే అచ్చమ్మ, బిల్లా చంద్రకళ, వెంకటమ్మ, రమణ, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం ఏరియా రుద్రంపూర్, ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్ నందు గ్రాస్ క్రికెట్ గ్రౌండ్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఐఎన్‌టియూసి వైస్ ప్రెసిడెంట్ రజాక్ ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలేం రాజును కోరారు. గురువారం జీఎం కార్యాలయంలో జీఎంను కలిసి ఏరియాలో ఉన్న పలు సమస్యలతో పాటు, రుద్రంపూర్ జయశంకర్ గ్రౌండ్‌లో ఇంకా సమకూర్చవలసిన వసతుల గురించి మాట్లాడారు. గ్రౌండ్‌కు ఫ్లడ్ లైట్లు, ఫెన్సింగ్, వాష్‌రూమ్, వసతులు సమకూర్చడం జరిగింది, 11 ఏరియాలలో మొట్టమొదటి ఫ్లడ్ లైట్స్ ఉన్నగ్రౌండ్ మన రుద్రంపూర్‌లోని జయశంకర్ గ్రౌండ్, సౌకర్యాలు ఉన్న గ్రౌండ్‌అని చెప్పారు. ఇంకా ఇందులో క్రికెట్ ఆడడానికి (గ్రాస్) గడ్డి పెంచడం వల్ల రాష్ట్రంలోనే అత్యుత్తమ గ్రౌండ్‌గా అభివృద్ధి చెందుతుందని, గ్రౌండ్‌లో అన్ని క్రీడలు ఆడిన వారు ఉద్యోగ అవకాశాలు పొందిన ఘనత ఉందని తెలిపారు. ఈ గ్రౌండ్‌లో గ్రాస్, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. జీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

కాసానికి ఎమ్మెల్యే కూనంనేని పరామర్శ

నవతెలంగాణ-కొత్తగూడెం



అనారోగ్యంతో ఖమ్మం ఆరోగ్య హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు కాసాని ఐలయ్యను కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పరామ ర్శించారు. గురువారం ఖమ్మంలోని ఆసుపత్రికి వెళ్లి కాసానిని పరామర్శించి, త్వరగా కోలుకొని ప్రజా క్షేత్రంలోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. పలు ప్రజా పోరాటాల గత జ్ఞాపకాలు గుర్తు చేశారు. పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఖమ్మం జిల్లా సీనియర్ నాయకులు కే.నర్సయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, వీర్ల రమేష్ నాయకులు వంశీ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారునికి రూ.50వేల ఆర్థిక సాయం

నవతెలంగాణ భద్రాచలం రూరల్

నియోజకవర్గానికి చెందిన గిరిజన యువకుడు టింగ ధర్మతేజ అంతర్జాతీయ క్రీడలకు అర్హత సాధించినప్పటికీ కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు తెల్ల వెంకట్రావు ధర్మతేజను ప్రోత్సహిస్తూ 50 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించి అంతర్జాతీయ క్రీడలకు వెళ్లేందుకు సహకరించారు. ఈ సందర్భంగా తెల్లం వెంకటరావు మాట్లాడుతూ.. ధర్మతేజ క్రీడాల పట్ల ఆసక్తితో మన దేశం నుండి నేపాల్ దేశం తైక్వాండ్‌లో జరిగే క్రీడా పోటీలకు అర్హత సాధించారని అభినందించారు. ధర్మ తేజ నేపాల్‌లో జరిగే క్రీడలలో విజయం సాధించి పతాకంతో మన రాష్ట్రానికి మన నియోజకవర్గానికి మంచి పేరు, పతాకంతో తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

బోనమెత్తిన కురుమలు

నవతెలంగాణ-అన్నపురెడ్డిపల్లి

శ్రావణ మాసం సందర్భంగా రాజపురం గ్రామంలో గల కురుమలు ఆరాధ్య దైవం అయిన బీరప్ప, కామారతి దేవాలయానికి కురుమలు అంత కలసి వెళ్లి బోనం ఎత్తుకొని వెళ్లి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద కురుమలు అయిన బన్నె లక్ష్మయ్య, కేశవులు ఆధ్వర్యంలో గ్రామం నుండి డోలు దరువులుతో సాంప్రదాయ నృత్యాలతో కలసి దేవాలయానికి వెళ్లి ఎంతో ఉత్సహంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడి నిర్మాణానికి గ్రామస్థులు సహకరిస్తున్నారని, ఎవరైనా దాతలు ఉంటే ఆలయ అభివృద్ధి కోసం సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అప్పయ్య, వెంకటేశ్వరావు, శశి, తిరుపతయ్య శ్రీను, సుధాకర్, రాము, బీరుబాబు, అర్జున్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే మొదటి జియో థర్మల్ ప్లాంట్

- కలెక్టర్ జితీష్ వీ.పాటిల్

నవతెలంగాణ-మణుగూరు



మండలంలోని పగిడేరు పంచాయతీలో సింగరేణి ఏర్పాటు చేసిన జియో థర్మల్ ప్లాంట్ భారతదేశంలోని మొట్టమొదటి ప్లాంట్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వీ.పాటిల్ అన్నారు. గురువారం జియో థర్మల్ ప్లాంట్‌ను కలెక్టర్ సందర్శించారు. సింగరేణి జియో థర్మల్ ప్లాంట్‌ను విస్తరించే దశలో భాగంగా కావాల్సిన ఏర్పాట్లు భూమి సేకరణను పరిశీలించారు. అనంతరం రామనుజవరంలో బీటీపీఎస్ రైల్వే లైన్ భూ నిర్వాసితులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బషీర్ బాగ్ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో బషీర్‌బాగ్ వద్ద జరిగిన పోలీస్ కాల్పుల్లో వీర మరణం పొందిన అమరవీరులు సత్తెనపల్లి రామకృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామిల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు ముందుకు తీసుకుపోవాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు అన్నారు. పార్టీ భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బండారు చందర్‌రావు కార్యాలయంలో బషీర్‌బాగ్ అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా అమరవీరుల చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ. పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టి తమ ప్రాణాలను సైతం అర్పించి, వీరోచిత పోరాటం విద్యుత్తు సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటమనిన్నారు. నాడు జరిగిన ఆ పోరాట ఫలితమే నేటి వరకు పాలకులు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకురావడానికి సాహసించలేకపోయారన్నారు. నేడు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేంద్ర విద్యుత్ సవరణ చట్టం తీసుకువచ్చి రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాయాలని చూస్తుందని, మోటర్లకు మీటర్లు పెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చే విద్యుత్ సవరణ చట్టం వల్ల ప్రజలపై తీవ్రభారాలు మోపబడతాయని, దీనికి వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజాపోరాటాలు తప్పవని హెచ్చరించారు. విద్యుత్తు పోరాటంలో అసువులు బాసిన బషీర్బాగ్ అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ. నర్సారెడ్డి, కారం పుల్లయ్య, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్‌బాబు, వై.వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులపై ఉక్కుపాదం..

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

నవతెలంగాణ-కొత్తగూడెం



జిల్లాలో గంజాయి కేసులపై ఉక్కుపాదం మోపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లారు. ప్రధానంగా గంజాయి కేసులపై ఉక్కుపాదం మోపాలని, పాత కేసులలో వారంట్లు అమలుపరచాలని, లేనియెడల జమానత్ దారులకు నోటీసులు అందజేయాలన్నారు. ముద్దాయిలకు సమన్లు త్వరితగతిన అందజేయాలని, పోలీస్ స్టేషన్ల వారీగా సమీక్షకించి ఆదేశించారు. చెక్కు బౌన్స్ కేసులలో త్వరగా సమన్స్ అందజేయాలని, వారిపై ఉన్న వారంట్లను అమలుపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా కలెక్టర్ బి. వేణుగోపాల్, న్యాయమూర్తులు జి. భానుమతి, ఏ.సుచరిత, కే. సాయి శ్రీ, వి.శివ నాయక్, పిపీలు పోసాని రాధాకృష్ణమూర్తి, వెలగల నాగిరెడ్డి, రావి విజయ్‌కుమార్, ఎస్.లావణ్య, బి.విశ్వశాంతి, నాగలక్ష్మి, భద్రాచలం ఎస్పీ అంకిత్ కుమార్, డీఎస్పీ ఎం. మల్లయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్, హెచ్ఈఓలపై చర్యలు తీసుకోవాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదురుగా ఆశావర్కర్ల ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ



ఆశావర్కర్లను అనేక రకాలుగా వేదిస్తూ అవమాన పరుస్తూ వేదిస్తున్న డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎంలపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే నిరవధిక సమ్మెచేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బ్రహ్మాచారి, జిల్లా కమిటీ మహిళా కన్వీనర్ జీ.పద్మ డిమాండ్ చేశారు. భూర్గంపహాడ్ మండలం మొరంపల్లి బంజర పిహెచ్‌సీలో డాక్టర్, హెచ్ఈఓలు ఆశావర్కర్లను నోటికి వచ్చినట్లు దూషిస్తూ తీవ్రమైన వేధింపులకు గురిచేస్తున్నారు. సంబంధిత డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎంలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మొరంపల్లి బంజర పీహెచ్సీ ఆషావర్కర్లు కలెక్టర్ కార్యలయం ముందు ధర్నా నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ ఆశా వర్కర్లను సిగ్గులేదు, బుద్ధిలేదు, మీరేమి పనిచేయటంలేదు, అన్‌ఫిట్ అంటూ దూషిస్తున్నారు. ఇలా నోటికివచ్చినట్లు మాట్లాడుతూ ఆషావర్కర్లను అవమాన పరుస్తున్నారు. ముత్యాలంపేట ఆషావర్కర్ పై ఒక ఏఎన్ఎం కుర్చీ తీసుకుని దాడికి యత్నించింది. అనారోగ్యంతో వున్న సదరు ఆషావర్కర్ జ్వరంతో హాస్పటల్‌లో వుంటే బెదిరించి బలవంతంగా ఆశాడేకి పిలిపించి డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎంలు ఆశావర్కను గదిలోకి పిలిపించి తీవ్రస్థాయిలో బెదిరింపులకు పాల్పడ్డారు. హెచ్ఈఓ అనారోగ్యంతో వున్న ఆశావర్కర్‌ని దూషించడం సరికాదన్నారు. ఆశాలను అగౌరవ పరుస్తున్నారన్నారు. అంకిత భావంతోపనిచేస్తున్న ఆశావర్కర్లను వేధించటం దుర్మర్గమైన చర్యగా సీఐటీయూ పేర్కొన్నది.

వేధించిన వారిపై చర్యలు తీసుకుంటాం

డీఎంహెచ్‌వో ఆఫీస్ ఏవో డాక్టర్ బాలాజి

ఆశావర్కర్లను వేధిస్తున్న డాక్టర్, హెచ్ఈఓ, ఏఎన్ఎంలపై చర్యలు తీసుకుంటామని, ఆశా వర్కర్లు ధర్నా విరమించాలని డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు వచ్చిన ఏవో డాక్టర్ బాలాజి, మరొక బంజర పీహెచ్సీ డిఎవో డాక్టర్ స్పందన హామీచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు బీ.రమేష్, తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ పీహెచ్‌సీ నాయకులు బుచ్చమ్మ, తారామని, కృష్ణ వేణి, భువనేశ్వరి, వసంత, శ్రీలత, సాలి, నాగేశ్వరి అశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం బార్ అసోసియేషన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- అసోసియోషన్ అధ్యక్షులు లక్కినేని

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బార్ అసోసియేషన్‌ను రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం పనిచేస్తామని అసోసియోషన్ అధ్యక్షులు లక్కినేని సత్యనారాయణ స్పష్టం చేశారు. గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు బార్ బృందం విశేషంగా కృషి చేస్తున్నదని లక్కినేని తెలిపారు. బార్ అసోసియేషన్ అభివృద్ధి కార్యచరణలు కొత్తగూడెం బార్ అసోసియేషన్‌ను పటిష్ఠంగా అభివృద్ధి చేయడానికి పలు ప్రణాళికలు రూపొందించామని వివరించారు. సాంకేతిక సదుపాయాలు న్యాయవాదుల పనిని వేగవంతం చేయడానికి ఇప్పటికే మూడు కంప్యూటర్ టైపిస్టులను నియమించామని, అదనంగా మరొక టైపిస్టును కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. భవిష్యత్తులో డిజిటల్ లైబ్రరీ, ఇంటర్నెట్ సదుపాయాలు, ఆన్‌లైన్ కేసు మ్యానేజ్‌మెంట్ సిస్టమ్స్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తరించాలని ప్రణాళిక ఉందని తెలిపారు. లైబ్రరీలు, అసోసియేషన్ హాళ్లలో ఎ.సీ సదుపాయాలను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయని వివరించారు. కొత్తగూడెం బార్ అసోసియేషన్ రాష్ట్రంలోనే ఒక రోల్ మోడల్‌గా మారడానికి పలు చర్యలను చేపట్టినట్లు వివరించారు. న్యాయవాదుల కోసం వివిధ సౌకర్యాలను మెరుగుపరచడం ద్వారా వారి పని సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎమ్.ఎస్.ఆర్. రవి చంద్ర, కార్యవర్గ సభ్యులు సాధిక్ భాష, డి.రవికుమార్, ఎన్.ప్రతిభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో మహిళలకు భద్రత ప్రశ్నార్థకం

- కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న

నవతెలంగాణ-మణుగూరు



బీజేపీ పాలనలో మహిళలకు హక్కులు భద్రత కరువయ్యాయని కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అఖిలభారత మహిళా కాంగ్రెస్ పిలుపులో భాగంగా మహిళా శక్తి స్వరూపిణి, ఎరుపు అభ్యుదయానికి చిహ్నం కాబట్టి మహిళా కాంగ్రెస్ ఎరుపు రంగు దుస్తులను ధరించి మహిళా వ్యతిరేక విధానంపై నిరసన వ్యక్తం చేశారు. మణుగూరు పట్టణంలో మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా భద్రత కోసం చట్టాలను చేయాలన్నారు. మహిళలకు భద్రతతో పాటు సమానత్వము ఆర్థిక స్వాలంబనము కలిగించాలి అనే డిమాండ్‌తో నారీ న్యాయ ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టమని తెలిపారు. మహిళలకు రక్షణ కల్పించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందన్నారు. మనువాద సిద్ధాంతం అమలు చేసేందుకు కుట్రల ప్రయత్నాలు చేస్తుందన్నారు. అనంతరం పినపాక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ కార్యదర్శి బోడా దివ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు బండ్ల రజిని, పినపాక నియోజకవర్గం బీ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు బర్ల నాగమణి, మణుగూరు మండల అధ్యక్షులు కూరపాటి సౌజన్య, బూర్గంపహాడ్ మండల అధ్యక్షురాలు గోనె రేణుక, కరకగూడెం అశ్వాపురం చందా రత్తమ్మ, సమ్మక్క, కనితి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాతృభాషను మృత భాషగా మార్చవద్దు...

నవతెలంగాణ-కొత్తగూడెం

మాతృభాషను మృత భాషగా మార్చవద్దని, ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి వంటి అమృత తుల్యమైన మాతృ భాషను మరువరాదని సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాయి సుజాత అన్నారు. వ్యావహారిక భాషకు గొడుగు పట్టిన భాషా పిడుగు...గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా, హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవాలను గురువారం సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. తొలుత ధ్యాన్ చంద్, గిడుగు చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగరేణి పాఠశాల ప్రధానోపాధ్యాయిని సాయి సుజాత మాట్లాడుతూ విద్యార్థులు తెలుగుపై మక్కువను పెంచుకోవాలని, ఎన్ని భాషలు నేర్చుకున్నా కన్నతల్లి వంటి అమృత తుల్యమైన మాతృ భాషను మృత భాషగా మార్చవద్దని కోరారు. క్రీడలు శారీరిక ధృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని తెలిపారు. తెలుగు భాష, క్రీడా దినోత్సవాలను గురించి వక్తలు డి.ఫూల్ సింగ్, ధనలక్ష్మి, తెలుగు ఉపాధ్యాయినులు సీర ప్రసన్న, స్వర్ణకుమారి, సర్వస్వతులు తెలుగు ప్రాశస్త్యాన్ని, వ్యాయామ ఉపాధ్యాయులు లావణ్య, సంజయ్‌లు క్రీడల ప్రాముఖ్యతను, ఉపయోగాలను విద్యార్థులకు తెలిపారు. అనంతరం చిన్నారులకు తెలుగులో అనర్ఘళంగా మాట్లాడటం, వక్తృత్వం వంటి పోటీలు నిర్వహించారు. అందరికి బహుమతులు అందచేసారు. ఈ కార్యక్రమంలో ఇతర బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వికలాంగుల బస్ పాసుల శిబిరం

నవతెలంగాణ-కొత్తగూడెం

కొత్తగూడెం బస్టాండ్‌లో చుంచుపల్లి మండల వికలాంగులకు బస్సు పాసులు జారీ చేయడం జరుగుతుందని డిపో మేనేజర్ మలగం దేవేందర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఉదయము 10 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. అర్హులైన వికలాంగులు సదరం ధృవీకరణ పత్రం జిరాక్స్, ఆధార్ ధృవీకరణ పత్రం జిరాక్స్, ఒక ఫోటో, ఆన్‌లైన్ చార్జీ కొరకు రూ.50లు వారి వెంట తీసుకు రావాలని తెలిపారు. ఈ వికలాంగుల బస్సు పాస్ ద్వారా తెలంగాణ రాష్ట్రం మొత్తం ఆర్డినరీ బస్సులలో, ఎక్స్‌ప్రెస్ బస్సులలో, డీలక్స్ బస్సులలో 50శాతం చార్జీతో రాష్ట్ర మంతా ప్రయాణం చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని చుంచుపల్లి మండలంలో ఉన్న వికలాంగులు అందరూ సద్వినియోగం చేసుకోవాలిని కోరారు. ఇతర వివరాలకు సంప్రదించ వలసిన ఫోన్ నెంబర్లు.9959225959, 93467 28893, 90103 74644 తెలిపారు.

పీఓడబ్ల్యూ మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

ఈనెల 31, సెప్టెంబర్ 1, 2 తేదీలలో హైదరాబాద్‌లో జరుగు ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యు జిల్లా నాయకురాలు యనగంటి స్వరూప పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని మర్కోడు గ్రామం సెంటర్లో ఆమె పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో స్త్రీ, పురుష సమానత్వం కోసం, శ్రామిక వర్గ మహిళల విముక్తి కోసం పిఓడబ్ల్యు పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ సంఘం నాయకురాలు దొడ్డి సమ్మక్క, బందు ప్రీతి బొమ్మెర్ల సుజాత, బొమ్మర్ల అనురాధ, బొమ్మర్ల నరసింహ, దొడ్డి సౌజన్య దొడ్డి రాణి, కీసరి శ్యామలాదేవి, కీసర సమ్మక్క, సత్తెనపల్లి వెంకట నరసమ్మ దొడ్డి మమత, దొడ్డి కృష్ణవేణి, దొడ్డి శారద, కీసర అనసూయ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి తలుపులు పగలగొట్టి చోరీ

నవతెలంగాణ-ఎర్రుపాలెం

మండల పరిధిలోని బనిగండ్లపాడు గ్రామానికి చెందిన యన్నం విజయలక్ష్మి ఇంటికి తాళం వేసి ఉన్న తలుపులు పగలగొట్టి బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. బాధితురాలు విజయలక్ష్మి దుమ్ముగూడెం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లైబ్రరీయన్‌గా ఉద్యోగం చేస్తు న్నారు. ఆమె ఇంటికి తాళం వేసి ఉద్యోగరీత్యా దుమ్ము గూడెం వెళ్ళగా బుధవారం రాత్రి దొంగలు చోరీ చేశారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండటం చుట్టుప్రక్కల వారు గమనించి ఆమెకు ఫోన్ చేయగా బాధితురాలు విజయలక్ష్మి బనిగండ్లపాడు వచ్చి ఇంట్లో ఉంచిన ఎని మిది గ్రాముల బంగారం చెవి బుట్టలు 50 వేల రూపా యలు దొంగిలించినట్లు గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై ఎస్సై వెంకటేష్ వచ్చి దొంగతనం జరిగిన విజయలక్ష్మి ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఇండ్లు అందరికీ అందేలా చూస్తాం

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎంపీ రఘురాంరెడ్డి

నవతెలంగాణ-చండ్రుగొండ

పక్క ఇండ్లు అందరికీ అందేలా చూస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసాయం రఘురాంరెడ్డి అన్నారు. గురువారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారుల నివాస గృహాలకు వెళ్లి ఎంపీ రామ సహాయం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జరిగిన సభల్లో రఘురామిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారందరికీ రుణమాఫీ చేస్తామని, త్వరలోనే ఇందిరమ్మ ఇల్లు అందరికీ అందేలా చూస్తామన్నారు. ఇందిరమ్మ ఇల్లు అందరికీ అందాలని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి దృఢ నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. అశ్వారావుపేట నియోజకవర్గ ప్రజలకు, నన్ను ఎంతగానో ఆదరించిన కార్యకర్తలకు, నేను ఎప్పుడు రుణపడి ఉంటానని, త్వరలోనే గ్రామాలలో పర్యటించి సమస్యలను తెలుసుకొని పరిష్కరిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక భరోసాతో ముందుకు సాగాలి

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

మహిళా సంఘాలు ఆర్థిక పరమైన అంశాలలో పారదర్శకంగా వ్యవహరించి, కుటుంబాలకు బాసటగా నిలవాలిచి, ఆర్థిక భరోసాతో ముందుకు సాగాలని ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. డ్వాక్రా సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న మహిళలు ప్రతి పైసాకు లెక్కలు చూపి, సభ్యులకు ఆదర్శంగా నిలవాలని ఆయన పేర్కొన్నారు. గురువారం స్త్రీ శక్తి భవనంలో అధ్యక్షురాలు కుమారి అధ్యక్షతన మండల మహిళా మహాసభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. తీసుకున్న రుణాలు కుటీర పరిశ్రమలకు, వ్యాపారాలకు ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా బలోపేతం చెంది, తిరిగి సకాలంలో రుణాలు చెల్లించాలని తెలిపారు. మహిళా సంఘం ఆడిట్ లెక్కలు సభ్యులకు తెలిపారు. డ్వాక్రా గ్రూపుల మధ్య తారతమ్యాలు లేకుండా పగడ్బందీ ప్రణాళికతో కార్యచరణ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ నారాయణ, డీపీఎంలు సునందన్, యాదయ్య, ఏపీఎంలు రాంబాబు, వెంకయ్య, ఏపీవో రంగా, కార్యదర్శి లక్ష్మీకాంతమ్మ కోశాధికారి చుక్కమ్మ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పద్మ, శ్రీను, రవి కుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి సేవ సమితి, సింగరేణి వైద్యారోగ్య విభాగం ఆధ్వర్యంలో మండలంలోని తిర్లాపురం పంచాయతీ పరిధిలోని పునరావాస ఆదివాసీ గ్రామమైన పెద్దపల్లి గ్రామంలో ఏరియా జనరల్ మేనేజర్ దుర్గం రామచందర్ ఆదేశం మేరకు గురువారం సింగరేణి ఉచిత వైద్య శిభిరం నిర్వహించినట్లు డాక్టర్ శేషగిరిరావు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో స్త్రీ, పురుషులు, వృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వైద్య శిభీరంలో మొత్తం 75 మందికి దగ్గు, జ్వరాలు, చర్మ వ్యాధులు, కీళ్ల నొప్పులు తదితర వ్యాధుల నివారణకుగాను ఉచితంగా మందులు ఇచ్చారు. అనంతరం గ్రామస్తులకు, చిన్నారులకు డాక్టర్ శేషగిరిరావు బన్ రొట్టెలు తమ సొంత ఖర్చుతో అందజేయడంతో పాటు ఉచితంగా మాస్కుల పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ స్టాఫ్ నర్సు రత్న కుమారి, సానిటరీ ఇన్స్పెక్టర్ రామరావు, ఆసుపత్రి సిబ్బంది రాము, విజయ్, ఆశ వర్కర్ రోజా, గ్రామ పెద్ద భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ, వ్యవసాయ పాలీటెక్నిక్ కళాశాల విద్యార్థుల ర్యాలీ

నవతెలంగాణ-అశ్వారావుపేట

జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక అవేర్ ఐటీఐ, వ్యవసాయ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గురువారం నిరసన ర్యాలీ నిర్వహించారు. అవేర్ కళాశాల నుండి వ్యవసాయ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అవేర్ ఐటిఐ, వ్యవసాయ పాలీ టెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు జే.వెంకటేశ్వరరావు, లోరా అనూష, ఏవో రాఘవ రావులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం గెలలు దిగుబడి

సిద్దిపేట నుండి అశ్వారావుపేటకు తరలింపు

- మొదటిగా 30 టన్నుల గెలలు చేరిక

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో 2019 -2020 ఆర్థిక సంవత్సరంలో నాడు చైర్మెన్‌గా ఉన్న కంచర్ల రామక్రిష్ణరెడ్డి ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆయిల్ ఫాం సాగుకు అనువైన ఇతర ప్రాంతాలకు విస్తరించాలనే సంకల్పంతో సిద్దిపేటలో నాడు సాగు ప్రారంభం అయిన వ్యవసాయ క్షేత్రాలు నుండి నేడు గెలలు దిగుబడి మొదలు అయింది. సిద్దిపేట, జనగాం జిల్లాల్లో గెలలు దిగుబడి ప్రారంభం కావడంతో అక్కడి రైతులు 30 టన్నుల గెలలును గురువారం అశ్వారావుపేట పరిశ్రమకు తరలించారు. నంగనూర్ మండలం, అక్కెనపల్లి చెందిన రైతు నాగేందర్ తన 5 ఎకరాల పామాయిల్ తోట మూడో క్రాప్ వచ్చేసరికి నాలుగున్నర టన్నుల గెలలు దిగుబడి అయ్యాయని హర్షం వ్యక్తం చేసారు. వాస్తవానికి ఈ ఆయిల్ ఫాం సాగు 1990 వ దశకంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్, ఖమ్మం జిల్లా, అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మాత్రమే ప్రారంభించారు. అనంతరం ఈ ప్రాంతంలో విస్తారంగా ఈ సాగును ఆయిల్ ఫెడ్ విస్తరించింది. 2014 ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో ఆయిల్ ఫెడ్ దిశ దశ మారిందని చెప్పుకోవాలి. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా అనువైన ప్రాంతాలను గుర్తించి ఈ సాగు విస్తీర్ణం పెంచడానికి విధానపరమైన నిర్ణయం చేయడంతో ఎనిమిది జిల్లాల్లో ఈ సాగు విస్తరింప చేసారు.మొదట్లో సాగు సాధ్యాసాధ్యాలు, దిగుబడి ఉంటుందా లేదా అనే తర్జన భర్జనలు అనంతరం విస్తరించారు. సిద్ధిపేట జనగాం జిల్లాల్లో 2019- 2020 లో మొదటగా 5 ఎకరాల్లో సాగు ప్రారంభించారు. ప్రస్తుతం 11 వేలు పై చిలుకు ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగు విస్తరించి ఉంది. కొత్త ప్రాంతం నుండి గెలలు దిగుబడి ప్రారంభం కావడంతో అధికారులు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పామాయిల్ రీఫైనరీ, రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు చేయండి

- ఎంపీ రామసహాయంనకు ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ వినతి

నవతెలంగాణ-అశ్వారావుపేట



అశ్వారావుపేట నియోజక వర్గం కేంద్రంగా ఆయిల్ ఫాం రీఫైనరీ పరిశ్రమను, పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామిరెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణ లకు తెలంగాణ ఆయిల్ఫెడ్ అశ్వారావుపేట జోన్ ఆయిల్ ఫాం గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యలు వినతి పత్రం అందజేసారు. జాతీయ క్రీడల దినోత్సవం పురస్కరించుకుని నిర్మించ తలపెట్టిన ఇండోర్ స్టేడియం శంకుస్థాపనకు గురువారం వారిరువురు అశ్వారావుపేట వచ్చిన సందర్భంగా పుల్లయ్య వారిని స్వయంగా కలిసి వినతి పత్రం అందజేశారు.

ఆ వినతి పత్రం సారాంశం యథాతథం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1 లక్ష 25 వేల ఎకరాలకు పైగా పామాయిల్ సాగు అవుతున్నది. ఈ ఆయిల్పామ్ తోటల నుండి వచ్చే గెలల నుండి ముడి పామాయిల్ ఉత్పత్తి అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలలో తయారు చేస్తున్నారు. దీనికి అనుబంధంగా ఖమ్మం జిల్లా, వేంసూరు మండలం, కొల్లారుగూడెం గ్రామంలో మరో ఫ్యాక్టరీ నిర్మాణం జరగబోతుంది. భవిష్యత్తులో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్పత్తి అయ్యే ముడి పామాయిల్‌ను రిఫైనరీ చేసి ఇక్కడి నుండే ప్యాకింగ్ చేయడం ద్వారా రైతులకు ఆదాయం చేకూర్చే అవకాశం ఉంటుంది.

తెలంగాణ రాష్ట్రంలో గణనీయంగా పెరుగుతున్న పామాయిల్ తోటల విస్తరణకు అనుగుణంగా భవిష్యత్తులో ఎదురయ్యే ఇబ్బందుల నుండి రైతులను కాపాడుకోవడం కోసం అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలకు అనుబంధంగా ఆయిల్ ఫామ్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయించి గలరని కోరుచున్నాము. అదే రీసెర్చ్ సెంటర్లోనే ఒక టన్ను పామాయిల్ గెలలు మిల్లు ఆడేందుకు ఏర్పాటు చేయడం ద్వారా ఆయిల్ రికవరీ శాతం తెలుసుకొనుటకు అవకాశం ఉంటుంది. కాబట్టి పై అంశాలను పరిశీలించి తెలంగాణ ఆయిల్ ఫామ్ రైతాంగానికి సహాయపడే గలరని కోరుతున్నాము.

రేపటి నుంచి పీవోడబ్ల్యూ రాష్ట్ర మహాసభలు

నవతెలంగాణ -టేకులపల్లి

ఈనెల 31 నుండి సెప్టెంబర్ 1, 2 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) తెలంగాణ రాష్ట్ర 7వ మహాసభలను జయప్రదం చేయాలని పీఓడబ్ల్యు జిల్లా నాయకులు పూసం రుక్కమ్మ గురువారం తెలిపారు మండలంలోని బోడు కొత్తగూడెంలో మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. పురుషాధిపత్యానికి వ్యతిరేకంగా, సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక రంగాల్లో స్త్రీ, పురుష సమానత్వం కోసం, శ్రామిక వర్గ మహిళల విముక్తి కోసం పిఓడబ్ల్యు పనిచేస్తుందన్నారు. మహిళలు అర్ధరాత్రి సురక్షితంగా ఇంటికి చేరినప్పుడే, దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లని మహాత్మా గాంధీ చెప్పిన మాటలు గుర్తు చేశారు.పశ్చిమబెంగాల్ కోల్‌కత్తాలో మహిళా ట్రైనీ డాక్టర్ మౌమితను అత్యంత కిరాతకంగా చిత్రహింసలకు గురిచేసి అత్యాచారం చేసి, హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో పిఓడబ్ల్యు రాష్ట్ర మహాసభల సందర్భంగా ఆగస్టు 31న జరుగు భారీ ప్రదర్శన, బహిరంగ సభకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా నాయకులు పాయం సుగుణ ,గుమ్మడి అనసూయ, పాయం యశోద, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు ఎట్టి నరసింహారావు పాల్గొన్నారు.

రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బట్టు సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిందిన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా గానీ మాఫీ చేయలేదన్నారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి కావాలి

నవతెలంగాణ-ముదిగొండ

ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఉపయోగించుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి కావాలని ఐకెపి ఎపిఎం చెరుకూరి కల్పన అన్నారు. ఇందిరా మహిళ శక్తి పథకంలో భాగంగా ముదిగొండలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ఆర్ కంప్యూటర్ ఎంబ్రాయిడరీ డిజైన్ షాప్‌ను ఆమె లాంచనీయంగా గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీలు బి.అనురాధ. సిహెచ్ వి.రామారావు, సైదులు, టి.నాగేశ్వరరావు, గ్రామ దీపికలు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు మందరపు ఉపేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఎస్‌బీఐ శాఖను ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-ఖమ్మం

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖను జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గురువారం ప్రారంభించారు. అన్ని శాఖల కార్యాలయాలు కలెక్టరేట్‌లో ఉన్నందున ఉద్యోగుల సౌకర్యార్థం బ్యాంక్ శాఖను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అన్నారు. బ్యాంక్‌లో అన్ని రకాల సేవలు అందేలా చూడాలని బ్యాంక్ అధికారులతో కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, ఎల్డిఎం శ్రీనివాసరెడ్డి, కలెక్టరేట్ ఏవో అరుణ, బ్యాంకర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కాసానిని పరామర్శించిన కూనంనేని

నవతెలంగాణ-ఖమ్మం

సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు కాసాని ఐలయ్య తీవ్ర అనారోగ్యంతో ఖమ్మంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను గురువారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాసాని ఐలయ్య త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఐలయ్యను పరామర్శించిన వారిలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, సిపిఎం నాయకులు కె. నర్సయ్య తదితరులు ఉన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

నవతెలంగాణ -కూసుమంచి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడలు అట్టాసంగా గురువారం ప్రారంభమయ్యాయి. ఈ క్రీడల్లో మండలానికి సంబంధించిన జిల్లా పరిషత్, మండల ప్రాథమిక పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులు క్రీడల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై విద్యార్థులకు అవగాహన : ట్రాఫిక్ ఏసీపీ

నవతెలంగాణ-ఖమ్మం

ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు తెలియని మైనర్లు రోడ్లపై వాహనాలు డ్రైవింగ్ చేయవద్దని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు విద్యార్థులకు సూచించారు. నగరంలో మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టిన ట్రాఫిక్ పోలీసుల తనిఖీలో అధిక సంఖ్యలో మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడున్న నేపథ్యంలో అవగాహన కార్యక్రమాలలో భాగంగా ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం నగరంలోని హర్వెస్ట్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ మోహన్ బాబు, ఆర్ఐ సాంబశివరావు, ఎస్సైలు రవి, వెంకన్న, సాగర్ పాల్గొన్నారు.

వినాయక చవితి మండపాల ఏర్పాటుకు అనుమతి పొందాలి

నవతెలంగాణ-ఎర్రుపాలెం

వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ విగ్రహాలను ప్రతిష్టించడం, మండపాలు ఏర్పాటుకు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని స్థానిక ఎస్సై వెంకటేష్ తెలిపారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో గల ప్రజలు గణేష్ ఉత్సవ కమిటీలు గణేష్ నవరాత్రిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, ఎటువంటి అల్లర్లు జరుగకుండా చూసుకోవాలని తెలిపారు. మండపాలను ఏర్పాటు చేసుకునే వారు పోలీసు శాఖ ద్వారా అనుమతి పొందాలని సీసీ టీవీ కెమెరాలు మండపాల చుట్టూ ఏర్పాటు చేసుకొని ఎటువంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని, కమిటీ సభ్యులు మండపాలల్లో రాత్రిపూట ఉండి భద్రతను ఏర్పాటు చేసుకోవాలని పూర్తి బాధ్యత వహించాలని తెలిపారు.



వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ అందజేత

నవతెలంగాణ-వైరా

మండలంలోని గొల్లపూడి గ్రామంలోని వృద్ధాశ్రమానికి సిరిపురం(కె జి) గ్రామానికి చెందిన కండిబండ బాల మురళీ కృష్ణ జ్ఞాపకార్థం వారి సతీమణి శైలజా రాణి, కుమారులు రాకేష్, రాజేష్‌లు గురువారం ఇన్వర్టర్, వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. గత కొన్నేళ్లుగా అమెరికాలో స్థిరపడిన రాకేష్, రాజేష్‌లు వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధులకు వేసవి తాపాన్ని నివారించేందుకు 20 వేల రూపాయల విలువగల ఇన్వర్టర్ అందజేశారు. కార్యక్రమంలో శైలజా రాణి ఇమ్మడి పుల్లారావు, షేక్ లతీఫ్, వెంపటి కోటేశ్వరరావు, కౌసల్య, ఆశ్రమ నిర్వాహకులతో కలిసి వృద్ధుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



గోదాములను పరిశీలించిన కార్పొరేషన్ చైర్మన్

నవతెలంగాణ- ఖమ్మం

కోదాడ నియోజకవర్గం కోదాడ రూరల్‌లోని గోదాములను గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సందర్శించారు. గోదాముల్లో ఉన్న నిల్వలను ఆయన పరిశీలించారు. గోదాముల సామర్థ్యంతో పాటు ఎంతమంది హమాలీలు ఎంత మంది ఉన్నారు లాంటి తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, గోడౌన్ ఇంచార్జికి నాగేశ్వరరావు సూచించారు. అనంతరం నాగేశ్వరరావు గోదాము ఆవరణలో మొక్కలు నాటారు.

ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్న చిట్‌ఫండ్

- న్యాయం చేయాలని ప్రభుత్వానికి బాధితుల వేడుకోలు

నవతెలంగాణ-ఇల్లందు



తమను చీటీలకు పేమెంట్ చేయకుండా మరోవైపు మరో చీటీ పాడుకోనివ్వకుండా కపిల్ చిట్‌ఫండ్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని పట్టణానికి చెందిన రామ్మోహన్‌రావు, ఆయన కుమారుడు ఆళ్లపల్లి ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రేవంత్‌లు ఆవేదన వ్యక్తం చేశారు. నెంబర్ 2 బస్తీలోని వారి గృహంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిట్ ఫండ్‌లో చెరో రూ.15 లక్షల చీటీ వేశామన్నారు. కాగా ఇందులో ఒక చీటీ పాడుకొనగా మరో చీటీని దానికి తనఖాపెట్టారు. మరో చీటీ పాడుకోవడానికి, డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులు పెడుతున్నారని రామ్మోహన్ రావు, రేవంత్ తెలిపారు. తాము తనఖా పెట్టిన చీటీకి సంబంధించి తమకు తెలియకుండా వారి ఉద్యోగులను షూరిటీ పెట్టుకున్నారని మాకు తెలియకుండా ఎలా పెట్టుకుంటారని ఆర్టిఐ ద్వారా అడిగితే వాళ్లు సాక్షులు అని చెప్పారన్నారు. చిట్టి డబ్బులు సక్రమంగా కడుతున్నప్పటికీ పెనాల్టీలు వేస్తున్నారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-ఖమ్మం



రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవెన్యూ అధికారులతో ధరణి, ప్రజావాణి, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఓటరు జాబితా సవరణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరణి పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి రోజువారి లక్ష్యం మేరకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో ధరణి క్రింద టీఎం-33 మాడ్యూల్ దరఖాస్తులు 3391, ఇతర మాడ్యూల్‌ల కింద 5513 దరఖాస్తులు వివిధ స్థాయిలో పెండింగులో ఉన్నాయన్నారు. తహసీల్దార్లు దరఖాస్తుల పరిష్కారం విషయంలో ఆధారాలు సరిగా చూపాలన్నారు. డిలిషన్ విషయంలో నోటీసులు అందజేసిన ఆధారాలు ఖచ్చితంగా ఉండాలన్నారు. నియమ నిబంధనలు తూ.చ. తప్పకుండా పాటించాలని, ఏ దశలోనూ పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి సత్ఫలితాలను ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల పరిష్కారం నాణ్యతతో చేయాలన్నారు. దరఖాస్తుదారుడు అధికారుల చర్యలతో సంతృప్తి చెందాలన్నారు. పెన్షన్ల కు సంబంధించి అన్ని దరఖాస్తులకు సత్వరం పరిష్కారం చూపకపోయిన, వెంటనే పరిష్కారం చూపగలిగే పెన్షన్లు దరఖాస్తుదారులకు అందేలా చూడాలన్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ నిర్ణీత కాలవ్యవధిలో పూర్తయ్యేలా చూడాలన్నారు. వివిధ ట్రిబ్యునల్, కోర్టుల కేసుల విషయంలో చర్యలు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కేసుల విషయంలో విచారణ నివేదికలు సంబంధిత ట్రిబ్యునల్, కోర్టులకు అందినది ధృవీకరించుకోవాలన్నారు. కోర్టుల, ట్రిబ్యునల్ ల డైరెక్షన్లకు వెంటనే హాజరవ్వాలన్నారు. సర్వే నెంబర్ల వారిగా ప్రభుత్వ భూమి వివరాల నివేదిక సమర్పించాలన్నారు. ఆక్రమణలకు గురి అయిన ప్రభుత్వ స్థలాల స్వాధీనానికి చర్యలు వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సమస్యలున్న ప్రభుత్వ స్థలాల విషయంలో నెలకొక బిట్ చొప్పున లక్ష్యం పెట్టుకొని, సమస్యలు పరిష్కరించి, స్థలాల స్వాధీనం తర్వాత ఫెన్సింగ్ ఏర్పాటు, ప్రతి వారం ఆయా స్థలాల సందర్శన చేసి రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ఠ, జిల్లా రెవెన్యూ అధికారిణి ఎం. రాజేశ్వరి, ఆర్డీవోలు గణేష్, రాజేందర్, కలెక్టరేట్ ఏవో అరుణ, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

కొండరెడ్లకు మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఐటీడీఏ పీఓ బి.రాహుల్

నవతెలంగాణ-దమ్మపేట

బాహ్య ప్రపంచానికి దూరంగా దట్టమైన అటవీ ప్రాంతాలలో నివసిస్తున్న కొండరెడ్ల గిరిజన కుటుంబాలకు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగిందని భద్రాచలం ఐటిడిఎ పిఓ బి.రాహుల్ పేర్కొన్నారు. దమ్మపేట మండలంలోని పూసుకుంట గ్రామంలో ప్రధాన మంత్రి జన్ జాతి, ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం జన్‌ధన్) పథకంలో భాగంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆదివాసీ గిరిజన గ్రామాలలోని కొండరెడ్ల కుటుంబాలలోని ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్, ఆయుష్మాన్ భవ కార్డు, పిఎం కిసాన్ క్రెడిట్ కార్డు, ఫారెస్ట్ పోడు భూములకు పట్టాలు అందించే కార్డు, రేషన్ కార్డు లతోపాటు గిరిజన గ్రామాలలో రోడ్డు సౌకర్యం ఉన్నది లేనిది సర్వే చేయాలని, ఆ గ్రామాలకు స్వచ్ఛమైన మంచినీరు, కరెంటు, సౌకర్యం అన్ని సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేయడానికి ప్రత్యేకించి ఆయా గ్రామాలలోని అధికారులు అందరితో కలిసి సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. దీనిలో భాగంగా పూసుకుంట



గ్రామంలో 14 మందికి రేషన్ కార్డులు, 9 మందికి ఆధార్ కార్డులు, 50 మందికి ఆయుష్మాన్ భవ కార్డులు ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 28 నుండి వచ్చేనెల సెప్టెంబర్ 3వ తేదీ వరకు కొండ రెడ్ల గ్రామాలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ తప్పనిసరిగా కార్డులు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట తహసీల్దార్ చందా నరేష్, ఎంపిడిఓ రవీందర్ రెడ్డి, డీఎంహెచ్ఓ భాస్కర్ నాయక్, ఈజీఎస్ ఏపీవో రామచంద్రరావు, ఏపీఎం వెంకటరెడ్డి, పంచాయతీ సెక్రెటరీ సమిత, డిటి రామకష్ణ, డాక్టర్ చైతన్య, జ్యోతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

నవతెలంగాణ-జూలూరుపాడు

గ్రామాలలో దొంగతనాలకు పాల్పడున్న వ్యక్తిని పట్టుకొని అరెస్టు చేసినట్లు జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి గురువారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ, మర్రిగూడెంలో నివాసముండే గుత్తి కోయ గుంపునకు చెందిన మడివి భద్రయ్య బుధవారం చంద్రుగొండ ప్రధాన సెంటర్ లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఎస్సై స్వప్న, సిబ్బందితో కలిసి అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని రేపల్లెవాడలో ఆంజనేయ స్వామి ఆలయంలో జూన్ నెలలో దొంగతనానికి పాల్పడినట్లు పట్టుబడిన వ్యక్తి ఒప్పుకున్నాడు. అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్ మండలాల్లోని జరిగిన పలు దొంగతనాలతో సంబంధం ఉన్నట్లు అంగీకరించాడు. నిందితుడిని రిమాండ్ నిమిత్తం కొత్తగూడెం కోర్టుకు తరలించారు. చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్సై స్వప్న, సిబ్బంది అశోక్, కోటిలను జూలూరుపాడు సిఐ అభినందించారు.

పరిమితికి మించి వైద్యం చేస్తే చర్యలు

రక్త పరీక్ష కేంద్రాలు నిబంధనల మేరకే వ్యవహరించాలి

నవతెలంగాణ-కరకగూడెం

మండల ప్రాథమిక వైద్యులు కారం మధు ఆధ్వర్యంలో కరకగూడెంలో ప్రథమ చికిత్స కేంద్రాలు, రక్త పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కారం మధు మాట్లాడుతూ ఆర్ఎంపీలు కేవలం ఫస్ట్ ఎయిడ్ మాత్రమే చేయాలని నిబంధనలు వునయాన్నారు. రోగి సమస్య పెద్దదిగా ఉంటే అందుబాటులో ఉన్న ప్రభుత్వ దవాఖానకు, పెద్ద హాస్పిటల్‌కు రిఫర్ చేయాలని ఆర్ఎంపీలకు సూచించారు.

కోరం పూర్తికాకుండానే తీర్మానాలు ఆమోదం



- చట్టానికి, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధం
- సమావేశంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు

నవతెలంగాణ-ఇల్లందు

మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కోరం పూర్తికాకుండానే తీర్మానాలు ఆమోదించడం చట్టానికి, మున్సిపల్ నిబంధనలకు విరుద్ధమని బీఆర్ఎస్ కౌన్సిలర్లు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు దిండిగాల రాజేందర్, కౌన్సిలర్లు మాట్లాడారు. మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్ ఎమ్మెల్యేతో కలిపి 25 మంది కౌన్సిల్ సభ్యులు కాగా 12 మంది కౌన్సిలర్‌లు మాత్రమే హాజరయ్యారని తెలిపారు. 13 మంది ఆమోదం తెలపకుండా కోరం ఎలా పూర్తి చేస్తారని అన్నారు. మెజారిటీ కౌన్సిల్ సభ్యులు హాజరు కాకుండా నియమ నిబంధనకు విరుద్ధంగా ఏకపక్ష దోరణితో మున్సిపల్ సమావేశం నిర్వహించారని అన్నారు. గత నెలలో ఆమోదం తెలపని బిల్లులను ఆమోదం తెలిపినట్టుగా మినిట్స్ లో యాడ్ చేయటం మున్సిపల్ చట్టానికి విరుద్ధమన్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను ప్రశ్నించామన్నారు.

అంతా ఏకపక్ష ధోరణి

మున్సిపాలిటీలోని కొన్ని వార్డులలో శానిటేషన్, దోమల బెడద, పారిశుధ్య సమస్యలను పట్టించుకోకుండా ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తూ కౌన్సిల్ ముందుకు కదులుతోందని అన్నారు. ఇది ఎక్కడి విడ్డూరమని, మున్సిపల్ చరిత్రలోనే ఇటువంటి మున్సిపల్ సమావేశం జరిగింది లేదంటూ దుయ్యబట్టారు. ప్రజా సంక్షేమం కోసం ప్రజా సమస్యల పట్ల ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల కోసం పోరాడుతామని మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో జరిగే ప్రతి అంశాన్ని కూడా ప్రజలకు చేరవేస్తామని అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, మున్సిపల్ కౌన్సిలర్‌లు, తోట లలిత శారద, మాధవి, జేకే శీను, అనిత, బిందు, సుజాత, తార పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణానికి శంకుస్థాపన చేసిన ఎంపీ, ఎమ్మెల్యే

నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట - జంగారెడ్డి గూడెంలో నీటిపారుదల శాఖ డివిజనల్ కార్యాలయం ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశంలో రూ.2 కోట్ల 60 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఇండోర్ స్టేడియం నిర్మాణానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామ రెడ్డి, ఎమ్మెల్యే జారే ఆదినారాయణలు హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, పీఆర్‌డీఈ శ్రీధర్, ఐటీడీఏ



డీఈ రామిరెడ్డి, పశుసంవర్ధక శాఖ అదనపు సంచాలకులు కే.ప్రదీప్ కుమార్, ఎంఈవో కే.లక్ష్మి, సీఐ కరుణాకర్, నాయకులు జూపల్లి రమేష్, తుమ్మ రాంబాబు, జూపల్లి ప్రమోద్ పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవం

హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జరుపుకునే జాతీయ క్రీడా దినోత్సవాన్ని గురువారం అశ్వారావుపేటలో స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఈ సంస్థ జిల్లా అధికారి పరంధామయ్య రెడ్డి పర్యవేక్షణలో ఘనంగా నిర్వహించారు. ఎంపీలు హాజరయ్యారు.

పాఠశాలను సందర్శించిన జిల్లా క్రీడల అధికారి

దమ్మపేట : క్రీడా దినోత్సవం పురస్కరించుకొని మండల పరిధిలోని పట్వారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా యువజన క్రీడల అధికారి పరంధామిరెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా హాకీ క్రీడాకారులు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా రాణించాలని అన్నారు. ఇందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మినీ స్టేడియంలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు.

సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలు

నవతెలంగాణ -బోనకల్



కాంగ్రెస్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల శాంతి నిలయంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందిని విక్రమార్క దంపతుల కుమారుడు సూర్య విక్రమాదిత్య జన్మదిన వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు. అనంతరం దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గాలి దుర్గారావు మాట్లాడుతూ శాంతి నిలయంలో ఎంతోమంది మానసిక వికలాంగులకు కొన్ని సంవత్సరాలుగా సిస్టర్ ఆల్ఫీ సేవలు అందించటం మరువలేనిది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బంధం నాగేశ్వరరావు, కర్నాటి రామకోటేశ్వరరావు, బిపి నాయక్, బీరెల్లి కార్తీక్, గుగులోతు రమేష్, బుక్య బద్రు నాయక్, పాసంగులపాటి కోటేశ్వరరావు, అంతోటి వెంకటేశ్వర్లు, నిమ్మతోట జానప్రియ కుమార్, మారుపల్లి ప్రేమ్ కుమార్, షేక్ గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

చింతకాని : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అమ్మ ఫౌండేషన్ చైర్మన్ మల్లు నందినిల తనయుడు యూత్ ఐకాన్ మల్లు సూర్య విక్రమ్ ఆదిత్య జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు తెలిపారు గురువారం మండల పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న గ్రౌండ్లో నిర్వహించిన జన్మదిన వేడుకలలో ఆయన మాట్లాడారు. జన్మదిన వేడుకలలో భాగంగా తల సేమియా వ్యాధిగ్రస్తుల పిల్లలకు కాంగ్రెస్ మండల కమిటీ, యూత్ మండల కమిటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసి పేదలకు అన్నదాన కార్యక్రమం చేపట్టామన్నారు.కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు మడిపల్లి భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కన్నెబోయిన గోపి, మండల యూత్ అధ్యక్షులు బందెల నాగార్జున, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, కొప్పుల గోవిందరావు, కూరపాటి కిషోర్, ఆవుల నాగేశ్వరరావు, బత్తుల శ్యాంసుందర్రావు, డిప్యూటీ తహశీల్దార్ వీరభద్ర నాయక్, ఎస్ఐ ఎస్.కె నాగుల మీరా, చింతకాని వైద్యాధికారి ఎస్.కె అల్తాఫ్, కాంగ్రెస్ నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రి ల్యాబ్‌లలో ర్యాపిడ్ పరీక్షల ద్వారా డెంగీని నిర్ధారించకూడదు

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ సుబ్బారావు

నవతెలంగాణ- ఖమ్మం

జిల్లాలో గల అన్ని ప్రైవేట్ ఆసుపత్రిలలో గల ల్యాబ్‌లలో ర్యాపిడ్ పరీక్షల ద్వారా డెంగీని నిర్ధారించకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి. సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శాంపిల్‌ని జిల్లా ఆసుపత్రిలో గల ఐడిఎస్‌పి ల్యాబ్‌కి పంపి ఎలీషా పరీక్ష ద్వారా నిర్ధారణ చేసిన తరువాత తగిన చికిత్సలు అందించాలని ఆదేశించారు. ఇది వరకే అన్ని ఆసుపత్రులకు సర్క్యులర్ పంపామని, కొన్ని ఆసుపత్రులు మాత్రమే సాంపిల్స్‌ను ఐడిఎస్‌పికీ పంపి నిర్ధారణ చేసుకొంటున్నాయని, కొన్ని ఆసుపత్రులు ఇష్టమొచ్చినట్లు డెంగీ నిర్ధారణ చేసి రోగులను భయభ్రాంతులకు గురి చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అన్ని ఆసుపత్రిలు తప్పనిసరిగా శాంపిల్ పంపి నిర్ధారణ చేసుకోవాలని లేని ఎడల ఆసుపత్రిలపై చట్ట పరమైన చర్యలు చేపట్టనున్నట్లు ఆయన చెప్పారు.

బాణాపురంలో క్రీడా దినోత్సవం

నవతెలంగాణ- ముదిగొండ

హాకీ లెజెండ్ మేజర్ ధ్యాన్‌చాంద్ జన్మదినం సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండల పరిధిలోని జడ్పిహెచ్ఎస్ బాణాపురంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇ వెంకటరామిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ వి.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడా, తెలుగు భాషా దినోత్సవం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగు భాషా దినోత్సవాన్ని మండల పరిధిలోని మద్దులపల్లిలోని సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు కలిసి ధ్యాన్‌చంద్, గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసశర్మ మాట్లాడారు. విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యతను వివరించారు. తెలుగు భాష గొప్పదనం, భాషా చరిత్ర గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అతియాబేగం, అధ్యాపకులు ఉషారాణి, లీల, చామంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ వ్యర్థాలు తరలిస్తున్న వాహనం పట్టివేత

నవతెలంగాణ- ఖమ్మంకార్పొరేషన్

ఖమ్మం నగరంలో చికెన్ వ్యర్థాలను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని మునిసిపల్ అధికారులు పట్టుకున్నారు. రూ.2వేల జరిమానా విధించారు. చికెన్ వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోయ వద్దని చికెన్ షాప్ యజమానులకు ఆదేశాలు జారీ చేశారు.

పామాయిల్ ఫ్యాక్టరీ స్థలాన్ని పరిశీలించిన ఆర్‌డివో

నవతెలంగాణ-వేంసూరు



కల్లూరుగూడెం వద్ద నిర్మాణం చేపట్టనున్న తెలంగాణ ఆయిల్ ఫెడ్ సంస్థ ద్వారా నిర్మించనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ స్థలాన్ని ఆర్డిఓ రాజేంద్ర గౌడ్ కలెక్టర్ ఆదేశాల మేరకు పరిశీలించారు. పామ్ ఆయిల్ ఫ్యాక్టరీకి వెళ్లే దారి కొరకు రోడ్డుకు కావలసిన భూమి సేకరణకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. 60 అడుగుల విస్తరణ గల రోడ్డుకి ఎకరన్నర భూమి కావలసి ఉందని, ఇచ్చేందుకు రైతులు సుముఖంగానే ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ మేనేజర్ బాలకృష్ణ, తాసిల్దార్ ఎంఏ రాజు, ఆర్ఐ చిరంజీవి, స్థానిక రైతులు ఉన్నారు.

రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉత్సవాలు

నవతెలంగాణ-కారేపల్లి

కారేపల్లి మండలం రేలకాయలపల్లి ఆశ్రమ పాఠశాలలో క్రీడా, తెలుగు భాషా దినోత్సవాలను ను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన,వకత్వ పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఆశ్రమ పాఠశాల హెచ్ఎం ఎల్.రాములు మాట్లాడుతూ ప్రముఖ హాకీ క్రీడాకారుడు గోపీ ధ్యాన్ చంద్ జన్మదినాన్ని ప్రపంచ క్రీడ దినోత్సవంగా, గిడుగు రామ్మూర్తి జన్మదిన పురస్కరించుకొని మన తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు విద్యా నియమంతో ఆటపాటలో పాల్గొని మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. మన తెలుగు భాష ఔన్నత్యాన్ని తెలుసుకోవాలని, ప్రపంచ దేశాలే మన భాషను ఒక గొప్ప భాష అని కొనియాడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు డీ.శివాజీ, శ్రీనివాసరావు, సక్రం, బిక్షా, రాంబాబు, తార, వెంకటేశ్వర్లు, వీరన్న, వెంకటేశ్వర్లు, వీరన్న, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ విగ్రహాల నిమజ్జనం ప్రాంతాలను పరిశీలించిన సీపీ

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



ఖమ్మం నగరంలో గణేశ్ విగ్రహాల నిమజ్జనం పురస్కారించుకొని ఖమ్మం నగరంలోని కాల్వవోడ్డు మున్నేరు, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా వైపు మున్నేరు వద్ద జరిగే నిమజ్జనం ప్రాంతాలను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించి పలు సూచనలు చేశారు. నిమజ్జన ప్రాంతాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, మార్గాలు, బారికేడింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు వుండాలని, సీసీ కెమెరాలను కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం అయ్యేలా చూసుకొవాలని సూచించారు. మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, పోలీసులతో పాటు అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా శోభాయాత్ర, నిమజ్జనం జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో సహకరించుకోవాని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ లా అండ్ ఆర్డర్ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు సిఐలు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఇమేజ్ పెంచేలా .... (మొదటిపేజీతరువాయి)

నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందుగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్యతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలనీ, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశముంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చనీ, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ ఏ.వి.ఎస్.రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అక్రమార్కులపై 'హైడ్రా' కొరడా..

(మొదటిపేజీ తరువాయి)

చెరబట్టారు..ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎం శాంతి కుమారి హైడ్రా కూల్చివేతలపై రోజువారీ సమీక్షలు చేస్తూ తగు సూచనలు చేస్తున్నారు. తరతమ భేదం లేకుండా ఆక్రమణలకు పాల్పడితే తన కుటుంబ సభ్యుల నిర్మాణాలు కూడా కూల్చేయండని సీఎం చెప్పడంతో హైడ్రా మరింత దూకుడు పెంచింది. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇండ్లు నిర్మించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్ సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసులు జారీ చేసింది. అయితే హైడ్రా దూకుడుపై హైకోర్టు పలు సూచనలు చేసింది. ఆక్రమణల తొలగింపు ప్రక్రియలో నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఆదేశించడంతో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించేందుకు వివిధ శాఖల అధికారులతో సీఎస్ గురువారం సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రేటర్ పరిధిలో పలుచోట్ల అనేక చెరువులను ఆక్రమించుకుని భారీ నిర్మాణాలు చేపట్టారు. గత పదేండ్లలో అవి మరీ ఎక్కువగా ఆక్రమణలకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. పర్యవేక్షణాధికారులు తమకు కేటాయించిన ప్రాంతాల్లో చేపడుతున్న నిర్మాణాలు నిబంధనల మేరకు జరుగుతున్నాయా? లేదా? అన్నది తనిఖీ చేయాల్సి ఉంటుంది. అనుమతులు లేకపోతే కూల్చివేతలు చేపట్టాలి. పర్యవేక్షణ అధికారులే కాదు ప్రతి విభాగంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు కూడా నిర్మాణాలపై ఓ కన్నేసి ఉంచాల్సిన బాధ్యత ఉంది. కొన్ని ప్రాంతాల్లో సర్వే నంబర్లు వేరుగా వేసి నిర్మాణ అనుమతులు తీసుకున్నట్టు కూడా హైడ్రా అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ప్రతి రోజూ వందల సంఖ్యలో ఫిర్యాదులు



అందుతు న్నాయి. వాటిపై రోజువారీ సమీక్ష నిర్వహిస్తూ ఆయన నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యం లో నిబంధనలకు తిలోదకాలిచ్చి చెరువులు, నాలాలను ఆక్రమించిన వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయి.

అవినీతిపై దృష్టి పెట్టండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైడ్రా పేరు చెప్పి అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు విజిలెన్స్, ఏసీబీలను అప్రమత్తం చేశారు. గత కొద్ది రోజులుగా హైడ్రా కూల్చివేతలను ఆసరాగా తీసుకుని కొంత మంది కింది స్థాయి అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారనే విషయం తమ దృష్టికి వచ్చిందని అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్టు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారనీ, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

హైడ్రాకు మరిన్ని అధికారాలు: సీఎస్

హైడ్రాకు మరిన్ని అధికారాలు కల్పిస్తున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. హైకోర్టు ఆదేశాలను పరిగణనలోకి తీసుకుంటూ చెరువులు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసం ఆ సంస్థకు మరిన్ని అధికారాలను, సిబ్బందిని అప్పగించేందుకు అవసరమైన చర్యలపై గురవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆమె సంబంధిత అధికారులతో చర్చించారు. కూల్చివేతలపై రెవెన్యూ, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, ఇరిగేషన్, తదితర శాఖలు వేర్వేరుగా నోటీసులు ఇస్తుండడంతో గందరగోళం తలెత్తుతోందని సీఎస్ పేర్కొన్నారు. ఓఆర్ఆర్ పరిధిలోని చెరువులు, పార్కులు, నాలాలతో పాటు అన్ని ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యతలను పూర్తిస్థాయిలో హైడ్రాకు అప్పగించేందుకు విధివిధానాలను రూపొందించాలని పురపాలక శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు. హైడ్రా ఆధ్వర్యంలో ఏర్పాటైన 72 బందాలను మరింత బలోపేతం చేయడానికి పోలీసు, సర్వే, ఇరిగేషన్ తదితర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని కేటాయించనున్నట్టు వివరించారు.

చెరువుల్లో అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై కేసులు

చెరువులు, కుంటల్లో నిబంధనలకు విరుద్ధంగా అనుమతులిచ్చిన ఆరుగురు అధికారులపై చర్యలకు హైడ్రా సిద్ధమైంది. కూల్చివేతల సమయంలో కొన్ని చోట్ల ఆ సంస్థకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు అనుమతి ఇస్తేనే తాము నిర్మించుకున్నామనీ, ఇందులో తమ తప్పేముందని పలువురు అధికారులను నిలదీస్తున్నారు. ఈ క్రమంలోనే అధికారులపై చర్యలు తీసుకుంటే భవిష్యత్‌లో మరెవ్వరూ పొరపాటు చేయబోరనే ఉద్దేశంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం. చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్, హెచ్ఎండీ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్, గండిపేట సూపరింటెండెంట్, నిజాంపేట మున్సిపల్ కమిషనర్, సర్వేయర్, నిజాంపేట ఎమ్మార్వోలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసినట్టు సమాచారం.

హైడ్రాకు రూ.25 లక్షల నిధులందించిన ఎంపీ అనిల్

గ్రేటర్ పరిధిలో హైడ్రా చేస్తున్న మంచి పనులకు గాను తన ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు అందిస్తున్నట్టు సికింద్రాబాద్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో కమిషనర్ రంగనాథ్‌ను కలిసిన ఆయన రూ.25 లక్షలు కేటాయిస్తూ లేఖను అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి భవిష్యత్ తరాల గురించి ఆలోచించి, హైదరాబాద్‌ను అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకే ఇలాంటి కీలక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.. రాజకీయాల కోసం హైడ్రాపై విమర్శలు ఆపి పార్టీలకతీతంగా అందరూ సహకరించాలని కోరారు.

వర్గీకరణ అమల్లోకొచ్చే వరకు ఫలితాలు నిలిపేయాలి

- క్రిమిలేయర్ లేకుంటే పేద దళిత, గిరిజనులకు న్యాయమెలా? : మీట్ ది ప్రెస్‌లో మంద కృష్ణ మాదిగ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల వర్గీకరణను అమలు చేసేంత వరకు గ్రూప్ 1 తదితర ఉద్యోగ నియామకాల పరీక్షల ఫలితాలను నిలిపేయాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) అధ్యక్షులు విరహత్ అలీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్‌లో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుత నియామకాల నుంచే వర్గీకరణను అమలు చేయాలన్నారు. ఇదే విషయంపై రెండు రోజుల్లో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మెన్‌ను కలవనున్నట్టు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల్లో క్రిమిలేయర్ అంశంపై మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ క్రిమిలేయర్‌ను వ్యతిరేకిస్తున్న వారు పేద దళిత, గిరిజనులను న్యాయమెలా దక్కుతుందో చెప్పడం లేదని విమర్శించారు.

సంపన్న దళిత, గిరిజనులకు మాత్రమే ప్రయోజనం కలిగించే విధంగా వ్యవహరించడం సరికాదన్నారు. దేశవ్యాప్తంగా ఎస్సీల్లో 1,108 కులాలుంటే ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లతో కేవలం 10 నుంచి 15 కులాలు మాత్రమే జనాభా కంటే ఎక్కువ లబ్ది పొందాయని చెప్పారు. వర్గీకరణ అమలైతే అన్ని కులాలు తమ జనాభా ప్రాతిపదికన లబ్ది పొందడానికి వీలు కలుగుతుందని చెప్పారు. గతంలో వర్గీకరణ అమలు అనుభవం ఇదేనని వివరించారు. వర్గీకరణకు సమాజం, ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, కమిషన్లు, న్యాయవ్యవస్థ మద్దతుగా నిలిచాయనీ, సమాజానికి ఎమ్మార్పీఎస్ సామాజిక బాధ్యతగా అనేక పోరాటాల ద్వారా కృతజ్ఞతలు తెలిపిందని గుర్తుచేశారు. వర్గీకరణను వ్యతిరేకిస్తున్న కొంత మంది తాము సమాజం నుంచి ఒంటరవుతున్నామన్న సోయి కూడా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఏ పార్టీలో చేరను

తాను ఏ పార్టీలో చేరబోనని మందకృష్ణ మాదిగ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. అణగారిన వర్గాల తరపున మాట్లాడే పరిస్థితి లేనప్పుడు చట్టసభల్లో వెళ్లి చేసేదేముంటుందని ప్రశ్నించారు. తాను స్వేచ్ఛగా, స్వతంత్రంగా ఉన్నప్పుడు మాత్రమే తన వర్గాల తరపున మాట్లాడగలుగుతానని చెప్పారు. ఎన్నికల్లో మరో 10 సార్లు ఓడిపోవడానికైనా సిద్ధమే కానీ... స్వతంత్రునిగానే ఉంటానని తెలిపారు.

షోకాజ్ నోటీసులుగా మార్చండి

హైదరాబాద్ : రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టలబేగం ఏరియా, కావూరిహిల్స్ లేఔట్‌లో ఎఫ్‌టీఎల్ ఏరియాలో ఉందని, వాటి కూల్చివేతలకు ఇచ్చిన నోటీసులపై సవాలు చేసిన పిటిషన్లను హైకోర్టు విచారించింది. కూల్చివేత నోటీసులను షోకాజ్ నోటీసులుగా మారుస్తామని ప్రభుత్వ హామీని నమోదు చేసి ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. షోకాజ్ నోటీసులపై ఆధారాలు సమర్పించడానికి పిటిషనర్లకు ఆస్కారం ఇవ్వాలన్నది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ ప్రాంతంలోని ఆక్రమణల తొలగింపునకు వీలుగా వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద జారీ చేసిన నోటీసులను షోకాజ్ నోటీసులుగా మార్పు చేస్తూ చీఫ్ జస్టిస్ ఆధ్వర్యంలోని బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. వాల్టా చట్టంలోని సెక్షన్ 23 కింద డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ ఇచ్చిన కూల్చివేత నోటీసులను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణను ముగిసివేసింది.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలుపై ప్రత్యేక దృష్టి

(మొదటిపేజీ తరువాయి)


వెలుగులు నింపేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ చట్టాన్ని వంద శాతం పూర్తి స్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల్లో ఉన్న అధికారులు సబ్ ప్లాన్ చట్టాన్ని అర్థం చేసుకుని చట్టం ప్రకారం వారి నిధులను వారికే ఖర్చు పెట్టాలని సూచించారు. ఈమేరకు ఉన్నతాధికారులు సాధ్య సాధ్యాలను దృష్టిలో పెట్టుకుని మేధోమథనం చేసి యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని ఆదేశించారు. చట్టం ముఖ్య ఉద్దేశాన్ని అమలు చేసి దళిత, గిరిజన జీవితాల్లో మార్పు తీసుకొస్తేనే దానికి అర్థం, పరమార్థం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఆ చట్టంపై యాక్షన్ ప్లాన్ తయారు చేసిన తర్వాత అన్ని శాఖలకు నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఆ తర్వాత వ్యయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీల భూములను అభివృద్ధి చేసేందుకు వీలుగా ఇందిరా జల ప్రభ పథకం అమలు కోసం అధికారులు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. మైనర్ ఇరిగేషన్ శాఖ అధికారులు... దళిత, గిరిజనుల వ్యవసాయం కోసం కావాల్సిన నీటి వనరులను సమకూర్చేందుకు బోర్లు వేయించాలనీ, భూగర్భ జలాలు పెరగడానికి చెక్ డ్యాముల నిర్మాణం చేపట్టాలని కోరారు. పోడు సాగు చేసుకునే ఆదివాసీ రైతులకు ఆదాయం వచ్చేలా, అడవిని కాపాడుకునేలా ఆయిల్‌పామ్, పండ్ల తోటల పెంపకం, అంతర్గత పంటల సాగుకు డిజైన్ చేయాలని సూచించారు. అడవి ద్వారా ఆదాయం ఉండేలా కొత్త పథకాలను తీసుకురావాలని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల కేటాయింపు, వాటి ఖర్చు గురించి అధికారులను భట్టి అడిగి తెలుసుకున్నారు. గతంలో మాదిరిగా కాకుండా ప్రజా ప్రభుత్వంలో ఆ చట్టం ప్రకారం 24శాతం నిధులు ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి ఖర్చు పెట్టడంపై అధికారులు కచ్చితంగా దృష్టి సారించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ సుల్తానీయా, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, సాంఘీక సంక్షేమ కమిషనర్ శ్రీదేవి, గిరిజ సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, హౌసింగ్ కార్పొరేషన్ ఎం.డి గౌతమ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కొనాల్సి వస్తుంది


- మొక్కలు పెంచడం అనివార్యం : నర్సరీ మేళా ప్రారంభోత్సవంలో మంత్రి తుమ్మల

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే మొక్కలను పెంచడం అనివార్యమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇప్పటి వరకు నీళ్ల మాత్రమే కొంటున్నామనీ, చెట్లను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో గాలిని కూడా కొనాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ నెక్లెస్‌రోడ్ పీపుల్స్‌ప్లాజాలో 16వ గ్రాండ్ నర్సరీ మేళాపేరుతో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా హార్టీకల్చర్ షోను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని పట్టణాలకు ఆక్సిజన్ కొనుక్కొనే పరిస్థితి ఉందని చెప్పారు. ఢిల్లీలో ఆక్సిజన్ కేంద్రాలు వెలుస్తున్నాయని గుర్తు చేశారు. మంచినీళ కొనుక్కోవడమే కాకుండా ఆఖరుకు గాలి కూడా కొనుక్కొనే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే రూఫ్‌గార్డెన్, వర్టికల్‌గార్డెన్స్ ఇలా ఇంటి నిండా మొక్కలు పెంచుకోవాలనే ప్రజల ఆకాంక్షను చూస్తున్నామని తెలిపారు. ఇంట్లో, ఇంటిపక్కన ఏ మాత్రం ఖాళీ స్థలం ఉన్నా కూరగాయలతోపాటు పచ్చదనంగా ఉండేలా మొక్కలు పెంచాలని కోరారు. నర్సరీ మేళాలో రూ.50 నుంచి రూ.3లక్షల ఖరీదైన అందమైన పూలమొక్కలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మొక్కల ప్రియులు వీటన్నింటినీ సద్వినియోగం చేసుకుని మేళాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యాన శాఖ డైరెక్టర్ షేక్ యాస్మీన్ బాషా మాట్లాడుతూ ఈ నర్సరీ మేళాలో కిచెన్‌గార్డెన్, ఆర్నమెంటల్ ప్లాంట్స్, మెడిసినల్ ప్లాంట్స్ పెంచేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి 150 స్టాల్స్ ఎగ్జిబిట్స్ వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో మేళా ఇన్‌చార్జి ఖలీద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.







షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం.. ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందర్నీ రుణవిముక్తులను చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాంకేతిక పేరుతో కాలయాపన చేయకుండా, అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేసి, తిరిగి రుణాలు ఇవ్వాలని కోరారు. గురువారం రాష్ట్రవ్యాప్తంగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్, మండల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని, ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రూ.2 లక్షల రుణమాఫీ అనేది సాహసోపేతమైన నిర్ణయమని, దాన్ని తాము స్వాగతించామన్నారు. తొలుత ప్రతి రైతుకూ రూ.2లక్షలు అని చెప్పిన ప్రభుత్వం తర్వాత రైతు కుటుంబానికి అని మాట మార్చిందని, అది కూడా అందరికీ మాఫీ చేయడం లేదన్నారు. రుణమాఫీ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో 567లో అనేక నిబంధనలు విధించడం వల్ల రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు రూ.22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.18వేల కోట్లకు పైగా జమ చేసినట్టుగా ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతిరైతుకు రుణమాఫీ వర్తింపచేయాలన్నారు. ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి సీపీఐ(ఎం) సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి ఆందోళన నిర్వహించారు. పెన్‌పహాడ్, మునగాల, నేరేడుచర్ల తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహించారు. యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఎదుట ధర్నా నిర్వహించారు. గుండాల మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మోత్కూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు ఆధ్వర్యంలో అనంతరం డీఆర్ఓ పద్మజారాణికి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రైతు సంఘం సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. సీపీఐ(ఎం), తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కొండపాక తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్ దిలీప్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు.

వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో రైతులు ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లా అమనగల్ సిండికేట్ బ్యాంక్ వద్ద రైతులు ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘనపూర్ డివిజన్ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్డీఓ డీఎస్ వెంకన్నకు వినతిపత్రాన్ని అందజేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఎదుట ధర్నా నిర్వహించారు. కొల్లాపూర్, పెంట్లవల్లి మండలాల్లో ఆర్డీవో కార్యాలయాల ముందు ధర్నా చేశారు. అనంతరం ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చారు. కొల్లాపూర్‌లో ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. వనపర్తి జిల్లా వనపర్తి, పానగల్ తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నా చేశారు. మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. జోగులంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన నిర్వహించారు. ధరూర్‌లోని ఎమ్మార్వో కార్యాలయం ముందు ఆందోళన చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం), సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్మూర్, మాక్లూర్‌లో తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. బోధన్‌లో ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. జగిత్యాల జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.

చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో ముందడుగు

- దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు
- సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటికి సైతం నోటీసు

నవతెలంగాణ- మియాపూర్



చెరువుల కబ్జాలపై రాష్ట్ర ప్రభుత్వం మరో సంచలన నిర్ణయం తీసుకుంది. చెరువులు, కుంటలు నాలాల పరిరక్షణకు మరో ముందడుగు వేసింది. అందులో భాగంగా రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పరిధిలోని దుర్గం చెరువు పరిరక్షణ కోసం చర్యలకు ఉపక్రమించింది. దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో ఉన్న నెక్టర్స్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, కావూరి హిల్స్, అమర్ సొసైటీ నివాసితులకు శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. సుమారు 200 మందికిపైగా నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు పలు ఇండ్లకు అధికారులు నోటీసులను అంటించారు. వీరిలో రాజకీయ, సినీ ప్రముఖులతోపాటు ఐఏఎస్, ఇతర ముఖ్య అధికారులు సైతం ఉన్నట్టు తెలుస్తోంది. వీరికి నెల రోజుల గడువు ఇస్తూ ఎఫ్టీఎల్‌లో ఆక్రమించి కట్టిన నిర్మాణాలను స్వచ్ఛందంగా కూల్చివేయాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో తామే కూల్చివేతలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఒక్కరోజే ఈ నాలుగు కాలనీల్లోని వందల ఇండ్లు, వాణిజ్య సముదాయాలకు వాల్టా చట్టంలోని సెక్షన్ 23(1) కింద నోటీసులు ఇచ్చారు. దీంతో దుర్గం చెరువు పరిసర కాలనీలో ఇప్పుడు నోటీసుల అంశం సర్వత్రా చర్చనీయాంశమైంది.

సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం నోటీసు


సీఎం సోదరుడు తిరుపతిరెడ్డికి సైతం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అమర్ కో ఆపరేటివ్ సొసైటీలో ఆయన నివాసం ఉంటున్నారు. ఇది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉండటంతో అధికారులు ఆయన ఇంటికి సైతం నోటీసులు అంటించారు. అయితే దీనిపై తిరుపతిరెడ్డి స్పందించారు. తాను అక్కడ ఇల్లు కట్టలేదని, మరొకరి వద్ద కొనుగోలు చేసినట్టు తెలిపారు. ఆ ఇంటికి సంబంధించిన అన్ని పత్రాలు తన వద్ద ఉన్నాయన్నారు. అయినప్పటికీ తన ఇల్లు నిబంధనలు మేరకు లేకుంటే ప్రభుత్వ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.





మహిళలు పెండ్లి తర్వాత కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరికలేకుండా గడిపేస్తుంటారు. 'ఇక మా కలలు నిజం చేసుకునే అవకాశం ఎక్కడుంది' అనుకుంటూ ఢీలాపడిపోతారు. కానీ కాస్త సమయం చిక్కినా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ తామేంటో నిరూపించుకునేవారు కొందరుంటారు. ఆ కోవకు చెందిన వారే డాక్టర్ స్నేహలత ప్రసాద్. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. వ్యర్థాలకు జీవం పోస్తూ గొప్ప శిల్పిగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. భర్త, కుటుంబ చేయూతనందిస్తే మహిళలు అద్భుతాలు సృష్టిస్తారనేందుకు నిదర్శనంగా నిలిచిన ఆమె పరిచయం నేటి మానవిలో...

వ్యర్థాలతో అందమైన శిల్పాలు



స్నేహలత సొంతూరు రాజస్థాన్‌లోని జోద్‌పూర్. తల్లి లీలాదేవి ప్రోత్సాహంతో కళారంగంలోకి అడుగుపెట్టారు. ఫైన్ ఆర్ట్స్‌సబ్జెక్ట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఆ తర్వాత పీహెచ్‌డీ పట్టా కూడా అందుకున్నారు. పెండ్లి తర్వాత హైదరాబాద్‌కు వచ్చేశారు. వీరికి ఇద్దరు పిల్లలు. కుటుంబం, పిల్లల బాధ్యతలతో తీరిక లేకుండాపోయింది. దాంతో తన కళకు కొంత కాలం విరామం ఇచ్చారు. కానీ తనలోని సృజనాత్మక సామర్థ్యాలను వెలికి తీయాలనే కోరిక మాత్రం రోజు రోజుకు పెరుగుతూనే వచ్చింది.

ఆత్మవిశ్వాసాన్ని జోడించి

పిల్లలు కాస్త ఎదిగిన తర్వాత భర్త ప్రసాద్ సహకారంతో తన కెరీర్‌లో సెంకడ్ ఇన్నింగ్స్ మొదలుపెట్టారు స్నేహ. అరుదైన తన కళకు ఆత్మవిశ్వాసాన్ని జోడించి ఆకాశమే హద్దుగా ఎదిగారు. అతి పెద్ద పెయిటింగ్ వేసి ప్రపంచ రికార్డు సృష్టించారు. స్నేహ కేవలం ఆర్టిస్టు మాత్రమే కాదు ప్రకృతి పర్యావరణ ప్రేమికురాలు కూడా. ప్రకృతి మీద ఆమెకున్న ప్రేమంతా ఆమె ప్రతీ పెయింటింగ్‌లోనూ మనకు కనిపిస్తుంది. ఢిల్లీ, జైపూర్, హైదరాబాద్‌లో అనేక ఆర్ట్ ఎగ్జిబిషన్స్ నిర్వహించారు. దాదాపు అన్నింటికీ ప్రజల నుండి మంచి ఆదరణ లభించింది. ఈ విజయం నుండి మరింత ప్రోత్సాహం అందుకున్నారు. మనిషి జీవితంతో ముడిపడిన ప్రేమను ఆమె తన చిత్రాలలో ఎంతో అందంగా చూపిస్తారు.

శిల్ప కళలో...


చిత్రకళ ఎంతో ఉత్సాహంగా కొనసాగుతున్న సమయంలోనే అనూహ్యంగా శిల్ప కళతో స్నేహకు పరిచయం ఏర్పడింది. ఆ కళమీద అంతులేని మక్కువ పెంచుకున్నారు. పట్టుదలతో అందులోనూ రాణించారు. ఇక అప్పటి నుంచి వెనుదిరిగి చూడలేదు. తన ప్రతిభతో భారతదేశంలో అత్యంత నైపుణ్యం కలిగిన మహిళా శిల్పులలో ఒకరిగా పేరు తెచ్చుకున్నారు. అంతేకాదు ఆమె తొలి శిల్పం తెలంగాణా తల్లిది కావడం విశేషం. అలాగే పారిశ్రామిక వ్యర్థాలను అందమైన కళాకృతులుగా, రాయి, ఫైబర్ ఇలా వస్తువు ఏదైనా దాన్ని అద్భుతంగా మలచడంలో ఆమెది అందె వేసిన చేయి.

విద్యార్థులకు శిక్షణ

తనలోని కళను పది మందితో పంచుకోవాలనే ఉద్దేశంతో స్నేహ ఆర్ట్స్ ప్రారంభించారు. దీని ఆధ్వర్యంలో ఆర్ట్ క్యాంపులు, ఆర్ట్ ఫెయిర్, కోర్సులు, ఆర్ట్ గ్యాలరీ ఎగ్జిబిషన్‌లు, ఆర్ట్ టాక్‌లు, లైవ్ డెమోలు, డాక్యుమెంటరీలతో బిజీగా గడుపుతున్నారు. అలాగే 'రంగభూమి' అనే వేదిక ద్వారా ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇస్తున్నారు. ఇలా అద్భుతమైన కళాఖండాలను తీర్చిదిద్దే గొప్ప శిల్పిగానే కాకుండా తర్వాతి తరాన్ని తీర్చిదిద్దే శిక్షకురాలిగా మారారు. 'గురుకులం లాంటి విద్యా సంస్థను ఏర్పాటు చేసి, పట్టుదలగా, పూర్తి నిబద్ధతతో చిత్రకళను, శిల్ప కళను నేర్చుకోవాలనే వారికి శిక్షణ ఇవ్వాలనేది నా లక్ష్యం. విద్యార్థులకు సరియైన రీతిలో శిక్షణ ఇవ్వాలి. దేశ సంస్కృతీ, సంప్రదాయాల మీద అవగాహన కల్పించాలి. ఆసక్తిని కలిగించాలి. అపుడే వారు ఎవరూ ఊహించలేని అద్భుతాలు సృష్టిస్తారు' అంటూ తన భవిష్యత్ కర్తవ్యాన్ని పంచుకున్నారు స్నేహ.

వెసులుబాటును ఉపయోగించుకొని

'చిత్రకళైనా, శిల్ప కళైనా ప్రతీ దానికీ ఓ లెక్క ఉంటుంది. దాని ప్రకారమే పోవాలి. నా జీవితమూ అంతే. ఒక లెక్క ప్రకారం కలలు, కళల మేళవింపుతో ఒక అందమైన చిత్రంగా మల్చుకున్నాను. ఆడపిల్లలకు కూడా ఆశలు, కోరికలు, లక్ష్యాలు ఉంటాయి. సాధించాలనే పట్టుదలా ఉంటుంది. కానీ తొలుత నచ్చింది నేర్చుకోవడంలో అడ్డంకులొస్తాయి. తీరా చదువుకున్నాక కుటుంబం ముందు, కరియర్ తర్వాత అనే కట్టుబాట్లు మరింత అవరోధంగా మారతాయి. ఇలాంటి కారణాల రీత్యా చాలా మంది తమలోని ఆశలను చంపేసుకుంటున్నారు. కానీ ఇది సరైనది కాదు. దొరికిన వెసులుబాటును ఉపయోగించుకుని మహిళలు తమ ప్రతిభకు పదును పెట్టుకోవాలి. సానుకూల ధోరణి, దృక్పథంతో ముందుకు పోవాలి' అంటారు స్నేహలత.



పర్యావరణ శిల్పం

పుణేలోని వాకాడ్‌లో, కస్తూరి చౌక్ వద్ద ఇటీవల ఒక పర్యావరణ శిల్పాన్ని ఆమె ఏర్పాటు చేశారు. ఇందులో కార్మికుల భద్రతకు చిహ్నమైన టోపీతో పాటు సమాజానికి, స్థిరత్వానికి మధ్య కీలకమైన బంధాన్ని తెలిపేలా డీఎన్ఏ గొలుసు, ఇంకా పరిశ్రమలు, శక్తి, ఆవిష్కరణల మేళవింపుతో దీన్ని ఏర్పాటు చేయడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పులపై పౌరులకు అవగాహన కల్పించే లక్ష్యంతో స్నేహ దీన్ని రూపొందించారు. 21 అడుగుల పొడవు, 15 అడుగుల వెడల్పుతో రెండు నెలల పాటు శ్రమించి దీన్ని సృష్టించారు.

డ్రీమ్ ప్రాజెక్ట్...

స్నేహ పుట్టింది రాజస్థాన్‌లోనే అయినా తనకిష్టమైన కళలో రాణించింది మాత్రం హైదరాబాద్‌లో. అందుకే ఆమెకు ఈ ప్రాంతమంటే ఎంతో అభిమానం. అందుకే ఈ మహానగరం కోసం ఏదైనా చేయాలని నిరంతరం తపిస్తున్నారు. తనకు అవకాశం లభిస్తే పరిశ్రమల నుంచి వచ్చిన ఇనప వస్తువులు, బోల్ట్‌లు, నట్లు తదితర వస్తువులతో తెలంగాణకు తలమానికమైన చారిత్రక కట్టడం 'చార్మినార్'ను యథాతథంగా నిర్మించాలనుకుంటున్నారామే. అది కూడా సందర్శకులు తను నిర్మించే చార్మినార్ పైకి ఎక్కి నగర అందాలను దర్శించే అవకాశాన్ని కల్పించాలని భావిస్తున్నారు. ఇది తన డ్రీమ్ ప్రాజెక్ట్ అమె అంటున్నారు. ప్రభుత్వం, పారిశ్రామిక వేత్తల నుంచి సహకారం లభిస్తే దీన్ని సాధించి తీరుతానని నమ్మకంగా చెబుతున్నారు.

గొప్ప అనుభూతి

పనికిరాకుండా పారవేసే చెత్త, ఇతర వ్యర్థాల నుంచి కళాఖండాలను తీర్చిదిద్దడం ద్వారా ప్రకృతికి, పర్యావరణానికి జరుగుతున్న నష్టాన్ని, ముప్పును తగ్గించడం తన బాధ్యతగా ఆమె భావించారు. కాలుష్య నివారణలో అందరూ భాగం పంచుకోవాలని ఆమె కోరుకుంటున్నారు. 'చిన్నప్పటి నుండి గొప్ప విజయాలు సాధించాలనేదే నా తాపత్రయం. అందుకే మహిళలకు ప్రవేశం అరుదుగా లభించే శిల్ప కళను ఎంచుకున్నాను. శిల్పాన్ని చెక్కేటపుడు వచ్చే దుమ్ము, ధూళి నాకు కనిపించదు. 200 ఏండ్లకు పైగా చరిత్రను చూసిన ఒక పవిత్రమైన వస్తువును స్పృశిస్తున్న పారవశ్యం. అదొక గొప్ప అనుభూతి. తొమ్మిది నెలలు గర్భంలో బిడ్డకు ప్రాణం పోసినంత సహజంగా శిల్పం ఆవిష్కృతమవుతుంది' అంటారామె. అందుకే అనేక అవార్డులు, రివార్డులు అందుకున్నారు.



అపోహలతో విచారణను బదిలీ చేయలేం

(మొదటిపేజీ తరువాయి)

కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది.

తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ్ లూత్రా, మేనకా గురుస్వామీలు, పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, మోహిత్ రావు హాజరయ్యారు. గురువారం ఉదయం ఈ కేసు విచారణకు రాగా కేసు తెలంగాణ సీఎంకు వ్యతిరేకంగా దాఖలైందని పిటిషనర్ తరపు న్యాయవాది సుందరం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేసులో నిందితుడు సీఎంగా ఉన్నారని, హోంశాఖ, అవినీతి నిరోధక శాఖలు స్వయంగా ఆయన చేతిలోనే ఉన్నాయని తెలిపారు. అంతేకాక ఈ కేసులో ప్రత్యక్ష సాక్ష్యులను, దర్యాప్తు సంస్థల అధికారులను ఇంకా విచారించలేదన్నారు. మరోవైపు రేవంత్ రెడ్డి సీఎంగా ఉన్న నేపథ్యంలో సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు. న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ తెలంగాణ ప్రభుత్వ ప్రాసిక్యూషన్ తీరు, పోలీసు అధికారులతో పాటు, సుప్రీంకోర్టుకు సంబంధించిన గతంలో రేవంత్ రెడ్డి చేసిన పలు వ్యాఖ్యలతో పిటిషనర్లు ఆందోళన చెందుతున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలపై ప్రభుత్వ తరపు న్యాయవాదులు ముకుల్ రోహిత్గి, సిద్దార్థ లూత్రా, మేనకా గురుస్వామీలు అభ్యంతరం తెలిపారు. మొదటి నుంచి కేసు దర్యాప్తు అధికారుల్లో ఎలాంటి మార్పు లేదని కోర్టుకు నివేదించారు. ఆగస్టు 2021లో జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం విచారణను నిలిపివేసిందని నివేదించారు. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ కేవలం అపోహలతో విచారణను బదిలీ చేస్తే దేశ న్యాయ వ్యవస్థపై నమ్మకం లేదన్నట్టే అవుతుందని వ్యాఖ్యానించారు. 2021 నుంచి స్టే అమలులో ఉందని, 2024 ఎన్నికల తరువాత పిటిషనర్లు కోర్టును ఆశ్రయించినట్టు పేర్కొంది. విచారణ బదిలీని నిరాకరిస్తూనే, ఇరు పక్షాల్లో విశ్వాసాన్ని నింపేలా స్వతంత్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ)ను ఏర్పాటు చేస్తూ... పిటిషన్‌ను డిస్మిస్ చేస్తామని వ్యాఖ్యానించింది. అయితే తెలంగాణ హైకోర్టును సంప్రదించి మధ్యాహ్నం 2 గంటలకు ఆర్డర్ ఇస్తామని స్పష్టం చేసింది. అంతలోపు పీపీల కోసం ఇద్దరి పేర్లను సూచించాలని ఆదేశించింది.

అనూహ్యంగా కవిత బెయిల్ విషయంలో సీఎం వ్యాఖ్యలపై వాదనలు

మధ్యాహ్నం తరువాత వాదనలు అనుహ్యంగా కవిత బెయిల్ అంశంపైకి మళ్లాయి. ఈ సందర్భంగా కవిత బెయిల్‌పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను పిటిషనర్ తరపు న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. 'తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయం కోసం బీఆర్ఎస్ పని చేసింది. బీఆర్ఎస్, బీజేపీ మధ్య కుదిరిన ఒప్పందం వల్లే కవితకు బెయిల్ వచ్చిందని సీఎం వ్యాఖ్యలు చేశారు' అని తెలిపారు. అయితే ఈ వ్యాఖ్యలపై ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కవిత బెయిల్ ఉత్తర్వులపై వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డిని మందలించింది. జస్టిస్ బీఆర్ గవాయి స్పందిస్తూ... సీఎం స్థాయి హోదాలోని వ్యక్తి వ్యాఖ్యలతో కొందరి ఆలోచనల్లో భయాందోళనలు కలిగించవచ్చు. రాజకీయ పార్టీలను సంప్రదించి మేము బెయిల్, తీర్పులు ఇస్తున్నామా? మేము మా విధిని మనస్సాక్షిగా, ప్రమాణ పూర్వకంగా చేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇదే సందర్భంలో జస్టిస్ కెవి విశ్వనాథన్ జోక్యం చేసుకొని 'ఇది ఒక సీఎం హోదాలో ఉన్న బాధ్యత గల వ్యక్తి చేయాల్సిన వ్యాఖ్యేనా?. సంస్థల పట్ల పరస్పర గౌరవం ఉండాలి. ప్రాథమిక కర్తవ్యం. గౌరవం కలిగి ఉండాలి' అని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలపై వ్యాఖ్యానించిన మహారాష్ట్ర సర్కార్‌లో అడిషనల్ సెక్రెటరీగా విధులు నిర్వహిస్తోన్న ఐఏఎస్ అధికారికి కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసినట్టు గుర్తు చేశారు. తెలంగాణ సీఎం సైతం దేశ అత్యున్నత న్యాయస్థానం పట్ల గౌరవం లేకుండా, ఇలాంటి ప్రవర్తనే కలిగి ఉంటే, ఆయన తెలంగాణకు వెలుపల కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సి ఉంటుందని మందలించారు. కాగా... ప్రభుత్వం తరపు న్యాయవాదులు ముకులు రోహిత్గి జోక్యం చేసుకొని సీఎం పక్షాన క్షమాపణ చెప్పగా, మరో న్యాయవాది సిద్దార్థ లూత్రా సీఎంకు కౌన్సిలింగ్ చేస్తామని ధర్మాసనానికి తెలిపారు. మరోవైపు పిటిషనర్ తరపు న్యాయవాది శేషాద్రి నాయుడు స్పందిస్తూ సుప్రీం గురించి సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు, హైకోర్టు, దిగువ కోర్టుల్లో న్యాయమూర్తుల పరువు గురించి ఎలాంటి ఆందోళనలు ఉంటాయో ఆలోచించాలన్నారు. కాగా, పీపీ నియామకం విషయంలో వి. సురేందర్ రావు(ప్రస్తుతం సీఎం కేసులో ప్రాసిక్యూటర్), ఉమా మహేశ్వర్ రావు పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే ఈ విషయంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోని ధర్మాసనం, తదుపరి విచారణను సెప్టెంబర్ 2కు వాయిదా వేస్తున్నట్టు వెల్లడించింది. పిటిషన్ కోరినట్టు విచారణ బదిలీ అంశాన్ని ప్రస్తుత స్థితిలో రద్దు చేయలేమని స్పష్టం చేసింది.

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచండి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహాలక్ష్మి పథకాన్ని అమలు చేస్తూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడాన్ని ఆహ్వానించామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తెలిపారు. ఆర్టీసీ బస్సుల సంఖ్యను, మెట్రోరైల్ బోగీలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన గురువారం లేఖ రాశారు. రాష్ట్రంలో సుమారు నాలుగు కోట్ల మంది ప్రజలున్నారని తెలిపారు. హైదరాబాద్ నగరంలోనే 1.10 కోట్ల మంది నివసిస్తు న్నారని వివరించారు. గతంలో వివిధ రకాల వాహనాల్లో ప్రయాణించే ప్రజలు, ప్రత్యేకించి మహిళలు ప్రస్తుతం అత్యధిక భాగం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణిస్తున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ బస్సుల్లో వంద శాతానికిపైగా ఆక్యుపెన్సీ రేషియో పెరిగిందని ప్రభుత్వమే ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రయాణికుల సంఖ్య రోజుకి 30 నుంచి 60 లక్షలకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఆర్టీసీ బస్సుల సంఖ్య పెరగలేదని వివరించారు. ఫలితంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ప్రభుత్వ ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే సమయంలో కిక్కిరిసి ప్రయాణం చేయాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టిన తర్వాత ఇటీవల కాలంలో ప్రభుత్వం దాదాపు 100 బస్సులు మాత్రమే పెంచిందని పేర్కొన్నారు. అదికూడా ఉచిత ప్రయాణానికి ఉపయోగపడని డీలక్స్, మెట్రో డీలక్స్ బస్సులను పెంచారని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని గ్రామాలకూ ప్రజారవాణాను మెరుగు పరిచేందుకు బస్సుల సంఖ్య పెంచాలనీ, రద్దీ రూట్లలో తగినన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

ఎంఎంటీఎస్ రైళ్లను అందుబాటులోకి తేవాలి

హైదరాబాద్ నగరం విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజారవాణాను పెంచి మెరుగుపర్చాల్సిన అవసరముందని తమ్మినేని తెలిపారు. ట్రాఫిక్ రద్దీతో ప్రజలు సతమతమవుతున్నారని పేర్కొన్నారు. మెట్రో రైళ్లు కిక్కిరిసి నడుస్తున్నాయని వివరించారు. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఎక్కువ గా ఉండటంతో రైలు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా ఉందని తెలిపారు. మూడు బోగీలతో నడుస్తున్న మెట్రో రైలును ఆరు బోగీలకు పెంచాలంటూ ప్రయాణికులు ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ఎల్‌అండ్‌టీ సంస్థ పెడచెవిన పెడుతున్నదని పేర్కొన్నారు. లాభనష్టాలను బేరీజు వేస్తున్నదని విమర్శించారు. ప్రతి రూట్లలో లాభనష్టాలను చూసే ధోరణి సరైంది కాదని తెలిపారు. నగరంలోని పేద, సామాన్య ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లు అతి చౌకగా అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న రైళ్లను చివరి నిమిషంలో బాధ్యతారహితంగా రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. రెండో దశలో నిర్మించిన రూట్లలో ఇంతవరకూ కొత్త రైళ్లు వేయలేదని తెలిపారు. మరమ్మతుల పేరుతో గంటలకొద్దీ నిలిపేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని రాష్ట్రంలో ప్రజారవాణాను మెరుగుపర్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ బోగీల సంఖ్య పెంచాలనీ, ఎంఎంటీఎస్ రైళ్లను ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేయాలని కోరారు.

అంబానీని దాటేసిన అదానీ

న్యూఢిల్లీ : భారత్‌లో అత్యంత కుబేరుడిగా గౌతం అదానీ నిలిచారు. ఇంతక్రితం ఈ స్థానంలో ఉన్న ముకేశ్ అంబానీ రెండో స్థానంలో ఉన్నారు. దేశంలో అత్యంత సంపన్నుల జాబితాను హురున్ ఇండియా గురువారం విడుదల చేసింది. అందులో 62 ఏండ్ల గౌతమ్ అదానీ రూ.11.6 లక్షల కోట్ల సంపదతో మొదటి స్థానంలో నిలిచారు. ముకేశ్ అంబానీ రూ.10.1 లక్షల కోట్ల సంపద కలిగి ఉన్నారు. ఈ జాబితాలో తొలిసారి బాలీవుడ్ స్టార్ షారుఖ్‌ఖాన్‌కు చోటు దక్కింది. రూ.7,300 కోట్ల ఆదాయాన్ని కలిగి ఉన్నారు. శివ్ నాడార్, కుటుంబం రూ.3.1 లక్షల కోట్లతో 3వ స్థానంలో, సైరస్ పునావాలా కుటుంబం రూ.2.89 లక్షల కోట్లు (4), దిలిప్ సింఘ్వీ రూ.2.49 లక్షల కోట్లు (5), కుమార్ మంగళం బిర్లా రూ.2.35 లక్షల కోట్లు (6), గోపీచంద్ హిందుజా కుటుంబం రూ.1.92 లక్షల కోట్లు (7), రాధాకష్ణ దమాని రూ.1.90,900 కోట్లు (8), అజీమ్ ప్రేమ్‌జీ, కుటుంబం రూ.1.90,700 కోట్లు (9), నిరజ్ బజాజ్, కుటుంబం రూ.1.62 లక్షల కోట్లు (10) వరుస స్థానాల్లో నిలిచారు.

గచ్చిబౌలిలో ప్రేమోన్మాది ఘాతుకం

(మొదటిపేజీ తరువాయి)

ఆమె పెండ్లికి నిరాకరిస్తూ కొంత కాలంగా అతన్ని దూరం పెట్టింది. వేరే వారితో సన్నిహితంగా ఉంటూ తనని దూరం పెడుతుందనే అనుమానం రాకేష్‌లో మొదలైంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి దీపన ఇంటికి వెళ్లిన రాకేష్.. ఆమెతో మరోసారి పెండ్లి ప్రస్తావన తీసుకువచ్చాడు. దాంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. రాకేష్ క్షణికావేశంలో అక్కడే ఉన్న కూరగాయల కత్తితో యువతిపై దాడి చేశాడు. దాడిని అడ్డుకోవడానికి దీపన తమాంగ్ ముగ్గురు స్నేహితులు ప్రయత్నించగా రాకేష్ వారిపై కూడా దాడికి యత్నించాడు. ఈ దాడిలో దీపన తమాంగ్ తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆమె మృతిచెందింది. ఆమె స్నేహితులకు సైతం గాయాలు కావడంతో వారికి ఓ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

పారిపోయే ప్రయత్నంలో ఆత్మహత్యాయత్నం

కాగా యువతిని కత్తితో పొడిచి అనంతరం అక్కడి నుంచి పారిపోయిన రాకేష్..మెయినాబాద్ సమీపంలో కనకమామిడి వద్ద ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కరెంట్ పోల్ ఎక్కడానికి ప్రయత్నించగా.. విద్యుద్ఘాతానికి గురై గాయలపాలయ్యాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రాకేష్‌ను కనకమామిడి సమీపంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడ నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న గచ్చిబౌలి పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

నారాయణపూర్ జిల్లాలో ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చేసుకున్నారు. నారాయణపూర్ జిల్లా ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపూర్, కంకేర్ జిల్లాల సరిహద్దులోని మాద్ దండకారణ్య ప్రాంతంలో మావోయిస్టుల ఉనికి గురించి సమాచారం అందుకున్న జాయింట్ పోలీసు పార్టీ కూంబింగ్ చేపట్టింది. ఈ సమయంలో మావోయిస్టులు తారసపడటంతో కాల్పులు జరిగాయి. కాల్పుల అనంతరం ఘటనా స్థలంలో పోలీసులకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలు లభ్యమయ్యాయి. గురువారం సాయంత్రం వరకు పోలీసులు, మావోయిస్టులకు మధ్య కాల్పులు భీకరంగా జరగడంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని ఎస్పీ తెలిపారు. డీఆర్‌జీ ఎస్‌టీఎఫ్, బీఎస్ఎఫ్ జాయింట్ టీమ్ మావోయిస్టుల కోసం పెట్రోలింగ్ సెర్చ్‌లో ఉంది.

కవితను చూసి కేసీఆర్ భావోద్వేగం

(మొదటిపేజీ తరువాయి)


తన భర్త అనిల్, కుమారునితో కలిసి వచ్చారు. ఈ సందర్భంగా ఆమెకు ఆత్మీయ ఆహ్వానం పలికారు. ఎర్రవల్లి మాజీ సర్పంచ్ కమ్మరి బాలరాజు దంపతులు, సిబ్బంది ఎమ్మెల్సీ కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ కన్న బిడ్డను చూడగానే భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూసి కేసీఆర్ ఆత్మీయ ఆనందం వెలిబుచ్చారు. తండ్రి పాదాలకు నమస్కరించిన కూతురిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించారు. ఆమె వెంట ఎంపీ జొగినిపల్లి సంతోష్ రావు, వేముల ప్రశాంత్, పాడి కౌశిక్ రెడ్డి, జీవన్ రెడ్డి, బడుగుల లింగయ్య యాదవ్,, అంజిరెడ్డి, జహంగీర్ తదితరులున్నారు.

ఆన్‌లైన్ పాస్‌పోర్ట్ పోర్టల్ ఐదు రోజుల బంద్

న్యూఢిల్లీ : పాస్‌పోర్ట్ అప్లికేషన్ల ఆన్‌లైన్ పోర్టల్ ఐదు రోజులు బంద్ కానున్నది. దీంతో ఆగస్ట్ 29 రాత్రి 8 గంటల నుంచి ఈ సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్టు కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటించింది. సెప్టెంబర్ 2న ఉదయం 6 గంటలకు సేవలు పునరుద్ధరించనున్నట్టు వివరించింది. సేవల నిర్వహణలో భాగంగా పాస్‌పోర్ట్ సేవలను నిలిపివేస్తున్నట్టు తెలిపింది. సేవలు నిలిచిపోతుండటంతో ఈ ఐదు రోజుల అపాయింట్‌మెంట్ ఉన్నవారికి మరో తేదీతో పాటు సమయాన్ని ఖరారు చేస్తూ రీషెడ్యూల్ చేయనున్నట్టు వివరించింది. ఇందుకు సంబంధించి వారి ఫోన్లకు సందేశాలు పంపుతామని కేంద్రం విదేశాంగ శాఖ తెలిపింది.

ఆర్థిక సహాయం

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామంలో ఏర్పుల లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాంగ్రెస్ నాయకులు అంతటి పారిజాత నరసింహగౌడ్ గురువారం ఆయన దశదినకర్మలో పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి రూ.5వేల ఆర్థిక సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో సుర్కంటి సత్తిరెడ్డి, చిరగోని శ్రీశైలం, అంతటి అంజయ్యగౌడ్, చీమల వీరేశం, పగిళ్ల యాదయ్య, పబ్బు గిరిప్రసాద్, బైకాని నాగరాజు, మారగోని యాదయ్య ఆరూరి నరసింహ తదితరులు పాల్గొన్నారు.


































వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలి

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు

నవతెలంగాణ-అర్వపల్లి

గ్రామాల్లో సీజన్ వ్యాధులతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని కావున వైద్య సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోనూ గ్రామాల్లో అందుబాటులో ఉండి ప్రజలకు సరైన వైద్య సేవలు అందించాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. గురువారం ఎమ్మెల్యే తిరుమలగిరి వైపు వెళ్తుండగా రోడ్డు వెంబడి ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. వైద్య అధికారులు సిబ్బంది రోజు విధుల్లోకి వస్తున్నారా లేరా ప్రజల్లోకి అందుబాటులో ఉండి వైద్య సేవ అందిస్తున్నారా వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులో సంతకం చేసి విధుల్లో లేకుండా ఎక్కడికి వెళ్లారని అడిగారు. వెంటనే ఆయన డిఎంహెచ్‌ఓకి ఫోన్ చేసి అసలు రోజువారీగా వస్తున్నారా సంతకాలు మాత్రమే చేస్తున్నారా రాని వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన వారిని ఆరోగ్య పరిస్థితిని సరైన వైద్యం అందిస్తున్నారా లేదా అందుబాటులో మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అందుబాటులో లేకుంటే విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తప్పవ ని హెచ్చరించారు. ఆయన వెంట మాజీ జెడ్పిటిసి కోర పెడతా అవిలయ్య బైరబోయిన మహారాజు వైద్య సిబ్బంది ఉన్నారు.





గోల్డ్ మెడల్ సాధించిన భద్రాచలం వాసికి అభినందనలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జవాలిన్ త్రో విభాగంలో బంగారు పతకం సాధించిన భద్రాచలం వాసి అమ్రిన్‌ను వారి కుటుంబ సభ్యుల సమక్షంలో అటవీశాఖ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య ఘనంగా సన్మానించారు. హైదరాబాదులో జరిగినటువంటి పోటీల్లో మొదటి స్థానం కైవసం చేసుకుని గోల్డ్ మెడల్ సాధించటం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా కాలేజీ ప్రిన్సిపల్ శేషుబాబు, కోచ్ గిరిప్రసాద్‌లను కూడా ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం నియోజకవర్గం మైనారిటీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎండి ఆరిఫ్, భద్రాచలం పట్టణ మైనారిటీ అధ్యక్షులు ఎస్.కె అలీమ్, మైనారిటీ సెల్ బాబాజీ, ఉస్మాన్, మస్తాన్, పాషా, మైరుదిన్ తదితరులు పాల్గొన్నారు.



జనాభా ప్రతిపాదికన రిజర్వేషన్ పెంచాలి

నవతెలంగాణ-చంద్రుగొండ

ఎస్సీ జనాభా పెరిగిన దానికనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని మాల మహానాడు మండల అధ్యక్షులు బడుగు శంకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డికి ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగానికి అనుగుణంగా లేదని తీర్పును వెనకకు తీసుకోవాలని వర్గీకరణ వల్ల తలెత్తే సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ బీజేపీ ఎస్సీల్లో ఉన్న 59 కులాల మధ్య జగడం పెడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాలల గ్రామ పెద్దలు బడుగు వెంకటేశ్వర్లు, బేతి రాంబాబు, తలారి వెంకటి, తలారి రాంబాబు, బడుగు రవి, బడుగు (చిన్ని) వెంకటేశ్వర్లు, అంబేద్కర్ యూత్ సభ్యులు ఇల్లంగి. బాలకృష్ణ, బేతి నాగబాబు, బడుగు. గణేష్, బడుగు నాగేశ్వరరావు, భేతి వంశీకృష్ణ, కొండ. వంశీ, బడుగు. విష్ణు, బడుగు. వినోద్, రాయి రాజా తదితరులు పాల్గొన్నారు.



28 క్వింటాల రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-మునగాల

మండల పరిధిలోని వెంకటరాం పురం గ్రామ శివారులోని కోళ్ల ఫారం పక్కన ఉన్న షెడ్డులో గురువారం తెల్లవారుజామున పోలీసులు28 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం పట్టుకున్నారు.ఎస్ ఐ ప్రవీణ్ కు మార్ తెలిపిన వివరాల ప్రకారం షెడ్డులో మూటలు కట్టి డంప్ చేసే క్రమంలో నమ్మదగిన సమాచారం మేరకు దాడులు చేసి బియ్యం స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. 64 ప్లాస్టిక్ బస్తాలలో పిడిఎస్ బియ్యం ఉండగా వాటిని పట్టుబడి చేసి స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్సై ప్రవీణ్ కుమార్ తెలి పారు,పీడీఎస్ బియ్యాన్ని మండ ల పరిధిలోని నేలమర్రి గ్రామానికి చెందిన గుడిపూడి నగేష్, వివిధ గ్రామాలలో తక్కువ ధరకు కొను గోలు చేసి వేరొక ప్రాంతానికి తర లించి అధిక ధరలకు అమ్మి వ్యా పారం చేస్తున్నట్లు చెప్పారు.



రుణమాఫీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం

కోదాడరూరల్ : మండలంలో రుణమాఫీ కుటుంబ సభ్యులు నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి రజిని తెలిపారు. గురువారం మండల పరిధిలోని కాపుగల్లు గ్రామంలో రుణమాఫీ కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు.ఆగస్టు 28 నుండి సెప్టెంబర్ 11 వరకు గ్రామాల వారిగా షెడ్యూల్ ఇవ్వడం జరిగినది అన్నారు. 28 చిమిర్యాల, 29 కాపుగల్లు, 30 గుడిబండ, 31 కోదాడ, 2 సెప్టెంబర్ తమ్మరబండ పాలెం, 3 తొగర్రాయి, 4 గణపవరం, 5 యర్రారం, 6 కొమరబండ, 9 కూచిపూడి, 10 రెడ్లకుంట, 11 దొరకుంట గ్రామాలకు వ్యవసాయ శాఖ అధికారులు కుటుంబ నిర్ధారణ కొరకు రానున్నారు. కావున రుణమాఫీ కుటుంబ నిర్ధారణ రైతులు, వారి కుటుంబ సభ్యులు అందుబాటులో ఉండగలరని కోరారు.



Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

వరంగల్‌లో చెరువుల కబ్జా

కబ్జాదారుల కబంధ హస్తాల్లో వందల ఎకరాలు

- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల భేఖాతర్
- చేతివాటం ప్రదర్శించి సహకరించిన అధికారులు
- తెరవెనుక పెద్దపెద్ద రాజకీయ నేతలు..?
- హైకోర్టు ఆదేశాలతో డిజిటల్ సర్వే చేపట్టిన 'కుడా'




నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువులు, కుంటల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలసి వందల ఎకరాల భూమి కబ్జాదారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోయింది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి భారీ అవినీతికి పాల్పడటం వల్లే ఈ దుస్థితి వచ్చిందన్న ఆరోపణలున్నాయి. ఈ భూ మాఫియా వెనుక పెద్ద పెద్ద రాజకీయ నేతలున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లను పట్టించుకోలేదు. మున్సిపల్, కుడా అధికారులు యథేచ్ఛగా అనుమతులిస్తూ పోయారు. దాంతో చెరువులు కుదించుకుపోయాయి. గొలుసుకట్టు చెరువులు సైతం అంతర్ధానమయ్యే పరిస్థితి దాపురించింది. భద్రకాళి, చిన్నవడ్డేపల్లి, బంధం చెరువు, కోట చెరువులు కబ్జాకు గురయ్యాయి. తాజాగా హైకోర్టు ఆదేశాలతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్స్, షెడ్‌లు వేసుకున్న వారికి నోటీసులు ఇచ్చి ఎట్టకేలకు అందులో కొన్నింటిని కూల్చివేశారు. ఇందులో చాలా వరకు అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చలేకపోయారన్న విమర్శలు సైతం ఉన్నాయి. ఇదిలావుంటే తాజాగా 82 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల గుర్తింపునకు నీటిపారుదల శాఖ అధికారులు డ్రోన్‌లతో డిజిటల్ సర్వే చేపట్టారు. ఈ సర్వే పూర్తయితే కాని గ్రేటర్ వరంగల్ పరిధిలో చెరువుల కింద ఉన్న అసలు భూమి, ఎంత కబ్జాకు గురైందనే లెక్కలు తేలే అవకాశం ఉంది.

కబ్జా కోరల్లో వందల ఎకరాలు

హన్మకొండ నగరంలోని భద్రకాళి చెరువు కింద 336.37 ఎకరాలుండాలి. సుమారు 70-100 ఎకరాల మేరకు కబ్జా అయినట్టు తెలుస్తుంది. చెరువుల పరిరక్షణ కమిటీ పేరిట పెరుమాళ్ల లక్ష్మణ్.. కొన్నేండ్లుగా చెరువుల కబ్జాలపై ఎప్పటికప్పుడు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. ఆ కమిటీ గతంలో తేల్చిన మేరకు భద్రకాళి చెరువు కింద 70 ఎకరాల మేరకు ప్రయివేటు వ్యక్తులు కబ్జా చేశారని పేర్కొన్నారు. ఈ కమిటీ వరంగల్, హన్మకొండ జిల్లా కలెక్టర్లతోపాటు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్‌కు సైతం ప్రతిసారి ఫిర్యాదులు చేస్తూనే ఉంది. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. వడ్డేపల్లి చెరువు కింద 324.03 ఎకరాలుండగా, ఇందులో 50 ఎకరాలు కబ్జాకు గురయ్యింది. అక్రమంగా ఫంక్షన్ హాళ్ల నిర్మాణం జరిగింది. ఈ విషయంలో 'కుడా' ప్రేక్షక పాత్ర పోషించింది. నేరుగా బడా నేతలు రాజధాని నుండే అనుమతులు తీసుకొని నిర్మించారని 'కుడా' అధికారులే వెల్లడించడం గమనార్హం. వరంగల్ నగరం దేశాయిపేటలోని చిన్న వడ్డేపల్లి చెరువు కింద 100 ఎకరాలుండాల్సి ఉండగా, ఇందులో 30 ఎకరాల మేరకు కబ్జా అయ్యింది. వీవర్స్ కాలనీ, పద్మానగర్, 80 అడుగుల రోడ్డు నిర్మాణంలో ఈ చెరువు భూములు పోయాయి. కాజీపేట బంధం చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో పలువురు రెవెన్యూ అధికారులు అక్రమంగా పట్టాలు పొంది ఇండ్లను నిర్మించుకున్నారు. వీరందరికీ మున్సిపల్ అధికారులు ఇంటినెంబర్లు ఇవ్వడంతో ఆ ఇంటి నెంబర్ల పేరిట దర్జాగా రిజిస్ట్రేషన్లు చేసుకొని అనుభవిస్తున్నారు. వరంగల్ డీఆర్‌డీఓ కార్యాలయంతోపాటు, ప్రావిడెంట్ ఆఫీసు, పోలీసు ఫోరెన్సిక్ ల్యాబ్ భవనాలను సైతం ఇందులోనే నిర్మించడం గమనార్హం.

అప్పటి బీఆర్‌ఎస్ నేతల అనుచరులే..

వరంగల్ మట్టెవాడలోని కోట చెరువు కింద 159 ఎకరాలుండాల్సి ఉండగా, 50 ఎకరాలు కబ్జాకు గురైంది. బీఆర్ఎస్ కీలక నేత అనుచరులే ఇక్కడ కబ్జాదారులుగా అవతారమెత్తి అందినంత మేరకు ఆక్రమించినట్టు ఆరోపణలున్నాయి. ఎనుమాముల సాయి చెరువు కింద 11.37 ఎకరాలుండగా, ఈ చెరువు మొత్తం వరంగల్ నగరంలోని దేశాయిపేట, ఎనుమాములలోని తోళ్ల పరిశ్రమల వ్యర్థాలతో నిండిపోయి కాలుష్యంతో నిండిపోయింది. ఖిలా వరంగల్ మండలంలోని రంగశాయిపేట దామెర చెరువు కింద 134.03 ఎకరాలుండగా, ఇందులో 35 ఎకరాలు కబ్జాకు గురైంది. తిమ్మాపురం బెస్తం చెరువు కింద ఉన్న 105.30 ఎకరాల్లో 40 ఎకరాలు కబ్జా అయ్యింది. మత్తడిని సైతం ఆక్రమించి మరీ అక్రమ నిర్మాణాలు వెలిశాయి. గొర్రెకుంటలోని కట్టమల్లన్న చెరువు కింద 21.24 ఎకరాలుండగా, ఇందులో 10 ఎకరాలు కబ్జాకు గురైంది. ప్రయివేటు వ్యక్తులు వాణిజ్య సముదాయాలను నిర్మించడం గమనార్హం.

కొనసాగుతున్న ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల సర్వే : హర్షవర్ధన్, డీఈ, ఇరిగేషన్, హన్మకొండ

గ్రేటర్ వరంగల్ నగరం పరిధిలోని 82 చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల నిర్ధారణకు డ్రోన్‌లతో సర్వే చేయడం ప్రారంభించాం. రెండు వారాల్లో ఈ సర్వే పూర్తి చేశాక, చెరువులు, కుంటల వాస్తవ పరిస్థితి తెలుతుంది. ఈ సర్వే ఆధారంగా ఉన్నతాధికారులకు నివేదికను అందచేస్తాం.

'వాడ్రా' అమలు చేయాలి



హైదరాబాద్ నగరంలో 'హైడ్రా'ను అమలు చేస్తున్న విధంగా గ్రేటర్ వరంగల్ నగరంలో 'వాడ్రా' అమలు చేయాలి. నగరంలోని చెరువులు రియల్ మాఫియా చేతుల్లో అంతర్ధానమవుతున్నాయి. జిల్లాలకు వచ్చిన ప్రతి కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయింది. హైకోర్టు ఆదేశాలతోనైనా 'వాడ్రా'ను అమలు చేసి అక్రమ నిర్మాణాలను తొలగించి వరంగల్ నగరంలోని చెరువులను పరిరక్షించాలి. మొక్కుబడిగా కాంపౌండ్ వాల్స్, షెడ్లను తొలగించడం కాదని, బడా నేతలు, వారి అనుచరులు నిర్మించిన అక్రమ నిర్మాణాలను సైతం తొలగించి చెరువులను కాపాడాలి.

- పెరుమాళ్ల లక్ష్మణ్, అధ్యక్షులు, చెరువుల పరిరక్షణ సొసైటీ, వరంగల్

పెసర కొనుగోలు కేంద్రాలను ప్రారంభించండి

- మార్క్‌ఫెడ్‌కు మంత్రి తుమ్మల ఆదేశం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పెసర కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు గురువారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత వానాకాలంలో 64,175 ఎకరాల్లో పెసర పంట సాగయిందనీ, 17,841 మెట్రిక్ టన్నుల వరకు దిగుబడి వస్తుందని తెలిపారు. ప్రస్తుతానికి 12 ప్రాంతాల్లో పంట కోతకు వచ్చిందని పేర్కొన్నారు. పెసర పంట అమ్మకానికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

క్రీడారంగంలో గుణాత్మక మార్పు!



ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు
ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



నవతెలంగాణ-హైదరాబాద్

క్రీడాభివద్ధికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుదలగా ఉన్నారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలి స్టేడియంలో హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి ఆవిష్కరించిన అనంతరం స్మారక హాకీ మ్యాచ్‌ను ఆరంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ' అన్ని రంగాల్లోనూ మార్పు సాధించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. అందులో భాగంగానే క్రీడా రంగంలో గుణాత్మక మార్పు తీసుకురావాలనే సంకల్పంతో పని చేస్తున్నాం. రాష్ట్ర బడ్జెట్‌లోనూ కనీవినీ ఎరుగని రీతిలో క్రీడలకు అగ్ర తాంబూలం అందించాం. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్శిటీ ఏర్పాటుతో తెలంగాణలో క్రీడలను అంచెలంచెలుగా అభివద్ధి చేయాలని అనుకుంటున్నాం. దేశంలో ఏ రాష్ట్రం చేయని స్థాయిలో జాతీయ క్రీడా దినోత్సవం జరుపుతున్నాం. రాబోయే రోజుల్లో తెలంగాణ వేదికగా జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలు నిర్వహించనున్నాం. తెలంగాణ క్రీడా శాఖ పనితీరును సైతం ద్విగుణీకతం చేస్తామని ' తెలిపారు. జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో మంత్రి సీతక్క, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, శాట్జ్ చైర్మన్ శివసేన రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఉద్యోగులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో విజేతలకు మంత్రులు బహుమతులు ప్రదానం చేశారు.

ఒలింపియన్లకు సత్కారం : జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నుంచి పారిస్ 2024 ఒలింపిక్స్‌లో పోటీపడిన అథ్లెట్లను రాష్ట్ర ప్రభుత్వం నగదు ప్రోత్సాహకంతో సత్కరించింది. పసిడి ఫేవరేట్‌గా పారిస్‌కు వెళ్లిన స్టార్ బాక్సర్, రెండు సార్లు వరల్డ్ చాంపియన్ నిఖత్ జరీన్ అనూహ్య రీతిలో మెడల్ లేకుండా నిష్క్రమించగా... యువ షఉటర్ ఇషా సింగ్ సైతం మెడల్ ఆశలు రేపినా ఒత్తిడిలో అంచనాలను అందుకోలేదు. ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లకు రూ. 5 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహకం అందజేశారు.

ఆరంభం అదిరింది

- అట్టహాసంగా పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు
- పారిస్‌లో మొదలైన పారా విశ్వ సంబురం



నవతెలంగాణ-పారిస్ : 167 దేశాల నుంచి 4000 మందికి పైగా వైకల్యానికి ఎదురించి నిలిచిన పారా అథ్లెట్లు పోటీపడేందుకు వేదిక సిద్ధమైంది. 2024 పారిస్ పారాలింపిక్స్ క్రీడల ఆరంభ వేడుకలు బుధవారం అట్టహాసంగా (భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రి అనంతరం) జరిగాయి. పారా క్రీడాకారులు పోటీపడే విశ్వ క్రీడల ఆరంభ వేడుకల్లోనూ దివ్యాంగ కళాకారులే నత్య రూపాలు ప్రదర్శించటం హైలైట్‌గా నిలిచింది. అథ్లెట్ పరేడ్‌లో ఫ్రెంచ్ అక్షరమాల ప్రకారం అన్ని దేశాల అథ్లెట్ల బందాలు వచ్చాయి. భారత బందానికి అమిత్ (జావెలియన్ త్రో), భాగ్య శ్రీ (షాట్ పుట్) సారథ్యం వహించారు. అమిత్, భాగ్య శ్రీ భారత పతాకధారులుగా వ్యవహరించి అథ్లెట్ పరేడ్‌లో మువ్వెన్నల జెండాను రెపరెపలాడించారు. పారిస్ పారాలింపిక్స్‌లో భారత్ జంబో జట్టును బరిలోకి దింపింది. 84 మంది క్రీడాకారులు 12 క్రీడాంశాల్లో పతక వేటకు సిద్ధమయ్యారు. పారిస్ పారాలింపిక్స్‌లో 24 క్రీడాంశాల్లో పోటీలు జరుగుతున్నాయి. పారా సైక్లింగ్, పారా జూడోలను తొలిసారి పారిస్ పారాలింపిక్స్‌లో చేర్చారు. 2024 సమ్మర్ ఒలింపిక్స్ తరహాలోనే పారాలింపిక్స్ ఆరంభ వేడుకలు సంప్రదాయానికి భిన్నంగా స్టేడియం ఆవల అట్టహాసంగా సాగింది.

శీతల్‌కు రెండో స్థానం :

పారాలింపిక్స్‌లో భారత పతక వేట మొదలైంది. పారా ఆర్చర్, పసిడి పతక ఫేవరేట్ శీతల్ దేవి తొలి రోజు ర్యాంకింగ్ ఈవెంట్‌లో అదరగొట్టింది. మహిళల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో శీతల్ దేవి 703 పాయింట్లు సాధించగా.. టర్కీ పారా ఆర్చర్ 704 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో పోటీపడిన మరో భారత పారా ఆర్చర్ సరిత తొమ్మిదో ర్యాంక్ సాధించింది. ర్యాంకింగ్ రౌండ్‌లో ప్రదర్శన ఆధారంగా ప్రధాన డ్రా ప్రత్యర్థులను నిర్ణయిస్తారు.

యూనిక్ పాయింట్



శ్రీవిష్ణు, టీజీ విశ్వప్రసాద్, హసిత్ గోలీ

హీరో శ్రీవిష్ణు 'రాజ రాజ చోరా' తర్వాత డైరెక్టర్ హసిత్ గోలీతో చేస్తున్న రెండవ సినిమా 'శ్వాగ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మేకర్స్ గురువారం ఈ చిత్ర టీజర్‌ను విడుదల చేశారు.

ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ, 'టీజర్ మీ అందరికీ నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. ఇలాంటి కథ నాకు ఇచ్చిన హసిత్‌కి చాలా థ్యాంక్స్. చాలా గొప్ప కథ. ఇండియన్ స్క్రీన్‌లో ఇప్పటివరకూ రాలేదు. ఇది మన అందరి ఇళ్ళలో ఉన్న పాయింటే అయినా స్క్రీన్ పైకి ఇప్పటివరకూ రాలేదు. ఇలాంటి కంటెంట్‌ని సినిమా చేయడానికి ముందుకువచ్చిన నిర్మాత విశ్వప్రసాద్ ధన్యవాదాలు' అని తెలిపారు.

'శ్రీవిష్ణు, హసిత్‌తో కలసి 'రాజ రాజ చోర' సినిమా చేశాం. వీరి కాంబోలో ఇది మా సెకండ్ మూవీ. ఇది కంటెంట్ డ్రివెన్ వెరైటీ మూవీ. కమల్ హసన్ 'ఇంద్రుడు చంద్రుడు' లాంటి సినిమాలు చూసిన ఎక్స్‌పీరియన్స్‌ని ఇస్తుంది' అని నిర్మాత టి.జి. విశ్వ ప్రసాద్ చెప్పారు. డైరెక్టర్ హసిత్ గోలి మాట్లాడుతూ,'తాతలు ముత్తాతలతో పాటు చూడగలిగే సినిమా. విష్ణు తన క్యారెక్టర్‌ని అద్భుతంగా చేశారు. ఇది ఎప్పటికీ గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని అన్నారు.

నవచిత్రం


అరుదైన వేడుకకు ఆహ్వానం



నందమూరి బాలకృష్ణ సినీ రంగ ప్రవేశం చేసి 50 వసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా సెప్టెంబర్ 1న హైదరాబాద్ హైటెక్స్ నోవటెల్ హోటల్లో తెలుగు సినీ పరిశ్రమ ఆధ్వర్యంలో గ్రాండ్‌గా సెలబ్రేషన్స్‌ని ప్లాన్ చేశారు. ఇలాంటి అరుదైన వేడుకకు జాతీయ అవార్డు గ్రహీత, హీరో అల్లు అర్జున్‌ని తెలుగు సినీ ఇండస్ట్రీ తరపున ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ భరత్ భూషణ్, ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్, నిర్మాతల మండలి సెక్రటరీ ప్రసన్న కుమార్, తెలంగాణ స్టేట్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సెక్రెటరీ అనుపమ రెడ్డి, 'మా' అసోసియేషన్ నుండి మాదాల రవి, శివ బాలాజీ, నిర్మాత ముత్యాల రామదాసు తదితరులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా బాలకృష్ణతో తనకి ఉన్న అనుబంధం గురించి వీరితో అల్లుఅర్జున్ షేర్ చేసుకున్నారు.

అలాగే ఈ వేడుకకు తమిళం, మలయాళం, కన్నడ ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు సైతం హాజరు కాబోతున్నారు. హీరోలు శివరాజ్ కుమార్, విజయసేతుపతి, శివ కార్తికేయన్, కిచ్చ సుదీప్, దునియా విజయ్, దర్శకులు పి.వాసు, నటుడు నాజర్, నిర్మాత రాక్ లైన్ వెంకటేష్, అలనాటి కథానాయికలు సుహాసిని, మీనా, మాలా శ్రీ, సుమలత తదితరులకు దామోదరప్రసాద్, సి.కళ్యాణ్ ఆహ్వాన పత్రికను అందజేశారు.

కుబేరలో కీలక పాత్ర



ధనుష్, నాగార్జున, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'కుబేర'. నాగార్జున పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు హై బడ్జెట్‌తో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం తమిళం, తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతోంది.

కూలీలో సైమన్‌గా నాగ్

రజనీకాంత్ తాజాగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా చేస్తున్నారు. సన్ పిక్చర్స్ నిర్మిస్తోన్న ఈ చిత్రంలో సైమన్ అనే పవర్‌ఫుల్ పాత్రలో నాగార్జున నటిస్తున్నారు. నాగార్జున్ బర్త్‌డే సందర్భంగా రిలీజ్ చేసిన సైమన్‌గా నాగార్జున లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఉద్వేగభరిత కోర్ట్ రూమ్ డ్రామా



కళా సృష్టి ఇంటర్నేషనల్, మణి దీప్ ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్‌పై మహి పాల్ రెడ్డి తెరకెక్కిస్తున్న చిత్రం 'ఉద్వేగం'.

ఫస్ట్ కేసు అనేది ట్యాగ్‌లైన్. శంకర్ లుకలపుమధు నిర్మాత. త్రిగుణ్ ప్రధాన పాత్రలో, శ్రీకాంత్ అయ్యంగార్ విభిన్న పాత్రలో నటిస్తున్న ఈ చిత్ర టీజర్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ చేతుల మీదుగా విడుదలైంది. ఈ సందర్భంగా రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ,'కోర్టు రూమ్ డ్రామాతో తెలుగులోచాలా తక్కువ సినిమాలు వచ్చాయి. ట్రైలర్ చూసిన తరువాత చాలా సిన్సియర్ అటెంప్ట్ అనిపించింది. చాలా సహజంగా యాక్ట్ చేశారు.ఈ చిత్రం కచ్చితంగా తెలుగు పరిశ్రమలో వండర్ క్రియేట్ చేస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'కోర్టు రూమ్ డ్రామాల్లో మంచి సస్పెన్స్ ఉంటుంది. తెలుగులో వచ్చిన 'వకీల్ సాబ్' చిత్రం తరువాత అంత డ్రామా, సస్పెన్స్ ఉన్న చిత్రమే కాదు, చట్టాన్ని బేస్ చేసుకుని తెరకెక్కుతున్న చిత్రం కావడంతో ప్రేక్షకులకు ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు నాలెడ్జ్ కూడా అందిస్తుందని టీజర్ చెప్పకనే చెప్పింది' అని చిత్రయూనిట్ తెలిపింది.

1980 నేపథ్యంలో..



ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు నందమూరి తారక రామారావు సినీ రంగంలోకి అడుగిడు తున్నారు. ఈ చిత్రంలో తెలుగమ్మాయి వీణరావ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.

డైరెక్టర్ వైవిఎస్ చౌదరి రచన, దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌ని న్యూ టాలెంట్ రోర్స్ ఏ బ్యానర్‌పై యలమంచిలి గీత నిర్మించనున్నారు. నాగార్జున బర్త్‌డే, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం డైరెక్టర్ వైవిఎస్ చౌదరి మీడియాతో మాట్లాడుతూ,'1980లో జరగబోయే ఈ కథలో బలీయమైన తెలుగు భాష, సంస్కృతి, తెలుగు జాతి నేపథ్యం ఉంది. తెలుగు భాషా, సంస్కృతి, విలువలు గురించి చెప్పాలని ఎప్పటినుంచో భావిస్తున్నాను. సందేశంలా కాకుండా మంచి వాణిజ్య విలువలతో అన్నీ కుదిరిన కథ ఇది. ఇందులో కొన్ని సన్నివేశాల్లో భావోద్వేగాలని పద్యరూపంలో కూడా నటీనటులు వ్యక్తం చేస్తారు. ఇది తెలుగు భాషకు ఇస్తున్న ఒక జ్ఞాపిక లాంటి ప్రక్రియ' అని అన్నారు. గీత రచయిత చంద్రబోస్, డైలాగ్ రైటర్ సాయి మాధవ్ బుర్రా, నిర్మాత గీతా యలమంచిలి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రమేష్ అత్తిలి తదితరులు మరిన్ని చిత్ర విశేషాలను తెలిపారు.

ఓహ్.. టీజర్ రిలీజ్



జీవిత బడుగు సమర్పణలో ఏకారి ఫిలిమ్స్ పతాకంపై రఘు రామ్ హీరోగా, శృతి శెట్టి, నైనా పాఠక్ హీరోయిన్స్‌గా సత్యనారాయణ ఏకారి స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఓహ్!'.

కులుమనాలి, ఆగ్రా, గోవా, హైదరాబాద్, వరంగల్‌లోని అందమైన ప్రదేశాలలో షూటింగ్ పూర్తి చేసుకుని, విడుదలకు సిద్ధమైంది. ఈ సందర్భంగా చిత్ర టీజర్ ఆవిష్కరణ వేడుక ఇటీవల ఘనంగా జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా వచ్చిన గేయ రచయిత భాష్య శ్రీ టీజర్‌ను లాంచ్ చేశారు. చిత్ర సమర్పకురాలు బిఆర్ఆర్ గ్రూప్స్ అధినేత్రి జీవిత బడుగు మాట్లాడుతూ, 'మంచి క్వాలిటీతో ఈ సినిమాని ప్రేక్షకులకు అందిస్తున్నాం' అని అన్నారు.

'ఐదు చిత్రాలను నిర్మించిన అనుభవంతో ఒక కొత్త జోనర్‌లో, క్రోమో ఫోబియాని పాయింట్‌గా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని దర్శక, నిర్మాత సత్యనారాయణ ఏకారి చెప్పారు.

5 భాషల్లో కుంభ



విజయ్ రామ్, డి.ఎస్.రావు

దర్శకుడు వి.సముద్ర నిర్మిస్తూ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కుంభ'. వి.సముద్ర ఫిలిం బ్యానర్‌పై రూపొందబోయే ఈ చిత్ర ప్రారంభోత్సవం ఫిలింనగర్ దైవ సన్నిధానంలో ఘనంగా జరిగింది.

హీరో విజయ్ రామ్‌పై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు డీఎస్ రావు క్లాప్ కొట్టగా, సముద్ర సతీమణి విజయలక్ష్మి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. తొలి సన్నివేశానికి చంద్రమహేష్, దేవి ప్రసాద్ గౌరవ దర్శత్వం వహించారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత వి.సముద్ర మాట్లాడుతూ, 'బలమైన కథలను నమ్ముకుని కొత్త వాళ్లతో 5 సినిమాలు చేస్తున్నాను. అందులో 'కుంభ' చిత్రం ఒకటి. ఆరు భారతీయ భాషల్లో ఈ పాన్ ఇండియా సినిమాని తీస్తున్నాం. ఈ సినిమాతో పాటు 'వరద రాజు గోవిందం', 'రామ జన్మభూమి', 'ఇండియా సీఈఓ', 'ప్రొడక్షన్ నెం 5' వంటి సినిమాలను కూడా ఆరు భారతీయ భాషల్లో పాన్ ఇండియా సినిమాలుగా చేయబోతున్నాను. ఈసినిమాకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే తెలియజేస్తాను' అని అన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ వరంగల్ శ్రీను మాట్లాడుతూ, 'వి.సముద్ర చేసినవన్నీ హిట్ టైటిల్సే. ఆయన సినిమాలోని పాటలు సందర్భోచితంగా ఉంటాయి. ఈ సినిమాకు పని చేయడం నా అదృష్టం' అని అన్నారు.

'గతంలో థియేటర్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్న నాకు ఈ సినిమాలో కథానాయకుడిగా అవకాశం ఇచ్చిన డైరెక్టర్ సముద్రకి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఇందులో నా పాత్ర చాలా భిన్నంగా ఉంటుంది. సముద్ర సినిమాల్లో ప్రతి పాత్రకు ఎంతో ప్రాముఖ్యత ఉంటుంది. అటువంటి ప్రాముఖ్యత ఉన్న పాత్రను చేయబోతున్నందుకు చాలా ఆనందంగా ఉంది' అని హీరో విజయరామ్ చెప్పారు.

ఈ సినిమాతో సముద్ర వంటి గొప్ప వ్యక్తి పరిచయం అవ్వడం నా పూర్వజన సుకృతం. ఈ చిత్రంలో ఒక ప్రత్యేకమైన పాత్రతో పరిచయం కాబోతున్నాను అని సూరజ్ ఆదిత్య సింగ్ చెప్పారు.

ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, సంగీతం: వరంగల్ శ్రీను, డీవోపి : శ్రీ వెంకట్, ఎడిటర్ :నందమూరి హరి, రచయిత, సహ దర్శకుడు : వెంకటేష్ చిక్కాల, ఆర్ట్ డైరెక్టర్ : విజయ్ కృష్ణ, కొరియోగ్రఫీ : అజయ్, స్నేహ, ఫైట్స్ : మల్లి.